గురువారం
12-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 261
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

కులగణన నిర్ణయం అధిష్ఠానానిదే: సిద్దరామయ్య

బెంగళూరు: కులగణన డేటాను తిరిగి లెక్కించాలనే నిర్ణయం పార్టీ అధిష్ఠానానిదేనని, రాష్ట్ర ప్రభుత్వానిది కాదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కులగణనకు సంబంధించి కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, కులగణన సర్వే చేపట్టి పదేళ్లు గడిచిందని, ఇప్పుడు అది పాతదైందని అన్నారు. దీంతో పార్టీ అధిష్ఠానం తక్కువ సమయంలోనే తిరిగి జనగణన నిర్వహించాలని సూచించిందని అన్నారు. ఆ నివేదికను తిరస్కరించలేమని, సూత్రప్రాయంగా అంగీకరించామని అన్నారు. కాంతరాజ్ కమిషన్ నివేదికపై పార్టీ సీనియర్ నేతల నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేయడంపై స్పందిస్తూ... ఈ నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకుందని, తాను ఆమోదిస్తానని అన్నారు.

కాళేశ్వరంపై వాస్తవాలు వెల్లడిస్తా

విశాలాంధ్ర – హైదరాబాద్: కాళేశ్వరంపై రెండు రోజుల్లో మీడియా సమావేశం నిర్వహిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అన్ని నిజాలను బయట పెడతానని స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వాస్తవాలన్నింటినీ పూర్తి సమాచారంతో ప్రజలకు వివరిస్తానని పేర్కొన్నారు. తాను ఉన్నంత వరకు కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని అన్నారు. రాష్ట్రానికి ఆ కుటుంబమే ప్రధాన శత్రువని మండిపడ్డారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతోంది కిషన్‌రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రాజెక్టుకూ ఆయన నిధులు సాధించలేదని విమర్శించారు.

కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

ఉత్కంఠ నడుమ కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు పూర్తయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్ద ఉన్న శాఖల్లో ముఖ్యమైన హోంశాఖ, విద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలను అట్టి పెట్టుకుని మిగిలిన శాఖలను కేటాయించారు. జి.వివేక్ వెంకటస్వామికి క్రీడ, కార్మిక, న్యాయ శాఖలను కేటాయించారు. అడ్లూరి లక్ష్మణ్‌కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఇచ్చారు. వాకిటి శ్రీహరికి వాణిజ్యం, పశు సంవర్ధక శాఖలను కేటాయించారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పర్యాటక ప్రాంతంగా ములుగు జిల్లాను తీర్చిదిద్దుతాం: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర బ్యూరో– ములుగుజిల్లా: ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించడమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత పాలకులు చేసిన అప్పులను తీర్చుకుంటూనే సంక్షేమ ఫలాలను అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి పేదకుటుంబానికి గూడుతో పాటు పౌష్టిక హారం అందించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఇంచర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పీ డాక్టర్ శబరీష్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ లతో కలసి 23 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఇంచర్లలో ఏర్పాటు చేసిన సభలో పొంగులేటి మాట్లాడుతూ రూ. 22,500 కోటతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని పేదలకు సాకులు చెప్పి, 93 వేల ఇళ్లకు 60 వేలు

- మిగతా 2 లో

మంత్రివర్గం ఆమోదంతోనే నిర్మాణం

కాళేశ్వరం కమిషన్ ఎదుట ముగిసిన కేసీఆర్ విచారణ

విశాలాంధ్ర– హైదరాబాద్: బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆయన్ను పీసీ ఘోష్ కమిషన్ సుమారు 50 నిమిషాల పాటు విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి వివిధ ప్రశ్నలు సంధించింది. 115వ సాక్షిగా ఆయన్ను విచారించింది. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ బీఆర్కే భవన్ నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట హరీశ్‌రావు ఉన్నారు. మొదట దైవసాక్షిగా వాస్తవాలు చెబుతానని కేసీఆర్ చేత

- మిగతా 2 లో

శుభాంశు రోదసియాత్ర మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా రోదసియాత్ర మరోసారి వాయిదా పడింది. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఆయన బుధవారం నింగిలోకి వెళ్లాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్యతో ఆ యాత్రను వాయిదా వేస్తున్నట్లు స్పేస్‌ఎక్స్ తెలిపింది. రాకెట్‌లో లిక్విడ్ ఆక్సిజన్ లీక్ కారణంగా ప్రయోగం వాయిదా పడినట్లు 'ఎక్స్'లో పేర్కొంది. దీనిపై ఇస్రో చైర్మన్ డా.వి. నారాయణన్ స్పందించారు. మానవ సహిత యాత్ర అయినందున... ఈ ప్రయోగాన్ని వాయిదా వేయడం సరైన నిర్ణయమేనని నారాయణన్ అన్నారు. 'స్పేస్ ఎక్స్, యాక్సియం నిపుణులతో ఇస్రో బృందం చర్చలు

- మిగతా 2 లో

ఓటర్ల జాబితాలో మోసాలకు తావు లేదు

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా తయారీలో మోసాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశంలో ఓటర్ల జాబితా తయారీ ప్రపంచంలోనే అత్యంత కఠినమైన, పారదర్శక ప్రక్రియల్లో ఒకటని... ఎలాంటి మోసాలు జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. ఏటా ఓటర్ల జాబితా సవరణ సమయంలో, ఎన్నికలకు ముందు చట్టం ప్రకారం గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఓటర్ల

- మిగతా 2 లో

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలొచ్చాయ్

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష-2025 ఫలితాలు విడుదల య్యాయి. దేశవ్యాప్తంగా మే 25న ఈ పరీక్ష నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధికారులు బుధవారం ఫలితాలను విడుదల చేశారు. మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో ప్రత్యేక జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. అభ్యర్థులు సాధించిన మార్కులు, కటాఫ్ మార్కులు, ఆన్సర్ కీలను ప్రక్రియ పూర్తయ్యాక అప్‌లోడ్ చేయనున్నట్లు

- మిగతా 2 లో

భరతగడ్డ విముక్తిలో

కమ్యూనిస్టు ఉద్యమం చిరస్మరణీయం

- మార్క్సిజం, లెనినిజం ద్వారానే పేదల బతుకుల్లో మార్పు
- ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి
- సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో కూనంనేని

విశాలాంధ్ర – మహబూబ్‌నగర్: భరతగడ్డ విముక్తిలో ఎరుపెక్కిన కమ్యూనిస్టు ఉద్యమం చారిత్రాత్మకం, చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొనియాడారు. మహబూబ్ నగర్ జిల్లా సమితి నేతృత్వంలో బుధవారం సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ చౌరస్తా , అంబేద్కర్ చౌరస్తా, అశోక్ టాకీస్ చౌక్ మీదుగా వందలాది మంది ప్రజలు, కార్మికులు పార్టీ శ్రేణులతో కలిసి అల్మాస్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ప్రదర్శనతో పాటు ఎర్రజెండాలతో కదం తొక్కడంతో పాలమూరు పట్టణం ఎరుపెక్కింది. ప్రజానాట్యమండలి కళాకారులు డప్పుల నృత్యాలతో అలరించారు. అనంతరం సభలో కూనంనేని మాట్లాడుతూ కుల, మత, ధన, ప్రాంత ప్రాతిపదికన ప్రజల మధ్య వైరుధ్యాల సృష్టిస్తూ అడ్డదారుల్లో , వక్ర పద్ధతుల్లో నేటి రాజకీయ వ్యవస్థ కొనసాగుతుందని మండిపడ్డారు. ఇలాంటి నీచ రాజకీయాల

- మిగతా 2 లో

కేసీఆర్ విజయాల్లో

పదోశాతం సాధించలేరు

విచారణల పేరుతో పైశాచిక ఆనందం: కాంగ్రెస్‌పై కేటీఆర్ ధ్వజం

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ సాధించిన విజయాల్లో పదోశాతం కూడా మీరు సాధించలేరంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసలు ఆయన్ను అర్థం చేసుకోవడం కూడా మీ జన్మలో సాధ్యం కాదని చెప్పారు. బీఆర్కె భవన్‌లో బుధవారం కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరయ్యేందుకు వచ్చిన నేపథ్యంలో కేటీఆర్ ముందుగానే అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన... దాని అభివృద్ధి కోసం కేసీఆర్ చేసిన ఆలోచనలు, కృషి మరెవరూ చేయలేరని అన్నారు. కోట్లాది ప్రజల ఈకాంక్షను నెరవేర్చేందుకు చావు అంచుల వరకు వెళ్లి వచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన ప్రధాన దృష్టి కేంద్రీకరించారని తెలిపారు. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమ ప్రధాన నినాదంగా ఉన్న సాగు, తాగునీటి వనరుల కల్పన కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈప్రాజెక్టు ద్వారా రాష్ట్రం కరువు, దాహానికి శాశ్వత పరిష్కారం చూపించారని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ బలం, జీవనదృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి జోకర్ కాంగ్రెస్ నాయకులకు జీవితకాలం కూడా చాలదంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. విచారణల పేరుతో కేసీఆర్‌ను కమిషన్ ముందుకు పిలిపించడం వల్ల కాంగ్రెస్ నాయకులు పైశాచిక ఆనందం పొందగలరేమో కాని ఆయనకు ప్రజలలో ఉన్న ఖ్యాతిని తగ్గించలేరని స్పష్టం చేశారు. బ్యాగులు మోసే మీకు భగీరథ ప్రయత్నాలు అర్థం కావడానికి ఎన్ని జన్మలైనా సరిపోవు అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'కేసీఆర్ జీవితం ఒక చరిత్రగా నిలిచిపోతుందని, గత ప్రభుత్వాలు 60 ఏళ్లలో చేయలేని అనేక అభివృద్ధి పనులు కేసీఆర్ విజయవంతంగా సాధించారని కొనియాడారు.

11 ఏళ్లు... 33 తప్పిదాలు

మోదీ సర్కార్‌పై ఖడ్గే మండిపాటు



కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర పన్నిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే ఆరోపించారు.

2లో

11 మంది చావుకు

ఆర్‌సీబీనే కారణం

హైకోర్టులో కర్నాటక ప్రభుత్వం వాదన

బెంగళూరు: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాటకు ఆర్‌సీబీ యాజమాన్యానిదే తప్పిదని కర్నాటక ప్రభుత్వం చెప్పింది. తొక్కిసలాటపై బుధవారం కర్నాటక హైకోర్టులో విచారణ జరిగింది. ఆర్‌సీబీ విజయోత్సవ సమయంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారని, ఈ చావులకు ముమ్మాటికీ ఆర్‌సీబీదే బాధ్యత అని రాష్ట్ర సర్కారు తరపున వాదించిన అడ్వకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి అన్నారు. బెంగళూరు తొక్కిసలాట ఘటనకు పూర్తి బాధ్యత ఆర్సీబీ, భారత క్రికెట్ బోర్డులదేనని శశికిరణ్ శెట్టి ఆరోపించారు. చిన్నస్వామి స్టేడియం గేట్ల నిర్వహణ, ఈవెంట్‌కు సంబంధించిన టికెట్ల మేనేజ్‌మెంట్ విషయంలో ఆర్సీబీ-బీసీసీఐ మధ్య ఒప్పందం ఉందన్నారు. విజయోత్సవాలకు అభిమానులు భారీగా తరలిరావాలని సోషల్ మీడియాతో పాటు పలు మాధ్యమాల్లో

- మిగతా 2 లో

రూ.3 వేలు దాటితే

బాదుడే

యూపీఐ చార్జీలపై కేంద్రం ఖండన

న్యూఢిల్లీ: త్వరలోనే యూపీఐ లావాదేవీలపై మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేటును తిరిగి ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా యూపీఐ చెల్లింపులపై చార్జీలు వసూలు చేస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. యూపీఐ బాదుడు వార్తలను ఖండించింది. మర్చంట్ టర్నోవర్ కంటే లావాదేవీల విలువ ఆధారంగానే చార్జీలను వసూలు చేయాలని కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2 లో

ప్రతి బిడ్డకూ 'తల్లికి వందనం'

67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

విశాలాంధ్ర-సచివాలయం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా పథకం వర్తించే విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో గురువారం రూ.15వేలు చొప్పున నగదు జమచేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనుమతి ఇచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి... ఏడాది గడిచిన సందర్భంగా ఈ పథకం అమలుపై బుధవారం సచివాల యంలో సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ హాజరయ్యారు. ఎన్నికల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

లాస్ ఏంజెల్స్ విముక్తికి ట్రంప్ ప్రతిజ్ఞ

ఆగని నిరసనలు: కర్ఫ్యూ విధింపు

లాస్ ఏంజెల్స్: ఇమ్మిగ్రేషన్ దాడులకు వ్యతిరేక ఆందోళనలతో అమెరికా, కాలిఫోర్నియాలోని లాస్ ఏంజెల్స్ రగిలిపోతోంది. నగరంలో కర్ఫ్యూ అమల్లోకి వచ్చింది. కొనసాగుతున్న నిరసనల క్రమంలో విదేశీ శత్రువు దాడి నుంచి లాస్ ఏంజిల్స్ విముక్తికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిజ్ఞ బూనారు. లాస్ ఏంజిల్‌ను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. వీధుల్లోకి వేలాది మంది సైనికులను మోహరిస్తున్న ఆయనను నిరోధించాలని కోరుతూ కాలిఫోర్నియా నాయకులు కోర్టును ఆశ్రయించినగానీ యూఎస్ మెరైన్స్ ఆ ప్రాంతానికి వందల సంఖ్యలో చేరుకున్నారు. ట్రంప్ ఆదేశాలతో వీధుల్లో నిరసనలను కట్టడి చేసేందుకు సైనికులు రంగంలోకి దిగడంపై డెమొక్రాట్లు ఆందోళన వ్యక్తంచేశారు. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ అభ్యంతరం తెలిపినప్పటికీ నాలుగు వేల మంది నేషనల్ గార్డ్ సిబ్బందిని ట్రంప్ క్రియాశీలం చేశారు. సైనిక మోహరింపు అనవసరం, అక్రమం, రాజకీయ ప్రేరేపితమని గవర్నర్ విమర్శించారు. ట్రప్ మాత్రం తన చర్యలను సమర్థించుకున్నారు. నార్త్ కరోలినాలోని ఫోర్ట్‌బ్రాగ్ సైనిక స్థావరంలో మాట్లాడుతూ 'సైనిక వీరుల తరతరాలుగా సుదూర తీరాలలో తమ రక్తాన్ని చిందించినది మన దేశం దండయాత్ర, మూడవ ప్రపంచ అరాచకత్వంతో నాశనం కావడాన్ని చూడటానికి కాదు' అని ట్రంప్ అన్నారు. లాస్ ఏంజెల్స్ మేయర్ కరెన్ బాస్ డౌన్‌టౌన్‌లో కర్ఫ్యూ విధించారు. ఈ కర్ఫ్యూ నివాసితులకు, వర్కర్లకు వర్తించదన్నారు. అక్రమ వలసదారుల అరెస్టుకు నిరసనగా గత వారాంతంలో లాస్ ఏంజెల్స్ లో నిరసనలు మిన్నంటాయి. అట్లాంటాలో యూఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ-ఐస్) కార్యాలయం ముందు ఆందోళన జరిగింది. ఆస్టిన్, న్యూయార్క్, షికాగో, సియాటెల్, డాలస్, కెంటకీ తదితర నగరాల్లో ఐస్ దాడులకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించారు. ఈనెల 6న ఐస్ ఏజెంట్లు లాస్ ఏంజెల్స్ లో అక్రమ వలసదారుల ఏరివేత కోసం దాడులు నిర్వహించడంతో నిరసనలు మొదలయ్యాయి. లాటిన్ దేశాల వలసదారుల కోసం ఐస్ ఏజెంట్లు సోదాలు చేశారని నిరసనకారులు ఆరోపించారు. వందలాది మంది ఫెడరల్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. కాలిఫోర్నియా సర్వీస్ ఎంప్లాయిస్ ఇంటర్నేషనల్ యూనియన్ అధ్యక్షుడితో సహా వంద మందిని అరెస్ట్ చేయడంతో నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. దీంతో కర్ఫ్యూ అమల్లోకి వచ్చింది.

ట్రంప్, మస్క్, వాన్స్‌ను చంపేస్తాం అల్‌ఖైదా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సహా ఇజ్రాయిల్‌కు అనుకూలంగా ఉన్న కీలక మంత్రులను చంపేస్తామంటూ ఉగ్ర సంస్థ అల్‌ఖైదా హెచ్చరించింది. ఈ మేరకు 30 నిమిషాల వీడియోను అల్‌ఖైదా అరేబియన్ ద్వీపం విభాగం (ఏక్యూఏపీ) అధినేత సాద్ బిన్ అతేఫ్ అల్-అవ్లాకీ విడుదల చేశాడు. అతడిపై రూ.50 కోట్ల రివార్డు ఉంది. 2024 మార్చిలో అల్-అవ్లాకీ ఈ సంస్థకు అధిపతిగా బాధ్యతలు చేపట్టాడు. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమానికి ప్రతీకారం తీర్చుకోవాలని అల్-అవ్లాకీ పిలుపునిచ్చాడు. అమెరికాలోని లక్ష్యాలపై దాడులకు హద్దులు లేవన్నాడు. చెప్పాడు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సె సహా శ్వేతసౌధం కీలక సిబ్బంది, వారి కుటుంబాలను లక్ష్యంగా చేసుకొంటామని అతను హెచ్చరించాడు. ఏక్యూఏపీ యెమన్ కేంద్రంగా పనిచేస్తోంది. లాడెన్ మరణం తర్వాత అత్యంత ప్రమాదకర గ్రూపుగా మారింది. అమెరికా, యూరప్ దేశాల్లోని లక్ష్యాలపై గతంలో గురిపెట్టింది. 2009 అండర్‌వేర్ బాంబర్ కుట్ర, 2015లో చార్లె హెబ్డోపై దాడికి పాల్పడింది. దీంతో ఈ సంస్థను అమెరికా ఉగ్ర జాబితాలో చేర్చింది.

శాంతిని కోరుకుంటున్నాం: రష్యా

మాస్కో: మాస్కో శాంతిని కోరుకుంటున్నదని, ఉక్రెయిన్ కూడా ఏకీభవిస్తే పశ్చిమ దేశాలకు ప్రతినిధిగా వ్యవహరించడం మానేయాలని రష్యా అధ్యక్ష కార్యాలయాధికారి వ్లాదిమిర్ మెడిన్‌స్కీ అన్నారు. బయట వారి మార్గదర్శకత్వాన్ని అనుసరించకుండా దేశ ప్రజలకు ఉక్రెయిన్ ప్రాధాన్యత ఇస్తే తమ రెండు దేశాల మధ్య ఒప్పందం సాధ్యమని ఆయన గతంలోనూ చెప్పారు. ఉక్రెయిన్ వైఖరి మారని కారణంగానే ప్రతిస్పందన అనివార్యమవుతోందని మెడిన్‌స్కీ తెలిపారు. ఆయన 'ది వాల్ స్ట్రీట్ జర్నల్'తో మాట్లాడుతూ 'ఇది అన్నాదమ్ముల మధ్య పోరు. ఎవరు విజ్ఞులన్నది కీలకం. ఈ యుద్ధంతో మా మధ్య వ్యత్యాసాలు మరింత పెరిగాయి. అందుకోసమే ఇదంతా సాధ్యమైనంత త్వరగా ముగియాలని కోరుకుంటున్నాం' అని అన్నారు.

బందీల మార్పిడి: ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో కీలక పరిణామం చోటుచుకుంది. రెండు దేశాలు బందీలను విడుదల చేశాయి. ఇటీవల టర్కీలోని ఇస్తాంబుల్‌లో జరిగిన చర్చలు, కుదిరిన అవగాహన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. బందీల విడుదలకు సంబంధించిన వీడియోను రష్యా రక్షణ శాఖ పంచుకుంది. విడుదలైన బందీలకు బెలారస్‌లో వైద్యం అందించిన తర్వాత మాస్కోలోని ఆస్పత్రులకు తరలిస్తామని పేర్కొంది. ఎంతమంది విడుదల అయ్యారన్నది మాత్రం వెల్లడించలేదు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా యుద్ధ ఖైదీల మార్పిడిని ధ్రువీకరించారు. 25 ఏళ్ల కంటే తక్కువ వయసున్న బందీల విడుదలకు రెండు దేశాల మధ్య అంగీకారం కుదిరినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఆరు వేల సైనికుల మృతదేహాలను అప్పగించేందుకు కుదిరిన అవగాహన క్రమంలో 1,212 మృతదేహాలతో కంటైనర్లు పంపగా... ఉక్రెయిన్ ఈ ప్రణాళికను నిలిపివేసిందని మాస్కో విమర్శించింది. మాస్కో తీరును కీవ్ ఖండించింది. మృతదేహాల తరలింపుపై కచ్చితమైన తేదీని నిర్ణయించలేదని తెలిపింది. ఇదిలావుంటే కీవ్, ప్రధాన రేవు పట్టణమైన ఒడెసాపై మాస్కో తాజా దాడిలో ముగ్గురు మరణించారు. 13 మంది గాయపడ్డారు.

మంత్రివర్గం ఆమోదంతోనే నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణం చేయించిన కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్.. మొత్తం 18 ప్రశ్నలను అడిగారు. ఆనకట్టల నిర్మాణానికి ఎవరు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించింది. ఈక్రమంలో కాళేశ్వరం రీఇంజినీరింగ్ గురించి కేసీఆర్ వివరించారు. ఆనకట్టల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం ఉందా అని కమిషన్ ప్రశ్నించింది. క్యాబినెట్, ప్రభుత్వ ఆమోదంతోనే ఆనకట్టల నిర్మాణం జరిగిందని కేసీఆర్ బదులిచ్చారు. వ్యాప్కోస్ సిఫారసుల ప్రకారమే నిర్మాణం జరిగిందని.. అన్ని అనుమతులు తీసుకున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అన్ని అంశాలతో ఉన్న పుస్తకాన్ని కమిషన్‌కు అందజేశారు. కాళేశ్వరం కార్పొరేషన్ గురించి కమిషన్ ఆరా తీసింది. కొత్త రాష్ట్రంలో నిధులను దృష్టిలో ఉంచుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు కేసీఆర్ తెలిపారు. ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. బ్యారేజీల్లో నీటి నిల్వ గురించి కేసీఆర్‌ను కమిషన్ అడిగింది. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజినీర్లు చూసుకుంటారని కేసీఆర్ చెప్పారు. బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతికపరమైన అంశమన్నారు. నీటి లభ్యత దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. జీవో 45ను, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ బుక్‌ను కమిషన్‌కు అందజేశారు. ఇప్పటి వరకు కాళేశ్వరం కమిషన్ 114 మందిని విచారించింది.

11 ఏళ్లు... 33 తప్పిదాలు

కలబురగి: కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కుట్ర పన్నిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు. వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణానికి సంబంధించి బళ్లారి ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలపై ఈడీ దాడులను ఖర్గే బుధవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ప్రస్తావించారు. ఈడీ దాడుల ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలను బీజేపీ లక్ష్యంగా చేసుకుందని, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలికలు తేలేదని, పార్టీ ఐక్యంగా ఉందని చెప్పారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన కేవలం అబద్ధాలు, యువకులను మోసం చేయడానికే పరిమితమైందని ఖర్గే ఆరోపించారు. '11 ఏళ్లలో 33 తప్పిదాలు చేశారు. పార్లమెంటులో కూడా నేను ఇదే మాట చెప్పిన సంగతి అందరికీ తెలుసు. ఓట్ల కోసం అబద్ధాలు చెప్పడం, యువకులను మోసం చేయడం, పేదలను కడగండ్లపాలు చేస్తున్న ఇలాంటి ప్రధానిని నా రాజకీయ జీవితంలోనే చూడలేదు' అని ఖర్గే ఘాటుగా విమర్శించారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని భర్తీ చేయకుండా ఖాళీగానే ఉంచడంపై ప్రభుత్వాన్ని ఖర్గే నిలదీశారు. ప్రధాన విపక్ష పార్టీకి ఆ పదవి దక్కాల్సి ఉందని చెప్పారు. ఆ ఖాళీని భర్తీ చేయకపోవడం చట్టవిరుద్ధమని, విపక్షాలకు చిన్న పోస్ట్ కూడా మోదీ ఇవ్వడం లేదని అన్నారు. ప్రజాస్వామ్యం పట్ల ఆయనకు నమ్మకం లేదనడానికి ఇదే నిదర్శమన్నారు. ఇందుకు సంబంధించి మోదీకి లేఖ కూడా రాసినట్టు చెప్పారు. కర్నాటక మహర్షి వాల్మీకి ఎస్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై సమగ్ర దర్యాప్తు జరిగేంత వరకూ తమ పార్టీ ఎలాంటి వ్యాఖ్యలు చేయదని ఖర్గే చెప్పారు. ఈ కుంభకోణానికి ఈడీ ఎలాంటి మలుపు ఇస్తుందో చూడాలనుకుంటున్నామన్నారు. నిధుల దుర్వినియోగం అంశ ఈడీకే వదిలిపెడుతున్నామని, కేసు విచారణలో తాము జోక్యం చేసుకోబోమని తెలిపారు. ఎన్నికల్లో ఎవరు, ఎంతెంత ఖర్చుపెట్టారో అందరికీ తెలుసునని, ఈడీ దాడులు కొత్తేమీ కాదని, ఇలాంటి దాడులతో కాంగ్రెస్ పార్టీని విడగొట్టడం మాత్రం అసాధ్యమని అన్నారు. కర్నాటకలో మంత్రివర్గ విస్తరణ ఇప్పటికిప్పుడు లేదని ఖర్గే తెలిపారు. బెంగళూరులో ఇటీవల జరిగిన తొక్కిసలాట సహా పలు అంశాలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీలో రాహుల్ సమక్షంలో చర్చించినట్టు చెప్పారు. కర్నాటకలో మళ్లీ కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని ఖర్గే సమర్థించారు. కులగణనలో సామాజిక, ఆర్థిక అంశాలను ఇప్పటికే ప్రభుత్వం పాటిస్తోందని, ఇందులో చోటుచేసుకోని మరో క్రైటీరియాను కొత్త సర్వేలో చేర్చాల్సి ఉంటుందని చెప్పారు. బెంగళూరులో తొక్కిసలాటకు బాధ్యత వహిస్తూ సిద్దరామయ్య రాజీనామాకు బీజేపీ డిమాండ్ చేయడంపై అడిగినప్పుడు... ఈ ఏడాది మొదట్లో కుంభమేళాలో విషాదం చోటుచేసుకుందని, ప్రధాని నరేంద్రమోదీ, అక్కడి సీఎం యోగి ఆదిత్యనాథ్ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. తొక్కిసలాట ఊహించలేదని, దానికి క్షమాపణ చెప్పాల్సి ఉంటుందని, బాధిత కుటుంబ సభ్యులకు తాము (ప్రభుత్వం) అండగా నిలబడటమే కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఖర్గే చెప్పారు.

ఓటర్ల జాబితాలో మోసాలకు తావు లేదు

(మొదటిపేజీ తరువాయి)

జాబితాలను అందజేయడం జరుగుతుందన్నారు. మంగళవారం ఎన్నికల సమగ్రతపై స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రధానోపన్యాసం చేస్తూ... 1960 నుండి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితాలను పంచుకుంటున్నామని, వాదనలు, అభ్యంతరాలు , అప్పీళ్లకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో రిగ్గింగ్ చేయడానికి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తున్నారని కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు ఆరోపించడాన్ని...ఎన్నికల సంఘం తోసిపుచ్చిన సంగతి విదితమే. దాదాపు 50 దేశాల ఎన్నికల సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 100 మందికి పైగా అధికారులు పాల్గొన్న ఈ సదస్సులో జ్ఞానేష్‌కుమార్ మాట్లాడుతూ... భారతదేశ ఎన్నికల సమగ్రత, స్థాయి, వైవిధ్యాన్ని హైలైట్ చేస్తూ... ఎన్నికల కమిషన్ పాత్రను పునరుద్ఘాటించారు. యావత్తు ఎన్నికల ప్రక్రియను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, పోలీసులు, వ్యయ పరిశీలకులు, మీడియా నిశితంగా పర్యవేక్షిస్తుందని తెలిపారు. వీరంతా వివిధ దశలలో ఏకకాలిక ఆడిటర్ల మాదిరిగానే వ్యవహరిస్తారని అన్నారు. భారతదేశంలో ఎన్నికల నిర్వహణకు ఆధారమైన సమన్వయ స్థాయిని కూడా ఆయన ప్రశంసించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బంది, పోలీసు బలగాలు, పరిశీలకులు , రాజకీయ పార్టీల ఏజెంట్లతో సహా 20 మిలియన్లకు పైగా సిబ్బందితో, ఎన్నికల కమిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా అవతరిస్తుందని... దాదాపు ఒక బిలియన్ ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోగలరని తెలిపారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే పూర్తి చేసిందన్నారు. అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, మొదటి దశలో రానివారు నిరాశ చెంద వద్దని సూచించారు. లబ్ధిదారులకు వెంటనే ఇసుక కూపన్లను అందజేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అటవీ శాఖ అధికారులు సైతం ఇళ్ల నిర్మాణ పనులను అడ్డుకోవద్దని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డబుల్ బెడ్ రూమ్ లు అందిస్తామని ప్రజలను మోసం చేశారని, నేడు ఇందిరమ్మ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టడంతో... ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాను పర్యాటక ప్రాంతంగా మార్చడానికి నిధులు కేటాయించడం జరిగిందని, రూ.70 కోట్లతో రామప్పలో పనులు చేపట్టడమే కాకుండా, రూ.30 కోట్ల తో ఐలాండ్ అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. ఇక్కడి ఎంతో ప్రాచుర్యం పొందిన బొంగు చికెన్ పై శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వెంకట్రావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల ప్రజల భూములకు పట్టాలు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. బలరాం నాయక్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో ములుగు జిల్లా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అటవీ గ్రామాలకు రహదారుల నిర్మాణం... రూ. ఎనిమిది వందల కోట్లతో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ములుగు జిల్లాకు 4,900 ఇందిరమ్మ గృహాలు మంజూరు అయ్యాయని , ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా అర్హుల జాబితా ప్రజల ముందు ఉంచామని వివరించారు. అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి బిడ్డకూ 'తల్లికి వందనం'

(మొదటిపేజీ తరువాయి)

ముందు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ 6 హామీల్లో తల్లికి వందనం పథకం కీలకమైంది. ఈ పథకంలో చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ పథకం కింద జూన్‌లోనే అర్హులైన తల్లులందరికీ నగదు బదిలీ చేస్తామని ప్రభుత్వం అనేకసార్లు ప్రకటించింది. ఈ మేరకు విద్యార్థుల సంఖ్య, విధి విధానాలపై ప్రభుత్వం కసరత్తు చేసింది. పాఠశాల విద్యాశాఖ డేటాను గ్రామ, వార్డు సచివాలయాల సమాచారంతో సరిపోల్చుకుంది. గతంలో సేకరించిన డేటా ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమ్మ ఒడి పేరుతో విద్యార్థుల తల్లుల ఖాతాలో ఏడాదికి రూ.13 వేలు జమ చేశారు. అదే పథకానికి మార్పులు చేసి... తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పథకం కింద ఒకటి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థుల తల్లులు ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేల చొప్పున నగదు జమ చేయనుంది. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ నగదు జమ చేయనుంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతుండటంతో చాలా మంది విద్యార్థుల తల్లులు ఎంతో ఆసక్తిగా ఈ పథకం కోసం ఎదురుచూస్తున్నారు. అయితే గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో తల్లికి వందనం, విద్యార్థుల సంఖ్య, నిధులపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని 67,27,164 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తిస్తుంది. 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.8745 కోట్లను ప్రభు త్వం జమ చేయనుంది. 1వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో చేరే విద్యార్థు లకు తర్వాత నగదు జమచేస్తారు. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే ఆ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకంపై విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయనుంది.

కమ్యూనిస్టు ఉద్యమం చిరస్మరణీయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామానికి పెను ప్రమాదకరమని అన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా... కమ్యూనిజంను అంతం చేస్తామని విర్రవీగుతున్నారని, కమ్యూనిజానికి అంతం ఉండదన్నారు. దోపిడి కొనసాగినంత కాలం కమ్యూనిజం అజరామరంగా ఉంటుందని అన్నారు. మార్క్సిజం, లేనినిజం ద్వారానే పేదల బతుకుల్లో మార్పు వస్తుందన్నారు. ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టులను అంతం చేయడం సబబు కాదని, బూటకపు ఎదురుకాల్పులు నిలుపుదల చేయాలన్నారు. మావోయిస్టుల భౌతిక కాయాలు ఇవ్వడానికి కేంద్రం వణుకుతుందంటేనే కమ్యూనిజం బలం ఏందో తెలుస్తుందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో తుది శ్వాస విడిచే వరకు సొంత ఆస్తులు పంచుతూ జైలు నిర్బంధాలు, అక్రమ కేసులు లెక్కచేయకుండా ప్రాణ త్యాగాలకు సైతం వెరవని త్యాగధనులు కమ్యూనిస్టులేనని అన్నారు. నిత్యం ప్రజలలో మమేకమవుతూ ప్రజా పోరాటాలను నిర్మించాలని, ప్రజా సంఘాలను విస్తరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవాలు ముగింపు 2026, డిసెంబరు 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ మాట్లాడుతూ ప్రజా సమస్యలను విస్మరిస్తే పాలకులకు పుట్టగతులు ఉండవని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై వీరోచిత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్ జి, మాజీ జిల్లా కార్యదర్శి బి.పరమేశ్వర్ గౌడ్, ఉషనయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నరేందర్ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి. రాము, గోవర్ధన్, అల్వాల్ రెడ్డి, భాగీ కృష్ణ, చాంద్ బాషా, సత్యనారాయణ రెడ్డి, శ్రీను, సంతోష్, రాజు లక్ష్మణ్, రాజశేఖర్, మహేష్, ఆంజనేయులు, చెన్నయ్య, దేవానంద్, గోపాల్ నాయక్, నరసింహ, యాదయ్య, రఘుపతి, బాల నరసయ్య, ఆనంద్, బసవరాజ్, శ్రావణ్, పద్మావతి, భార్గవి, ఇందిరా, సత్యమ్మ, పద్మ, వరలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

శుభాంశు రోదసియాత్ర మళ్లీ వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

జరిపింది. దీని ప్రకారం ప్రయోగానికి ముందు లీక్‌ను సరిచేసి, అవసరమైన ధ్రువీకరణ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించాం. మానవ సహిత యాత్ర అయినందున... ఈ ప్రయోగాన్ని వాయిదా వేయడం సరైన నిర్ణయమే' అని ఆయన తెలిపారు. క్రయోజనిక్ ఇంజిన్ల విషయంలో నిపుణుడు అయిన నారాయణన్‌కు అధిక శీతలీకరణ ద్రవ ఆక్సిజన్ నిర్వహణ విషయంలో అవగాహన ఉంది. భారత్ సొంత క్రయోజనిక్ ఇంజిన్ల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ ప్రయోగం నేపథ్యంలో ఇస్రో చైర్మన్ ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్‌లోనే ఉన్నారు. ఫాల్కన్ 9 రాకెట్ ప్రయోగానికి సంబంధించిన పరిణామాలను ఆయన దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రయోగం మంగళవారమే జరగాల్సి ఉంది. అయితే ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ ఉన్న ప్రాంతంలో వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో దీనిని బుధవారానికి వాయిదా వేశారు. సాంకేతిక సమస్య వల్ల తాజాగా మళ్లీ వాయిదా పడింది. తదుపరి తేదీని ఇంకా ప్రకటించలేదు.

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలొచ్చాయ్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను సైతం యూపీఎస్సీ విడుదల చేసింది. ఐఎఫ్ఎస్ (మెయిన్) పరీక్షకు అర్హత సాధించిన వారి జాబితాను వేరేగా విడుదల చేసింది.

సివిల్ సర్వీసెస్ (మెయిన్స్) పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులు రూ.200 చెల్లించి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మహిళలు/పీడబ్ల్యూబీడీ/ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు మినహాయింపు. ఈనెల 16 నుంచి 25వ తేదీ వరకు కమిషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు ప్రత్యేక విండో ఉంచుతారు. కోర్టు కేసుల నేపథ్యంలో నలుగురు అభ్యర్థుల ఫలితాలను పెండింగ్‌లో ఉంచినట్లు యూపీఎస్సీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

రూ.3 వేలు దాటితే బాదుడే

(మొదటిపేజీ తరువాయి)

యోచిస్తున్నట్లు తెలిసింది. రూ.మూడు వేల కంటే ఎక్కువ ఉన్న అన్ని యూపీఐ చెల్లింపులపై ఛార్జీలను విధించే అవకాశం ఉందని తెలుస్తోంది. చిన్న మొత్తాలపై మాత్రం ఎలాంటి ఫీజులు ఉండవని తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రధానమంత్రి కార్యాలయం, ఆర్థిక వ్యవహారాల శాఖ, ఆర్థిక సేవల విభాగం ఉన్నతాధికారుల మధ్య చర్చల దశలో ఉన్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. దేశవ్యాప్తంగా డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు యూపీఐ, రూపే లావాదేవీలపై అన్ని రకాల ఎండీఆర్ చార్జీలను 2022లో ప్రభుత్వం రద్దు చేసింది. అయితే, ఈ చార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావేదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గు చూపే అవకాశాలున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కృష్ణమ్మ ఒడిలో యోగాసనాలు

వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డు

విశాలాంధ్ర-విజయవాడ: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం యోగ అని, ప్రతిఒక్కరు దైనందిన జీవితంలో యోగాను అలవర్చుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అన్నారు. బుధవారం విజయవాడలోని బెరం పార్కు వద్ద కృష్ణమ్మ తీరంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ నేతృత్వంలో నిర్వహించిన వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా మెగా ఈవెంట్‌లో పాల్గొనేందుకు యోగాప్రియులు విశేషంగా తరలిరావడంతో కృష్ణా తీరం పులకించింది. పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఏడీ-పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేశ్ కుమార్ మీనా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రకు యోగాప్రియులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. అనంతరం అజయ్‌జైన్ మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన మెగా యోగా ఈవెంట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని, యోగాంధ్ర-2025లో ప్రపంచ రికార్డు సాధించడం గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా దాదాపు రెండు కోట్ల మంది యోగాలో పాల్గొంటున్నారన్నారు. యోగాచరణను ఒక్క రోజుకే పరిమితం చేయకుండా జీవితాంతం యోగాను అనుసరించడం వల్ల ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటామన్నారు. ఆంధ్రాను యోగాంధ్రగా మార్చడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అజయ్ జైన్ పిలుపునిచ్చారు. ముకేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజలకు యోగాపై అవగాహన కల్పించి... చైతన్యవంతులు చేయడంలో ఎన్‌టీఆర్ జిల్లా ముందు వరుసలో నిలుస్తోందని, ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకుంటోందన్నారు. వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా థీమ్‌ను ఎంపిక చేసుకొని కృష్ణాతీరంలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమం ప్రపంచ రికార్డు సాధించినందుకు గర్వపడుతున్నట్లు, ఇందుకు కారణమైన జిల్లా యంత్రాంగాన్ని, పాల్గొన్న ఔత్సాహికులకు ఎంపీ కేశినేని చిన్ని అభినందనలు తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, ప్రజల సమష్టి కృషితో రికార్డు సొంతమైందని.. బెరం పార్కు, పున్నమి ఘాట్ వద్ద నదీతీరం గతంలోనూ వివిధ ప్రపంచ రికార్డులకు వేదికగా నిలిచిందన్నారు.

కార్మిక భద్రతకు ప్రాధాన్యం: వాసంశెట్టి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పారిశ్రామిక అభివృద్ధితో పాటు కార్మిక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. విజయవాడ హయత్ ప్లేస్ హోటల్‌లో 'సామర్థ్యాభివృద్ధి... గట్టి భద్రతా ఆడిట్ శిక్షణ'ను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. అందులోను సినర్జీ కంపెనీలో భారీ స్థాయిలో ప్రాణ నష్టం వాటిల్లిందని, ఇలాంటి ప్రమాదాలను నివారించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై నివేదిక ఇవ్వాలని వసుధా మిశ్రా కమిటీనీ, చంద్రబాబు నేతృత్వంలో ఒక కమిటీని నియమించిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పిస్తే వారు ప్రమాదాల గురించి ఆలోచించకుండా ఉత్పాదకతను పెంపొందించే దిశగా పనిచేస్తారన్నారు.

11 మంది చావుకు ఆర్‌సీబీనే కారణం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌సీబీ విపరీతంగా ప్రచారం చేసిందన్నారు. మొత్తం ప్రపంచం స్టేడియానికి రావాలి అన్నట్లుగా వాళ్లు వ్యహరించారని ఆయన చెప్పారు. చిన్నస్వామి స్టేడియం సామర్థ్యం 33 వేలేనని, కానీ దాదాపుగా 3.5 నుంచి 4 లక్షల మంది వరకు గేట్ల దగ్గర గుమిగూడారని అడ్వకేట్ జనరల్ తెలిపారు. ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల తీవ్ర గందరగోళం నెలకొనడంతో తొక్కిసలాట చోటుచేసుకుందని, ప్రాణాలు పోవడమే గాక ఎంతో మంది గాయాలపాలయ్యారని చెప్పుకొచ్చారు.

విక్టరీ పరేడ్, స్టేడియం సెలబ్రేషన్స్‌కు సంబంధించి రాష్ట్ర సర్కారు నుంచి అధికారికంగా ఆర్‌సీబీ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఆయన వివరించారు. విక్టరీ పరేడ్ నిర్వహిస్తున్నామన్న సమాచారం మాత్రమే ఇచ్చారని, ఆ కార్యక్రమాన్ని నిర్వహించి తీరాలని అప్పటికే వాళ్లు నిర్ణయించుకున్నారని శశికిరణ్ శెట్టి తెలిపారు. అనుమతులు కోరుతూ సర్కారుకు ఎలాంటి లేఖలు రాలేదని, కేవలం సమాచారం మాత్రమే ఇస్తూ కర్నాటక క్రికెట్ అసోసియేషన్ నుంచి ఇంటిమేషన్ లెటర్ అందిందని చెప్పుకొచ్చారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శించిన మంత్రులు

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో: గోవిందరావు పేట తాహసిల్దార్ కార్యాలయంను బుధవారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం శాసనసభ్యులు తెల్ల వెంకటరావు, జిల్లా కలెక్టర్ టి.ఎస్.దివాకర్, ఆర్డీఓ వెంకటేష్, సంబంధిత అధికారులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: జిల్లాలో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం జిల్లాలోని గూడూరు మండలంలోని మట్టేవాడ ఆశ్రమ హైస్కూల్, అంగన్వాడీ కేంద్రం, రెవెన్యూ సదస్సును, మహబూబాబాద్ పట్టణంలోని ఇందిరా నగర్ అంగన్వాడి కేంద్రం, ప్రైమరీ స్కూల్‌లను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామసభలపై రైతులు ప్రత్యేకంగా అవగాహన పెంచుకొని రైతుల సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాలు, పునర్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గత వారం రోజులుగా (మిషన్ మూడ్) యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక అధికారులు విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాల సానిటేషన్, పరిశుభ్రత విద్యుత్, ఫ్యాన్స్, టేబుల్స్, టాయిలెట్స్ క్లాస్ రూమ్స్, బ్లాక్ బోర్డ్, యూనిఫార్మ్స్, తదితర అన్ని సౌకర్యాలను సిద్ధం చేస్తూ ఒక పండుగ వాతావరణంలో పాఠశాలలను ప్రారంభించేందుకు అన్ని చర్యలు కుంటున్నామని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో పౌష్టిక ఆహారం అందిస్తూ పిల్లల లెర్నింగ్ లెవెల్స్ శారీరక ఎదుగుదల మానసిక ఎదుగుదల తదితర (5) అంశాలపై దృష్టి పెట్టాలని అంగన్వాడి టీచర్స్‌కు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, సిడిపిఓలు నిలోఫర్, శిరీష, సంబంధిత విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది ఉన్నారు.

సమస్యపై స్పందించిన విద్యుత్ అధికారులు

విశాలాంధ్ర - తొర్రూర్: తొర్రూరు పట్టణం, మండలలోని విద్యుత్ సమస్యలను విద్యుత్ అధికారులకు తెలియజేసిన వెంటనే ఆ సమస్యను పరిష్కరించారని తొర్రూర్ పట్టణ బీరప్ప నగర్ రైతు పుట్ట యాకయ్య అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తొరూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలోని వెంకటాపురం రోడ్డులో అకాల వర్షం గాలి దుమారం ద్వారా 11 కె.వి 4 స్తంభాలు పక్కకు ఒరిగి, విద్యుత్ వైర్లు క్రిందికి వేలాడాయి. ప్రమాదం పొంచి ఉండడంతో గమనించిన రైతులు, పుట్ట యాకయ్య స్థానిక లైన్మెన్ ఎల్ల స్వామికి చరవాణి ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన లైన్మెన్ ఎల్ల స్వామి విద్యుత్ అధికారులకు తెలియజేసి, విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్తు సిబ్బందితో కలిసి వంగి ఉన్న కరెంటు స్తంభాలు, వైర్లను సరి చేశారు. ఈ సందర్భంగా పుట్ట యాకయ్య, రైతులు మాట్లాడుతూ విద్యుత్ అధికారులకు సమస్య తెలిపిన వెంటనే వచ్చి ప్రమాద బారి నుండి విద్యుత్తు స్తంభాలను సరిచేసినందుకు విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ స్తంభాలు, కరెంటు వైర్లు వంగి ఉన్న వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని లైన్మెన్ ఎల్ల స్వామి ప్రజలను, రైతులను కోరారు. విద్యుత్ స్తంభాలను సరిచేసిన వారిలో విద్యుత్ సిబ్బంది బందు శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల విభజనపై సమీక్ష

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: రామగుండం నగర పాలక సంస్థను అరవై డివిజన్లుగా పంచిన నేపథ్యంలో పునర్వ్యవస్థీకరణ జరుగుతున్న తీరును పురపాలక ప్రాంతీయ సంచాలకులు షాహీద్ మసూద్ బుధవారం పరిశీలించారు. రామగుండం నగర పాలక సంస్థ వార్డుల విభజన ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న ఆయన నగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ తో భేటీ అయి చర్చించారు. డివిజన్ల విభజనకు సంబంధించి ప్రజల నుండి వస్తున్న సలహాలు, సూచనలు, ఆక్షేపణల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ విభాగం అధికారులతో సమావేశమై డివిజన్ల విభజన ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. పట్టణ ప్రణాళికా విభాగం రూపొందించిన డివిజన్ మ్యాపులను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్, పట్టణ ప్రణాళికాధికారి నవీన్, రెవెన్యూ ఆఫీసర్ ఆంజనేయులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు శంకర్ రావు, ఖాజా సానిటరీ ఇన్స్పెక్టర్లు కుమారస్వామి, కిరణ్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని మండల వ్యవసాయ అధికారి వై జానకి రాములు తెలిపారు కొండమల్లేపల్లి పట్టణం లోని ఎరువుల దుకాణములను మండల వ్యవసాయ అధికారి జానకి రాములు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ ఎస్.కె గౌస్ పాషా ఆధ్వర్యం లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు విత్తనములను ఎంఆర్పి ధరలకంటే ఎక్కువ విక్రయించరాదని ఎరువుల విక్రయం కేవలం ఈపాస్ యంత్రాల ద్వారా మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల మాత్రమే కొనుగోలు చేయాలని రైతులు విత్తనములు విక్రయించిన తర్వాత రసీదు తీసుకోవాల్సిందిగా తెలిపారు. వారి వెంట ఏఈఈ సుభాష్, నరసింహారెడ్డి, హమీద్, ఏఈ ఓ సురేష్, మల్లేష్ స్థానిక డీలర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలు పిల్లలతో కళకళలాడాలి : మంత్రి సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో: అంగన్వాడీ కేంద్రాలు పిల్లలతో కళకళలాడాలని, ఎలాంటి ఒత్తిడిలేని ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను చిన్నారులకు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న అమ్మ మాట - అంగన్వాడీ బాట ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ములుగు ఐ సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలోని వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ అధికారి తుల రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తో కలసి జిల్లాలో అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సామాన్యుడికి విద్య అందని ద్రాక్షలా ఉండకూడదని, రాష్ట్రంలో 3 సం.లు నిండిన ప్రతీ బిడ్డ ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అభ్యసించాలనే గొప్ప లక్ష్యం తో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇట్టి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, అందులో భాగంగానే ఈ రోజు ఈ "అమ్మ మాట - అంగన్వాడీ బాట" కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ తల్లితండ్రులు 3 నుండి 5 సం.లోపు వయస్సున్న తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రం లో చేర్పించి వారు పూర్వ ప్రాథమిక విద్యను పొందేలా చూడాలని జిల్లాలోని తల్లి తండ్రులకు పిలుపునిచ్చారు. అనంతరం నల్లగుంట అంగన్వాడీ కేంద్రం లో కొత్తగా ప్రీస్కూల్ (పూర్వ ప్రాథమిక విద్య) లో చేరిన చిన్నారులకు మంత్రి, జిల్లా కలెక్టర్, అధికార యంత్రాంగంతో కలిసి అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా 5 సం.లు వయస్సు నిండి ప్రాథమిక పాఠశాలకు ప్రమోట్ అయిన పిల్లలు ప్రత్యేక వస్త్రధారణలో రాగా వారికి మంత్రి సర్టిఫికెట్లు ప్రధానం చేసి "గ్రాడ్యుయేషన్ డే" నిర్వహించారు. అనంతరం జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా బాలల పరిరక్షణ విభాగము ములుగు ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆవిష్కరించారు. ములుగుజిల్లాను బాలకార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్ పిల్లతో ఈ కార్యక్రమంలో ఆర్ జె డి ఝాన్సీ లక్ష్మీ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, సి డి పి ఓ లు, శిరీష, ప్రేమలత, విజయ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీ యు) జె ఓంకార్, జిల్లాలోని వివిధఇచ్చ్ ఐ సి డి ఎస్ ప్రాజెక్టుల పరిధిలోని సూపర్వైజర్లు, డిడబ్ల్యూఓ కార్యాలయం, డీసీపు తదితరులు పాల్గొన్నారు.

హత్యాకాండలను నిలిపివేసి.. శాంతి చర్చలు జరపాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మధ్యభారతంలో అనాదిగా అడవులే తమ సర్వస్వం గా భావించి జీవిస్తున్న అమాయక ఆదివాసీ గిరిజనులపై ప్రధాని మోదీ, హెమ్ మంత్రి అమిత్ షా ఒక వ్యూహం ప్రకారం యుద్ధం ప్రకటించి హత్యాకాండకు పాల్పడుతోందని వామపక్షాలు, విపక్షాల ప్రముఖ నాయకులు ఆరోపించారు. ఈ చర్యలను ప్రజా సంఘాలు, దేశ ప్రజలు సమాజానికి ఒక విపత్తుగా భావించి ముక్తకంఠంతో కండిస్తూ ఉద్యమించాలని పిలుపు తెచ్చారు. మంగళవారం శేషగిరిభవన్‌లో వామపక్ష, విపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో నాయకులు సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సీపీఎం జిల్లా నాయకులు రేపాకుల శ్రీనివాస్, టిజెఎస్ జిల్లా నాయకులూ మల్లెల రామనాథం, మాస్ లైన్ జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గౌస్ పాషా, బిఆర్ఎస్ జిల్లా నాయకులు అనుదీప్, బిఎస్పి జిల్లా నాయకులు కురుమళ్ల శంకర్, టిపిఎఫ్ జిల్లా నాయకులు ప్రశాంత్ లు పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని, ఆదివాసీ చట్టాలను కేంద్రప్రభుత్వం ఉల్లంగించి 'ఆపరేషన్ కగార్' పేరుతో దుర్మార్గపు చర్యలకు పాల్పడుతోందన్నారు. మావోయిస్టుల పేర అమాయక ఆదివాసీ బిడ్డలను సైతం బూటకపు ఎన్కౌంటర్లు చేస్తూ పొట్టన పెట్టుకుంటోందని ఆరోపించారు. దేశ రక్షణకోసం సరిహద్దుల్లో ఉంచాల్సిన సైనికులను మన ప్రజల కోసం పోరాడుతున్న మావోఇస్టులపైకి ఉసిగొల్పుతూ హత్యలకు ప్రేరేపిస్తోదని విమర్శించారు. శత్రు దేశాలుగా మారిన చైనా, పాకిస్తాన్ దుశ్చర్యలపై పోరాడలేని కేంద్రంలోని ప్రధాని మోదీ దేశ ప్రజలపై తమ ఆర్ఎస్ఎస్ వ్యూహాత్మక ఎజెండాను అమలు చేస్తున్నట్లు తీవ్రంగా ఆరోపించారు. ప్రభుత్వం 2026 నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని హెూమ్ మంత్రి అమిత్ షా ప్రకటించడాన్ని దేశ ప్రజలు ఎన్నటికీ ఆమోదించారని స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్యం, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం దేశాన్ని ఆర్థికంగా తమ వారికి దోచిపెడుతూ ప్రజలపై భిన్న రకాల శాపాలను కురిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి ప్రజల సంక్షేమం కోసం బాధ్యత పనిచేస్తేనే ఎప్పటికైనా ప్రజలు స్వాగతిస్తారని స్పష్టం చేశారు. శతాబ్దాలుగా అటవీ ప్రాంతంలో జీవిస్తూ ఖనిజ సంపదకు కాపలాదారులుగా ఉన్న ఆదివాసీ లను, వీరికి అండగా ఉన్న మావోయిస్టులను మట్టిబెట్టి కార్పొరేట్ శక్తులకు సంపదను కట్టబెట్టే కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్ పేర కేంద్రం తెరలేపిందని దేశ ప్రజలకు అర్థమైంది అన్నారు. తక్షణమే 'కగార్' పేరుతో జరుపుతున్న హత్యాకాండకు స్వస్తి చెప్పి శాంతి చర్చల కోసం కేంద్రం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల తిరుగుబాటుతో కేంద్రంలోని మోడీ సర్కార్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, ఫహీమ్, కె ఉమర్, కల్తీ వెంకటేశ్వర్లు, సతీష్, గోపాల్ రావు, దేవదానం, భూక్యా రమేష్, కృష్ణయ్య, సంజీవ్, నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై రైతులు అవగాహన పెంచుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలంలోని మట్టేవాడ, ఆశ్రమ హై స్కూల్, అంగన్వాడీ కేంద్రం, రెవెన్యూ సదస్సును, గూడూరు, గుండెంగా ప్రభుత్వ సెకండరీ పాఠశాలలను జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ మాట్లాడుతూ నూతన భూభారతి రెవెన్యూ చట్టం 2025, రెవెన్యూ గ్రామ సభలపై రైతులు ప్రత్యేకంగా అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ సదస్సులను పక్కాగా వినియోగించుకోవాలన్నారు. గత వారం రోజులుగా (మిషన్ మూడ్) యుద్ధ ప్రాతిపదికన ప్రత్యేక అధికా రులు విద్యాసంస్థలు, అంగన్వాడి కేంద్రాల సానిటేషన్, పరిశుభ్రత విద్యుత్, ఫ్యాన్స్, టేబుల్స్, టాయిలెట్స్ క్లాస్ రూమ్స్, బ్లాక్ బోర్డ్, యూనిఫార్మ్స్, తదితర అన్ని సౌకర్యాలను సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు విద్యా సంస్థలలో అంగన్వాడీ కేంద్రాలలో నాణ్యమైన బలవర్ధకమైన ఆహారాన్ని మధ్యాహ్నం భోజనంగా అల్పాహారంగా న్యూట్రిషన్ ఫుడ్‌గా అందించడం ద్వారా ప్రభుత్వ సంస్థలలో హాజరు శాతం పెంచేందుకు ప్రత్యేక అధికారులు హెచ్ఎంలు కాంప్లెక్స్ ఇన్చార్జులు ప్రతి ఒక్కరు ఒక ఉద్యమం రూపంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ఉన్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ కోమల, మండల ప్రజా పరిషత్ అధికారి ఎర్రవీరస్వామి, ఎంపీ ఓ సత్యనారాయణ, హెచ్ఎంలు సదాశివం, రాము సిడిపిఓలు నిలోఫర్, శిరీష,లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి : కలెక్టర్

విశాలాంధ్ర - ఖమ్మం : ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం ఉంచి పిల్లలను పంపాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా కల్లూరు మండలంలోని ఓబుల్ రావు బంజర గ్రామంలో గతంలో మూతబడిన ప్రాథమిక పాఠశాలను గ్రామ ప్రజలు, తల్లిదండ్రుల సమక్షంలో పండుగ వాతావరణంలో బడి పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఇక్కడ విద్య అందిస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో 1500 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, వీటిలో మూతబడిన పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని అన్నారు. గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 96 శాతం ఉత్తీర్ణత ఉంటే, ప్రైవేట్ పాఠశాలల్లో ఆ సంఖ్య కేవలం 91 శాతం అని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఫలితాలను ప్రభుత్వ పాఠశాలలు సాధిస్తున్నాయని కలెక్టర్ గుర్తుచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కల్లూరు మండలంలో ప్రారంభించుకున్న పాయాపూర్, లక్ష్మీపురం, ఓబుల్ రావు బంజార పాఠశాలల రినోవేషన్ కోసం 10 లక్షల రూపాయల చెక్కును కల్లూరు ఆర్డీవోకు అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎంత మంది విద్యార్థులు అంగన్వాడీ కి వస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, కల్లూరు ఆర్డీఓ ఎల్. రాజేందర్, ఎంపీడీఓ., ఎం.ఈ.ఓ. పి. నివేదిత, సి.డి.పి.ఓ. సి.హెచ్. నిర్మలా జ్యోతి, సూపర్వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్ ఐ.వరలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఆత్మీయ భరోసా తక్షణమే అందించాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కూలీలకు సంవత్సరానికి 12,000 ఆత్మీయ భరోసా అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నాడు ఆయన నేరేడుచర్ల మండలం తెలగ రామయ్యగూడెం గ్రామంలో జరిగిన మండల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకునేందుకు ఐక్య ఉద్యమాలు నిర్మించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని సాధించుకునేందుకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించామని యూపీఏ 1 ప్రభుత్వ హయాంలో కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకాన్ని తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి బడ్జెట్లో నిధుల కోత విధిస్తూ మెల్లమెల్లగా ఉపాధి హామీ పథకాలు ఎత్తివేసేందుకు కేంద్రం చేసిన ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ సంవత్సరానికి 12 వేల రూపాయలతో పాటు జాబ్ కార్డు ఉన్న ప్రతి ఉపాధి కూలీకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రథమ ప్రాధాన్యత పేద వ్యవసాయ కార్మికులకు ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజులు 700 రూపాయల వేతనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశానికి సోమగాని వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సోమ గాని ప్రసాద్, యల్లావుల నరేష్, చలక మీది ప్రసాద్ పాల్గొన్నారు.

సింగరేణి విద్యాసంస్థల్లో కాలేజీ ఎటాచ్డ్ హాస్టల్స్ మంజూరు చెయ్యాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం : సింగరేణి విద్యాసంస్థల్లో పేద మధ్య తరగతి విద్యార్థుల కోసం కాలేజీ అటాచ్డ్ హాస్టల్స్ ఏర్పాటు చేయాలని ఎస్సి ఎస్టీ బిసి మైనారిటీ విద్యార్థి ఎదురు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. సింగరేణి విద్యాసంస్థల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్ నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు కాలేజీ అటాచ్డ్ హాస్టల్ అనుమతులు అవసరమన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం సింగరేణి సి ఎండి ఎన్. బలరామ్ ను కలిసి సమస్యల వినతి పత్రాన్ని సమర్పించారు. సింగరేణి వ్యాప్తంగా ముఖ్యంగా కొత్తగూడెం జిల్లాలో ఇంటర్, డిగ్రీ, పీజీ, మంచిర్యాలలో పాలిటెక్నిక్ కళాశాలలున్నాయన్నారు. నిరుపేద విద్యార్థులు అందులో చదువుతూ హాస్టల్స్‌లో ఉండాలంటే ఏడాదికి సుమారు రూ. 50 వేల ఖర్చు అవుతున్నట్లు చెప్పారు. అప్పుడే విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కాలేజీ ఎటాచ్ హాస్టల్ అనుమతులు కావాలంటే కాలేజీ ఎట్ కమిషనర్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, కాకతీయ యూనివర్సిటీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఆ అనుమతుల కోసం సింగరేణి యాజమాన్యం కృషి చేయాలని కోరారు. తన అభ్యర్థన పట్ల సింగరేణి సి ఎం డి బలరామ్ సానుకూలంగా స్పందిస్తూ కాలేజీ అటాచ్డ్ హాస్టల్ అనుమతుల కోసం కృషి చేస్తానని వెల్లడించినట్లు శివశంకర్ తెలిపారు.

డిజిఎం వెల్ఫేర్, డిజిఎం సీపీఆర్ఎంఎస్ అధికారుల భాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి కార్పొరేట్‌లో డిజిఎం (పర్సనల్) వెల్ఫేర్ అధికారిగా కేసా నారాయణ రావు, డిజిఎం (పర్సనల్) సిపిఆర్ఎంఎస్‌గా బి.శివకేశవరావులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి కంపెనీ వ్యాప్తంగా ఏరియాలలో వివిధ హోదాలలో పనిచేసి, డిజిఎం పర్సనల్ నారాయణరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేట్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది వారికి సాదరంగా స్వాగతం పలికారు. తరువాత వెల్ఫేర్ విభాగంలో జరిగే కార్యక్రమాలపై డీవైపిఎంలు, సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. కొత్తగూడెం ఏరియా డిజిఎం(పర్సనల్) గా పనిచేస్తూ కార్పొరేట్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిపిఆర్ఎంఎస్ సెల్ కు బదిలీపై వచ్చిన శివ కేశవ రావు భాధ్యతలు స్వీకరించిగా డిపార్ట్మెంట్ అధికారులు, ఆ సెల్ సిబ్బంది ఆత్మీయంగా స్వాగతం పలికారు. వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌లో ఏజిఎంగా పనిచేస్తు కార్పొరేట్ పిఎం వింగ్ కు బదిలీ అయిన జి.రాజేంద్ర ప్రసాద్‌కు జిఎం కిరణ్ కుమార్, కార్పొరేట్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు సన్మానించారు. వెల్ఫేర్ డిపార్ట్మెంట్ కు వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పిఎం వింగ్‌లో పదవీ భాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు సత్యనారాయణ, శివ కుమార్, కిరణ్ కుమార్, ఉదయ్ కుమార్, కార్పొరేట్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో మినీ రైస్ మిల్లుల వితరణ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పి రోహిత్ రాజు అన్నారు. ఆయా గ్రామాల్లో కనీస సౌకర్యాలను అందజేయటమే తమ ప్రధాన లక్ష్యంగా ముందుకెళుతున్నట్టు తెలిపారు. బుధవారం చర్ల మండలంలోని 20 మావోయిస్టు ప్రభావిత సరిహద్దు గ్రామాలకు మినీ రైస్ మిల్లులను అందజేసిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. రాళ్లపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్పి తోపాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ కూడా పాల్గొన్నారు. సుమారుగా రూ.50 లక్షల వ్యయంతో 20 గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మినీ రైస్ మిల్లులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైస్ మిల్లు కోసం ఏర్పాటు చేసిన షెడ్డుతో కలిపి ఒక్కో యూనిట్ విలువ రూ. 2,50,000 ఖర్చు అయిందన్నారు. ఈ ప్రాంత ఆదివాసీ ప్రజలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలు అందించే లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీ గ్రామాలలోని యువత అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. అనంతరం అడమయ్యను ఎస్పీ గ్రామస్తుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. చర్ల సీఐ రాజు వర్మ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తె చర్యలు : ఎస్పీ

విశాలాంధ్ర - భద్రాచలం: ప్రజల మధ్య శాంతి పెద్దలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా క్షమించేది లేదని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు స్పష్టం చేశారు. బుధవారం ఆయన భద్రాచలం పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన సతీష్ హత్య కేసు విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలనీ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసులను సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి. నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఇన్స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు స్వప్న, రామకృష్ణ, శ్యామ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యమవుతున్న మైనారిటీ గురుకుల ఉద్యోగుల వేతనాలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల వేతనాలను తరచూ ఆలస్యం చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా చేరిన ఈ ఉద్యోగులకు ప్రవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు చేసారు. జీతాలు కూడా వీరికి చెల్లించేది ఏజెన్సీలే కావడం విషాదం. ఈ ప్రైవేటు ఏజెన్సీల విధానమే లోపాధికారిగా, అక్రమాలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చేలా ఉంటుందని ఏళ్ల తరబడి రాజకీయ పక్షాలు అభ్యంతరాలు చెప్తూ వస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీల భాగోతాలు ఎన్ని బయటపడ్డప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా వాటీనే ప్రోత్సహించటం గమనార్హం. వారి ద్వారానే నియామకాలు, జీతాల చెల్లింపులు కొనసాగించడంతో ఉద్యోగుల్లో అభద్రతా భావం ఏర్పడుతుంది. ఈ ఉద్యోగులను ఏజెన్సీల ద్వారా నియామకం చేయటంలోనే అనేక లోపాలు పొడసూపుతున్నాయి. జిల్లా కలెక్టర్ చైర్మన్ గా ఆయా శాఖల అధికారుల కమిటీల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తే కనీసం ఉద్యోగ భద్రత, సమయం ప్రకారం జీతాలు, జవాబుదారీతనం ఉంటుందని విపక్ష నాయకులు చెప్తున్నారు. ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తూ అప్పట్లో బిఆర్ ఎస్ ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు ఏజెన్సీల విధానమే అనుసరిస్తున్నారు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియామకాలు చేయటం వల్ల అనేక అవినీతి, అక్రమాలు కొత్తగూడెం జిల్లాలో గతంలో బయటపడ్డ ఉదంతాలున్నాయి. కాగా ప్రస్తుతం రెండు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలను అధికారులు వెంటనే విడుదల చెయ్యాలని ఉద్యోగుల తరపున జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 204 మైనారిటీ పాఠశాలలు, 204 ఇంటర్ కళాశాలల్లో పనిచేస్తున్న వందలాది మంది ఔట్ సోర్సింగ్ జీతాలు అందలేదు. సమ్మర్ హాలిడేస్ కారణంగా జీతాలు రాలేదని ఒక అధికారి తెలిపారు. అరకొర జీతాలు అందుకునే ఈ ఉద్యోగులకు ఆ జీతాలతో కుటుంబాల మనుగడ కన్నాకష్టంగా మారింది. పైగా ఈ మైనారిటీ పాఠశాలలు కళాశాలలో మహిళలు మహిళ టీచర్లకు రాత్రివేళ డ్యూటీ వేయడం కూడా చాలా ఇబ్బందిగా మారింది. రాత్రివేళల్లో స్టడీ అవర్స్ పేర పాఠశాలల్లో మహిళలు గడపటం అంటే ఒక రకంగా అభద్రతగానే భావిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో 80 శాతం మంది ఆర్థికంగా బీద, మధ్యతరగతి వారే ఉండటం గమనార్హం. ముస్లిం మైనారిటీ ఉద్యోగులకు జీతాలు రాక గడచిన బక్రీద్ పండుగ వేళ ఆయా కుటుంబాల పరిస్థితి దయనీయంగా గడిచింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు సక్రమంగా చెల్లించాలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని మైనార్టీ సంఘాల నాయకులు కోరుతున్నారు. మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల పట్ల విధానాలు మార్పు చేయాలని కోరుతున్నారు. మైనార్టీ గురుకులాల్లో డిగ్రీ కళాశాలలు లేక ఇంటర్ పూర్తి చేసిన ముస్లిం బాల బాలికలు 60 శాతం మంది డ్రాప్ అవుట్స్ గా మారుతున్నారని నాయకులు లెక్కలు చెప్తున్నారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక వారి తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తుంది. ఈ విద్య సంవత్సరానికి ప్రతి జిల్లాలో బాలబాలికలకు వేరువేరుగా కనీసం రెండు డిగ్రీ కళాశాలలైన ఏర్పాటు చేయాలని ముస్లిం సంఘాల నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సంపాదకీయం

విధ్వంసం సరే... పునర్నిర్మాణం ఎప్పుడు?

తెలుగుదేశం పార్టీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చి నేటికి సరిగ్గా సంవత్సరం పూర్తయింది. ఐదేళ్ల వైఎస్ఆర్‌సీపీ విధ్వంసకర పాలనకు తెరదించుతూ 2024 జూన్ 12వ తేదీన నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. టీడీపీ, జనసేన పార్టీ మాత్రమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని మొదట్లో జనం అనుకున్నారు. అయితే బీజేపీ కూడా ఈ కూటమిలో చేరడంతో అది కాస్త ఎన్‌డీఏగా మారిపోయింది. దీంతో అనేకానేక సందేహాలు, సనాతన ధర్మాల నడుమ కూటమి సర్కారు తన తొలియేడును ముగించేసింది. జగన్ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని చెప్పిన కూటమి ఆ దిశగా అడుగులు వేస్తోందా అంటే కొంతమేరకు అనుమానించాల్సిందే. బీజేపీ కబంధహస్తాల్లో చిక్కుకుపోయిన రాష్ట్ర ప్రభుత్వం తప్పటడుగులు వేస్తున్నదన్న విమర్శలు ఆరు మాసాలకే షురువయ్యాయి. కార్పొరేట్లకు వరాలిస్తూ, పేదలను శాపగ్రస్థులను చేస్తే ఏడాది పాలన దారితప్పకుండా ఉంటుందా? ఒకటి మాత్రం నిజం! ఏడాదికాలంలో కొన్ని రంగాలు పురోగమిస్తున్నాయి. అద్భుతాలు జరగకపోయినా, అమరావతిపై ఆశలు మొలకెత్తాయి. చంద్రబాబు మార్కు పాలన అటుఇటుగా కన్పిస్తోంది. మోదీ ఝుళిపించే కొరడాకు భయపడకుండా పాలన చేస్తే కచ్చితంగా జనం జేజేలు పలకకమానరు. కాకపోతే ఎన్నో భయాలు, ఇంకెన్నో ప్రచారాలు, మరెన్నో ఉత్పాతాలు బాబుగారికి స్వేచ్ఛనిస్తాయా? చంద్రబాబు గతంలోనే 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పాలించారు. అంటే పదిహేనేళ్లు ఆ కుర్చీలోనే ఉంటూ అపారమైన అనుభవాన్ని సంపాదించుకున్నారు. ఇన్నేళ్ల అనుభవజ్ఞుడు మన సీఎంగా ఉన్నప్పుడు ప్రజలకు అన్యాయం జరుగుతుందని ఎవరైనా భావిస్తారా? అలాంటిది జరగకూడదనే ఆశించాలి మరి! ఏమాటకామాట, గడిచిన సంవత్సర కాలంలో ఒక కోణం నుంచి చూస్తే కచ్చితంగా 50 శాతం మార్కులు ఇవ్వవచ్చు. కొన్ని సానుకూల ఫలితాలను ప్రశంసించకుండా ఉండలేం. బక్కగా ఉండే అధికార పాలనావ్యవస్థ కాస్త చక్కబడింది, చిక్కబడింది. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి వాటిలో కొన్నింటిని నెరవేర్చింది. ఆర్థిక కష్టాలకు వెరవకుండా అధికారంలోకి వచ్చిన మరుక్షణమే సామాజిక భద్రత పింఛన్లను 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచింది. పింఛన్లు అందుకుంటున్న వారిలో వృద్ధులు, వితంతువులతోపాటు ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పుకళాకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులు ఉన్నారు. వికలాంగులకిచ్చే 3 వేల పింఛనును రూ. 6 వేలకు పెంచింది. కొత్తగా స్పౌజ్ కేటగిరీని తీసుకువచ్చి, భర్త చనిపోతే, మరుసటి నెలలోనే భార్యకు ఆ పింఛను అందేలా వ్యవస్థను ఏర్పాటు చేయడం శుభదాయకమే. అన్నక్యాంటిన్లను పునరుద్ధరించి రూ.5కే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేసి, కూలీలు, చిరుద్యోగుల కడుపునింపే ప్రయత్నం చేయడం హర్షామోదమే. రోజుకు సగటున రెండున్నర లక్షల మందికి 203 అన్నక్యాంటిన్లు ఆకలి తీరుస్తున్నాయి. దీపం–2 పథకం ప్రారంభించి, తొలి విడత కింద 1.15 కోట్ల మందికి ఉచిత సిలిండర్ అందించారు. ఈ పథకం వల్ల ఐదేళ్లలో మొత్తం రూ.13,423 కోట్లు ప్రభుత్వంపై భారం పడుతుంది. ఉచిత ఇసుక పథకంతో నిర్మాణ రంగానికి ఊతం లభించింది. ప్రజలపై టన్ను ఇసుకకు రూ.375 భారం తగ్గినప్పటికీ, టీడీపీ దిగువశ్రేణి, మధ్య, మధ్య ఎగువశ్రేణి నేతల అవినీతి, అక్రమ రవాణా పెచ్చుమీరిపోయింది. ఏడాది ఆలస్యమైనా మెగా డిఎస్సీని ప్రకటించడం, పరీక్షలు కూడా ప్రారంభం కావడం ఒకింత నిరుద్యోగులకు ఊరటే. అమరావతి నిర్మాణం తిరిగి గాడినపడింది. పోలవరం పరుగులు మొదలయ్యాయని, జగన్ పాలనలో ఊరువిడిచి పారిపోయిన పరిశ్రమలు మళ్లీ వస్తున్నాయని కూటమి చెప్పుకుంటోంది. కాకపోతే, ఈ మూడింటికీ కేంద్ర ప్రభుత్వ సహకారం నూటికి నూరు శాతం ఉండాలి. నిత్యం దగాకోరు మాటలతో కాలంవెలిబుచ్చే మోదీ ప్రభుత్వం ఇక్కడి కూటమి సర్కారుకు ఏ మేరకు చేయూతనిస్తుందో చెప్పలేం. గొప్ప తోడ్పాటును ఆశించలేం కూడా. అయితే మూడు రాజధానుల గందరగోళం నుంచి ఉపశమనం కలగడం శుభసూచికమే.

ఇదంతా ఒక పార్శ్వమైతే, కుప్పలుతెప్పలుగా ఇచ్చిన హామీలన్నీ పెండింగ్‌లో ఉండటం మరో పార్శ్వం. ఎన్నికల్లో కూటమి నేతలు ప్రకటించిన సూపర్ 6 హామీల్లో సగానికి ఇంకా కదలికే లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి కల్పిస్తామని ప్రకటించారు. అదింకా జరగలేదు. ఆగస్టు 15 నుంచి ఇది అమలు చేస్తామని ఈ మధ్యనే చెప్పుకొచ్చారు. ఇంకా అనుమానమే. ఈ పథకం అమలైతే, నెలకు రూ.265 కోట్లు చొప్పున ఏడాదికి రూ.3,180 కోట్లు మేరకు ప్రభుత్వంపై భారం పడటం ఖాయం. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం ఇస్తామని చెప్పారు. దాదాపు 55 లక్షల మంది రైతులకు లబ్ధిచేకూరుతుంది. పీఎం కిసాన్ పథకంతో కలుపుకొని రూ.20 వేలు రావాల్సి ఉంటుంది. తల్లికి వందనం పథకం కింద ప్రతి ఏడాది ప్రతి స్కూలు విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. తొలి ఏడాది గాల్లో కలిసిపోయినా, రెండో ఏడాదికి విధివిధానాలు ప్రకటించి, అమలుకు పూనుకున్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇవ్వడంపై ఇంకా స్పష్టత లేదు. బహుశా నిధులు లేవన్న సాకు ఉండనే ఉంది. 20 లక్షల ఉపాధి అవకాశాలు లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి అనే అంశం కూడా సూపర్‌సిక్స్‌లో భాగమే. దీంట్లో ఇప్పటివరకు డీఎస్సీ, మరికొన్ని పోస్టుల భర్తీకి మాత్రమే ఏర్పాట్లు జరిగాయి. నిరుద్యోగ భృతి జాడే లేదు. ఈ అంశాలన్నీ అసమ్మతిని పెంచకమానవు. 178 వాగ్దానాలు ఇచ్చిన కూటమి ఇప్పటివరకు 16 వాగ్దానాలను మాత్రమే అమలు చేసిందన్న ప్రధాన ఆరోపణ ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. కార్పొరేట్లకు సేవలు చేయడంలో మాత్రం ముందుంది. అభివృద్ధి భ్రమల్లో భూములను ధారాదత్తం చేయడం ఆయాచితంగా జరిగిపోతోంది. గిరిజన ప్రాంతాల్లో అమూల్యమైన భూములను గ్రామసభలు నిర్వహించ కుండానే అదానీకి అప్పగించేస్తున్నారు. కొత్తగా అమరావతిలో 7 వేల ఎకరాలను ఇచ్చేందుకు సిద్ధపడినట్లు చెపు తున్నారు. రాజధాని ఏరియాలో భూములు అభివృద్ధి చేయకపోవడంతో పూలింగ్‌కు ఇచ్చిన రైతులకు నమ్మకం సన్నగిల్లకుండా ఉంటుందా? ఇంటి వద్దకే రేషన్ బియ్యం ఒక విజయవంతమైన పథకం. కానీ దాన్ని రద్దుచేసి, డీలర్ల వ్యవస్థను పునరుద్ధరించడం విచారకరం. 5 వేలు ఉండే ఊరిలో కోటి రూపాయల బెల్ట్‌షాపు వ్యాపారం చేస్తుంటే అది దోపిడీ కాక ఇంకేమిటి? విజన్ 2047 సంగతేంటోగానీ, కార్పొరేట్ విజన్ మాత్రం అమలవుతోంది. అప్పులు పెరిగిపోతున్నాయి. మళ్లీ జగన్ పాలనను తలపిస్తే, ఇక కూటమి గొప్పతనమేముంటుంది?

లాస్ ఏంజెల్స్‌లో అల్లకల్లోలం

టి.ఎస్. అశోక్

అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలను తీసుకున్నప్పటినుంచి డొనాల్డ్ ట్రంప్ కార్యకలాపాలు ప్రపంచవ్యాప్తంగా అలజడి రేపుతున్నాయి. దిగుమతి సుంకాలు అపారంగా పెంచి స్థానికంగా ప్రజల వ్యతిరేకతను రుచి చూశారు. అలాగే ఐరోపా దేశాలలోనూ, దక్షిణాసియాలోనూ సుంకాల పెంపునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. తాజాగా గత మూడురోజులకుపైగా అప్సరసల నగరంగా పిలుచుకునే లాస్ ఏంజెల్స్‌లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ దేశాలనుంచి ముఖ్యంగా మెక్సికో నుంచి వచ్చిన వలసవాదులను వెనక్కిపంపేందుకు తీసుకున్న నిర్ణయంపై లాస్‌ఏంజెల్స్‌లోనూ ఇంకా అనేక నగరాలలో నిరసన ప్రదర్శనలను జరిగాయి. పోలీసులకు, నగర ప్రజలకు మధ్య దాడులు జరిగాయి. సైన్యాన్ని పిలిపించి అందోళనలు అణచివేస్తామని ట్రంప్ ప్రకటించారు. వలసవాదులను దేశం నుంచి తిరిగి బలవంతంగానైనా పంపించివేస్తామని ట్రంప్ ఎన్నికల ప్రచార సమయంలోనే ప్రకటించారు. ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ఏజంట్లు ప్రజాదరణపొందిన షాపింగ్ సెంటర్లు హోమ్ డిపో లాంటి వాటిని చుట్టుముట్టి ఆందోళన చేశారు. లాటిన్ అమెరికా దేశాల నుంచి వచ్చిన కార్మికులు అక్రమ వలసదారులని పేర్కొంటూ వారిని నేరస్థులుగా ఆరోపించారు. అనేక కార్మిక యూనియన్‌లకు నాయకుడిగా ఉన్న డేవిడ్ హుయర్టాను డిటెయిన్ చేసిన అనంతరం పరిస్థితి చాలా కల్లోలంగా మారింది. ఆస్ట్రేలియాకు చెందిన ఒక వ్యక్తిపైన సైనికులు దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో నిరసనకారులు చెలరేగిపోయారు. నేషనల్ గార్డుకు చెందిన దళాలు రంగంలోకి దిగాయి.

డెమొక్రటిక్ పార్టీకి చెందిన రాష్ట్ర గవర్నర్ జోక్యం చేసుకున్నారు. కాలిఫోర్నియా నగరంలోనూ ఫెడరల్ ప్రభుత్వం అక్రమచర్యలకు పాల్పడిందని వలసవాదులు తెలుసుకున్నారు. వీధుల్లోకి వచ్చి తీవ్ర ఆందోళనకు పూనుకోవడంతో శాంతి భద్రతల పరిస్థితి కాలిఫోర్నియా రాష్ట్రంలో తీవ్రతరమైంది. ఈ నగరంలో ట్రంప్ తీసుకున్న వలసవాదులను బైటకుపంపే నిర్ణయంపై పెద్ద ఆందోళన జరగడంతో ప్రభుత్వం రక్షణ దళాలు కాల్పులు జరిపాయి. దీంతో ప్రజలు కార్లను తగలబెట్టారు. అనేక ప్రాంతాల్లో విధ్వంసానికి పాల్పడ్డారు. దీనితో ట్రంప్ 700 మంది ప్రత్యేక నావికాదళాలను సైన్యం నుంచి రప్పించి ఇతర దేశాలకు చెందిన వలసవాదులను ఆయా దేశాలకు తిప్పి పంపాలన్న నిర్ణయంపై నిరసనకారులను అణచివేస్తున్నారు. ఈ దృశ్యాలను ప్రదర్శిస్తున్నారు. దాడులుచేస్తున్న నిరసనకారులను నియంత్రించడానికి ఆయుధాలను ఫెడరల్‌గార్డుకు చెందినవారు ఉపయోగించారు. కాలిఫోర్నియాలో తీసుకున్న అక్రమ చర్యలకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశారు. రాజ్యాంగంలోని 10వ సవరణ ప్రకారం, ఫెడరల్ ప్రభుత్వం రాష్ట్ర శాంతి భద్రతల విషయంలో జోక్యం చేసుకున్నది. శాంతి భద్రతలు రాష్ట్ర బాధ్యత. అయితే నేషనల్ గార్డు బలగాలు తమ అధికారాలకు మించి చర్యలకు పాల్పడ్డాయి. అలాగే న్యూజెర్సీలో రాష్ట్ర గవర్నర్‌కు సంబంధించిన అంశం ట్రంప్‌కి పరీక్షాప్రాంతం. ట్రంప్ రెండవసారి న్యూజెర్సీలో గెలిచారు. అయితే గవర్నర్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన ఫిల్‌మర్ఫీ ఆయన పదవీకాలం ముగియనున్న సందర్భంగా కల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. న్యూజెర్సీ నుంచి మరోసారి పోటీచేయకూడదని ఫిల్‌మర్ఫీ నిర్ణయించుకున్నారు. ట్రంప్ 2024 ఎన్నికల్లో న్యూజెర్సీ, కాలిఫోర్నియాలలో డెమొక్రాట్ల మార్జిన్‌ను తగ్గించివేశారు. అయితే ఈ రెండు రాష్ట్రాలు తమవిగా చెప్పుకోవడంలో ట్రంప్ విఫలమయ్యారు. వలసవాదులను తమతమ దేశాలకు పంపించాలన్న అజెండాను ట్రంప్ ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు జరపనున్నారని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. లాస్ ఏంజెల్స్, కాలిఫోర్నియాలలో నివసిస్తున్న వలస ప్రజలలో ఎక్కువగా మెక్సికోనుంచి వచ్చినవారున్నారు. జరుగుతున్న ఆందోళనను అణచివేయడానికి ట్రంప్ తన సంతకంతో ఉత్తర్వు జారీ చేశారు. రాజకీయంగా ఇది విజయమేనని వైట్‌హౌస్ అధికారులు చెబుతున్నారు. ఈ పోరాటం తమకు సంతోషం కలిగించేదేనని వైట్‌హౌస్ అధికారి ఒకరు అన్నారు.

డెమొక్రాట్లు, ఇమ్మిగ్రేషన్ కార్యకలాపాల నిర్వాహకులు లాస్ ఏంజెల్స్‌లో నిర్వహించిన కార్యకలాపాలు అక్రమమని, అమానవీయ మని ఇదంతా రాజకీయమేనని సరైన ప్రభుత్వ విధానంకాదని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రజలకు భద్రత కల్పించేవికావని భయంతో నిరసనకారులు ఉన్నారని చెబుతున్నారు. మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, లాస్‌ఏంజెల్స్ నివాసి 2024 ఎన్నికల్లో ట్రంప్‌తో పోటీచేసిన మహిళ ఒక ప్రకటనలో ట్రంప్ చర్యలను తీవ్రంగా విమర్శించారు. వలసకారులను ఆయా దేశాలకు తిరిగి పంపించడమే ప్రధాన అజెండాగా ట్రంప్ పనిచేస్తున్నారు. రిపబ్లిక్‌పార్టీకి చెందిన వ్యూహాత్మక విధానాన్ని అనుసరించే మాధ్యూ బార్టిలెట్ మాట్లాడుతూ, వలసకారులను అమెరికానుంచి పంపివేయడం న్యాయమైన సమస్య అని, అందువల్లనే ఈ దాడులు ఆశ్చర్యకరమైనవేమీకాదని ఓటర్లు తమకుతాము జాగ్రత్తగా ఉన్నారని తెలిపారు. మొదటిసారి ట్రంప్ పాలనా యంత్రాంగంలో బార్టిలెట్ అధికారిగా పనిచేశారు. కార్లను కాల్చివేయడం, దాడులు, చోరీలు, విధ్వంసం తదితర అక్రమ చర్యలకు డెమొక్రాట్లు పాల్పడ్డారని బార్టిలెట్ తెలిపారు.

ఇద్దరూ పక్కా వ్యాపారులే

ఎం కోటేశ్వరరావు

> దోచుకొనేదగ్గర, వాటాల పంపిణీలో దెబ్బలాట, జనాన్ని అణచటంలో ముద్దులాట. వర్గనైజం ఇది. ఎలన్‌మస్క్ పెద్ద వ్యాపారి, పారిశ్రామికవేత్త. తన టెస్లా కార్లను అమ్ముకోవాలన్నా, స్టార్‌లింక్‌ను అనేక దేశాల్లో ఏర్పాటు చేయాలన్నా అమెరికా పాలకుల అండకావాలి. మన నరేంద్రమోదీ ఇటీవలనే అనుమతించటం దానికి పక్కా నిదర్శనం.

కేవలం మూడు నిమిషాల్లోనే విడిపోయిన జంట ఉదంతం ప్రపంచంలో అత్యంత తక్కువ సమయం మనుగడ సాగించిన వివాహంగా చరిత్రలో నమోదైంది. కువైట్‌లో 2019లో ఇది జరిగింది, ప్రమాదవశాత్తూ తూలిపడిన వధువును బుద్ధిలేనిదానా అని తిట్టిన వరుడు తనకు అక్కర లేదనటంతో కోర్టుకు ఎక్కారు. అంతకు వందేళ్ల క్రితం ఒక హాలీవుడ్ జంట కేవలం 20 నిమిషాల్లోనే విడిపోయింది. వివాహం మీద పునరాలోచ నలో పడ్డ నటి భర్తను హానీమూన్ రూమ్‌లో పెట్టి బయట తాళం వేసి వెళ్లిపోయిందట. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్, ప్రపంచ అగ్రరాజ్య అధిపతి డోనాల్డ్ ట్రంప్ ప్రేమాయణం చెడింది. ఇద్దరూ లాభాలు తప్ప మరొకటి పట్టని పక్కా వ్యాపారులే. ఛీ పో అంటే ఛా పో అనుకు న్నారు, అంతలోనే మరోసారి దగ్గరయ్యేందుకు చూస్తు న్నారు, ప్రేమలో పడటానికి, విడిపోవటానికి, తిరిగి దగ్గర కావటానికి డాలర్లు తప్ప మరొక అంశాన్ని ఊహించటం కష్టం. జెఫ్రీ ఎప్‌స్టెయిన్ అనే అమెరికన్ పక్కా తిరుగుబోతు. పద్నాలుగు, పదిహేనేళ్ల ఆడపిల్లలను వలవేసి పట్టటం అనుభవించటం, బడాబాబులకు తార్చటం, తద్వారా లబ్దిపొందటం వాడి చరిత్ర. 2019లో జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించాడు. వాడి గురించి దర్యాప్తు చేసిన పోలీసులు సేకరించిన సమాచారాన్ని జెఫ్రీ ఫైల్స్ అంటున్నారు. వాటిలో డోనాల్డ్ ట్రంప్ పేరు ఉందన్నది తాజాగా ఎలన్ మస్క్ పేల్చిన బాంబు. అందుకే వాడిని జైల్లో లేపేశారని బయటకు ఆత్మహత్య చేసుకున్నా డని కథలు అల్లారని చెబుతారు. వీడి ఖాతాదార్లలో ట్రంప్ ఉన్నట్లు ప్రకటించి మస్క్ దాన్ని వెనక్కు తీసుకున్నాడు. డోనాల్డ్ ట్రంప్ పేరు ఎప్‌స్టెయిన్ ఫైల్స్‌లో ఉంది, అందుకే వాటిని బహిర్గత పరచలేదు అని ఎక్స్‌లో మస్క్ పేర్కొన్నాడు. తరువాత దాన్ని తొలగించాడు. దీని మీద తన సామాజిక మాధ్యమం ట్రూత్‌లో నాకు వ్యతిరేకంగా ఎలన్ మస్క్ మారటాన్ని నేను పట్టించుకోను అన్నాడు, ఎయిర్ ఫోర్స్ ఒన్ విమానంలో ప్రయాణిస్తూ దాని గురించి నేనసలు ఆలోచించటం లేదన్నాడు. అయితే మస్క్ కంపెనీలతో ప్రభుత్వ కాంట్రాక్టుల గురించి ప్రతి అంశాన్ని పరిశీలిస్తామన్నాడు. డెమోక్రటిక్ పార్టీకి నిధులు ఇస్తే సంగతి చూస్తానని బెదిరించాడు.

ట్రంప్‌ను పదవి నుంచి అభిశంసన ద్వారా తొలగించాలని మస్క్ అన్నాడు. అదే నోటితో లాస్‌ఏంజల్స్‌లో వలస కార్మికుల నిరసనలను అణచివేసేందుకు మిలిటరీని దింపిన ట్రంప్‌ను పొగుడుతున్నాడు. మస్క్‌తో మాట్లాడేదేలేదు అన్న ట్రంప్ మాట మార్చాడు. మస్క్ ఫోన్ చేస్తే మీరు మాట్లాడతారా అన్న విలేకర్ల ప్రశ్నకు దాని గురించి నిజంగా నేను ఆలోచించలేదు అన్నాడు తప్ప అవునని కాదని చెప్పలేదు. దోచుకొనేదగ్గర, వాటాల పంపిణీలో దెబ్బలాట, జనాన్ని అణచటంలో ముద్దులాట. వర్గనైజం ఇది. ఎలన్‌మస్క్ పెద్ద వ్యాపారి, పారిశ్రామికవేత్త. తన టెస్లా కార్లను అమ్ముకోవా లన్నా, స్టార్‌లింక్‌ను అనేక దేశాల్లో ఏర్పాటు చేయాలన్నా అమెరికా పాలకుల అండకావాలి. మన నరేంద్రమోదీ ఇటీవలనే అనుమతించటం దానికి పక్కా నిదర్శనం. డెమోక్రటిక్ పార్టీ మద్దతుదారుగా ఉన్న ఆ పెద్ద మనిషి అందుకోసమే డోనాల్డ్ ట్రంప్‌కు ఎన్నికల విరాళాల రూపంలో ఆర్థికంగా భారీ మొత్తంలో సమర్పించుకున్నాడు. అధికారానికి వచ్చిన మరుసటి రోజు నుంచే సతాయిం చటం మొదలు పెట్టాడు. రానున్న రోజుల్లో వినియోగదారు లందరూ విద్యుత్ కార్లే కొనుగోలు చేయాలంటూ ఒక విధాన నిర్ణయం చేయాలని, వాటి మీద ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని పెంచాలని, వారికి అందుబాటులో మూల మూలనా చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాడు. ట్రంప్ దానికి అంగీకరించలేదు. ఎందుకని ? అమెరికా కార్ల కంపెనీల యజమానుల చరిత్రను చూసిన ప్పుడు తమ కార్లను అమ్ముకొనేందుకు ప్రజారవాణా వ్యవస్థలైన బస్సులు, రైళ్లను, ట్రామ్‌లను పక్కన పెట్టేసే విధంగా ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి విజయవంత మయ్యారు. వారికి పెట్రోలు, డీజిలు అమ్ముకొనే కంపెనీలు వత్తాసు పలికాయి. ఎక్కడో దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన ఎలన్ మస్క్ ప్రపంచ కుబేరుడు కావచ్చు కానీ ఇప్పటికే ఉన్న చమురు కార్ల పరిశ్రమ

మొత్తాన్ని మూసివేయించేంత మొనగాడా అది జరిగితే నీ సంగతి తేలుస్తామని ఆ రంగంలోని కంపెనీలు ట్రంప్‌ను హెచ్చరించటంతో ఇరకాటంలో పడి వెనక్కు తగ్గాడు. వారి మధ్య వైరానికి అసలు కారణం ఇదే ! ఎలన్ మస్క్, డోనాల్డ్ ట్రంప్ అక్రమ సంబంధాలు జగమెరిగిన సత్యం. ఇంతకు ముందు గూగుల్ సహ వ్యవస్థాప కుడు సెర్జీ బెన్ భార్య నికోలే సహాన్‌తో మస్క్ పెట్టుకున్న అక్రమ సంబంధం కారణంగా వారిద్దరూ విడిపోయారు. తాజా ఉదంతానికి వస్తే అమెరికా అధ్యక్ష భవనంలో ఉన్నత అధికారిగా పనిచేస్తున్న స్టెఫాన్ మిల్లర్ భార్య కాటీ మిల్లర్‌తో సంబంధం పెట్టుకున్నట్లు గుప్పుమంది. ట్రంప్ మీద ఆగ్రహంతో మస్క్ డోజ్ పదవికి రాజీనామా చేసి బయటకు వెళ్లినపుడు అప్పటి వరకు అధ్యక్ష భవనంలో ఉద్యోగిగా ఉన్న కాటీ కూడా రాజీనామా చేసి ఎలన్ మస్క్ కంపెనీలో పని చేసేందుకు వెళ్లిపోయారు. వేరే సందర్భంలో స్టెఫాన్ మిల్లర్ " అమెరికాను తిరిగి వెనక్కు తీసుకువచ్చాం" అని ఎక్స్‌లో పోస్టు పెట్టాడు. దాని మీద మస్క్ స్పందిస్తూ " నేను నీ భార్యను తీసుకుపోయినట్లేనా " అని వ్యాఖ్యానిం చాడు. అయితే అదంతా నిజం కాదని తానలాంటి పోస్టు పెట్టలేదని మస్క్ చెప్పుకున్నప్పటికీ అప్పటికే జరగాల్సిం దంతా జరిగిపోయింది. తన సొంత కృత్రిమ మేథ గ్రోక్‌ను సంప్రదిస్తే అది కూడా మస్క్ పెట్టిన పోస్టు స్క్రీన్ షాట్ నిజమే అని చెప్పిందట. ఇద్దరూ రాజీబాటలో ఉన్నారని సంతృప్తి వ్యక్తం చేయటంతో మస్క్ కంపెనీల వాటాల ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ పడిపోయిన నాటి స్థాయికి చేరలేదు. వెంటనే వారిద్దరూ కలవకపోయినా కొన్ని నెలలకు పూర్తిగా సర్దుకుంటారని భావిస్తున్నారు.

మాజీ డెమోక్రాట్ అయిన మస్క్ 2016లో ట్రంప్ తొలిసారి అధికారానికి వచ్చినప్పటి నుంచి వాణిజ్య సలహా మండళ్లలో చోటు సంపాదించుకున్నాడు. రెండోసారి ఓడిపోయిన తరువాత ఇక చాల్లే మళ్లీ పోటీకి దిగవద్ద న్నాడు. ఫ్లోరిడా గవర్నర్ దేశాంటిస్ పోటీ చేస్తే తాను మద్దతు ఇవ్వకపోయినా జో బైడెన్ మీద గెలుస్తాడని పోస్టు చేశాడు. కానీ 2024లో ట్రంప్‌కు అన్నీ తానే అన్నట్లు వ్యవహరించాడు. ఆయన కోసమే తొలిసారిగా రిపబ్లికన్ పార్టీకి ఓటు వేశానన్నాడు. అమెరికా అధికారపీఠంపై అనుచరులతో ట్రంప్ దాడి చేయించినప్పుడు ఎక్స్ ఖాతాను రద్దు చేశారు. తరువాత మస్క్ కొనుగోలు చేసిన తరువాత 2022 చివరిలో పునరుద్ధరించాడు. ట్రంప్ సొంతంగా ట్రూత్ అనే వేదికను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ట్రంప్ కేసుల్లో ఇరుక్కున్నప్పుడు ఐదు కోట్ల డాలర్లు మస్క్ ఇచ్చాడు. ట్రంప్ ఎన్నడూ తనను డబ్బు అడగలేదని తానే ఇచ్చినట్లు చెప్పుకున్నాడు. ఎన్నికల్లో 25 కోట్ల డాలర్లు ఖర్చు చేశాడు. అధికారానికి వచ్చిన తరువాత మస్క్ గొంతెమ్మ కోర్కెలు తీర్చే అవకాశం లేదని ట్రంప్ పక్కన పెట్టటం ప్రారంభించాడు. విద్యుత్ వాహనతయారీదారులు కష్టకాలంలో ఉన్నారు. వారు బిలియన్ల డాలర్లను సబ్సిడీగా ఇవ్వాలని కోరుకుంటున్నారు, అది సాధ్యం కాదనటంతో మస్క్ ఆశాభంగం చెందాడని ట్రంప్ చెప్పాడు. తన మద్దతులేకపోతే రిపబ్లికన్లు ఓడిపోయి ఉండేవారని, కృతజ్ఞత చూపలేదని మస్క్ అంటే అతగాడికి పిచ్చి ఎక్కిందని, తానింకే మాత్రం అతగాడి గురించి ఆలోచించనని ట్రంప్ బదులిచ్చాడు. మస్క్ త్వరలో బయటకు వెళ్లిపోతాడని ట్రంప్ తన కాబినెట్, ఇతర ముఖ్యులతో వ్యాఖ్యానించినట్లు ఏప్రిల్ రెండవ తేదీన పొలిటికో పత్రిక రాసింది. మే చివరి వారంలో పదవీ కాలం ఒక రోజు ఉండగానే రాజీనామా చేశాడు.

ఈ బాగోతం చూసిన తరువాత సామాజిక మాధ్యమం, రాజకీయ వర్గాల్లో జోకులే జోకులు. సముచితమైన ఫీజు కింద మాకు స్టార్‌లింక్ కంపెనీ వాటాలు ఇస్తే ఇద్దరి మధ్య రాజీకుదుర్చుతాం, దెబ్బలాడు కోవద్దు అంటూ రష్యన్ మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ చమత్కరించాడు. కావాలంటే మస్క్‌కు రాజకీయ ఆశ్రయం కల్పిస్తామని రష్యా ఇతర నేతలు చెప్పారు. ఎలన్ ఆశాభంగం చెందవద్దు, అమెరికాలో అసాధ్యమైన సమస్యలను ఎదుర్కొంటే మా దగ్గరకు రండి మాలో ఒకరిగా మారండి, మీ సాంకేతిక నైపుణ్యానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది ఇక్కడ నిజమైన స్నేహితులు ఉన్నారంటూ ఎక్స్‌లు చేశారు. ఈ మొత్తం ఉదంతంలో అంతిమంగా ట్రంప్‌దే పైచేయి అన్నది స్పష్టం. ఎందుకంటే అపరిమిత మైన అధికారం ఉన్నందున ఎలన్ మస్క్ ఆర్థిక సామ్రాజ్యాన్ని కుప్పకూల్చివేసే అవకాశం ఉంది. అందుకే మస్క్ దారికి వచ్చినట్లు కనిపిస్తోంది. కొస మెరుపు ఏమంటే మంగళవారం ఎలన్ మస్క్ డ్రైవర్‌తో పనిలేని తన తొలి కారును ప్రయోగించి చూపాడు. దాంతో రోబోటాక్సీ రంగంలోఆయన కంపెనీ ఉందన్న భరోసాతో స్టాక్ మార్కెట్‌లో వాటాల ధరలు పెరిగాయి.

నోరుపారేసుకుని అలజడి సృష్టించడం నేరమే!



టి. లక్ష్మీనారాయణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న ఒక దీర్ఘకాలిక అంటువ్యాధి "కుసంస్కారం – నాసిరకం భాష". తాజాగా ఇద్దరు సీనియర్ పాత్రికేయ మిత్రులు పాల్గొన్న ఒక టీవి చర్చలో వాడిన పదజాలం – వ్యాఖ్య అత్యంత గర్హనీయం. దానిపై సభ్యసమాజం కన్నెర్రజేసింది. పోలీసులు తమకు అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి, కేసు నమోదు చేసి, ఒక సీనియర్ పాత్రికేయున్ని అరెస్టు చేసి, జైలుకు పంపారు. మరొక పాత్రికేయున్ని అరెస్టు చేయడానికి పోలీసు బృందాలు శ్రమిస్తున్నట్లు వార్తలొచ్చాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతిని దేవతల రాజధాని అని అభివర్ణించారని, కాదు, అది వేశ్యల రాజధాని అని, అమరావతిపై అక్కసుకొద్ది అజ్ఞాతంలోకి వెళ్లిన పాత్రికేయుడు నోరుపారేసుకోవడం అత్యంత నీచమైన ఆలోచన. ఆ మాటలను వెంటనే ఖండిస్తూ, నిర్ద్వంద్వంగా తిరస్కరించి, వాటిని ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పించాల్సిన మోడరేటర్ ఆ పని చేయకుండా "మీరు అలా అంటే మిమ్మల్ని సోషల్ మీడియాలో దూషిస్తారని" ప్రస్తుతం జైలుపాలైన పాత్రికేయుడు సన్నాయి నొక్కులు నొక్కడం తీవ్ర అభ్యంతరకరం. కుసంస్కారంతో సాగిన చర్చలో భాగస్వాములైన ఇద్దరు పాత్రికేయుల ఫోటోలను కొందరు మహిళలు ఆవేదనతో చెప్పులతో కొట్టిన ఘటనపై నిరసన తెలియజేయవచ్చు తప్పులేదు. కానీ, ఆ మహిళలను ఉద్దేశించి దెయ్యాలకు, రాక్షసులకు పుట్టిన సంకర జాతి వాళ్లని నోరు పారేసుకోవడం జుగుప్సాకరమైనది. తప్పుచేసిన వారిని సమర్థించే పనిలో నిమగ్నమై అనాలోచితంగా మరొక తప్పు చేయకూడమే కదా! విజ్ఞతతో ఆలోచించాలి.

నా అనుభవాన్ని ఉదహరిస్తున్నా. రాష్ట్ర విభజన జరిగింది. రాష్ట్ర రాజధాని అంశం సంక్లిష్టమైనది. ఆ సమస్య సామరస్యంగా పరిష్కారమయ్యింది. రాష్ట్ర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అమరావతి గడ్డపై నుంచే పాలన సాగుతున్నది. చట్టసభల్లో అమరావతిని బలపరిచిన జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మాటమార్చి, కుటిల రాజకీయాలతో మూడు రాజధానుల ముచ్చటతో, అమరావతి రాజధానిని వివాదాస్పదంగా మార్చారు. దాన్ని వ్యతిరేకిస్తూ నేను టీవీల్లో, సోషల్ మీడియాలో బలంగా గళమెత్తాను. అమరావతి రాజధాని పరిరక్షణ ఉద్యమంలో పాల్గొన్నాను. దాన్ని వైఎస్సార్‌సీపీ వాళ్లు జీర్ణించుకోలేకపోయారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పదిహేను మంది ప్రముఖుల ఫోటోల సరసన నా ఫోటో అతికించి గజదొంగల జాబితాగా సోషల్ మీడియాలో షేర్ చేశారు. దాన్నెవరో నాకు పంపారు. సరదాగా తీసుకుని బాగా నవ్వుకున్నాను. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్‌ను నియమించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసే రీతిలో ఆ గ్రూప్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికపై



టీవీ5లో జరిగిన చర్చలో నేను పాల్గొన్నాను. రాష్ట్ర సమైక్యతను బలంగా కోరుకునే నేను రాష్ట్ర రాజధాని అంశాన్ని జగన్‌మోహన్ రెడ్డి వివాదాస్పదం చేయడాన్ని సమర్థిస్తూ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ఇచ్చిన నివేదికను తీవ్రంగా వ్యతిరేకించే సమయంలో ఆవేదనతో నా నోట, అందరూ సర్వసాధారణంగా వినియోగించే ఒక ఆంగ్ల పదం దొర్లింది. నాతోపాటు చర్చలో పాల్గొంటున్న మిత్రులు దాన్ని తప్పుగా భావించడానికి కూడా సమయం ఇవ్వకుండా, ఆ అభ్యంతరకమైన మాటని, నాకు నేను క్షణాల్లో గుర్తించి, ఆ మాటను ఉపసంహరించుకుని, ప్రేక్షకులకు క్షమాపణలు చెప్పాను. కానీ, ఎవరో ఒక మిత్రుడు (దుష్టుడు) తన తెలివితేటలను, శ్రమను వెచ్చించి, ఆ డిబేట్ వీడియోను యూట్యూబ్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, కట్టర్‌తో ఎడిట్ చేసి, ఆ ఒక్క మాటను జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి అన్నట్లుగా చిత్రీకరించి, సోషల్ మీడియాలో షేర్ చేశాడు. దాన్ని చూసిన జగన్‌మోహన్ రెడ్డి వీరాభిమానులు నా ఫోటోకు చెప్పుల దండాలు వేసి, చెప్పులతో కొడుతున్నట్లు, దహన సంస్కారాలు చేస్తున్నట్లు, బూతులు తిడుతూ వీడియోలు, ఫోటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. వాటిని ఒక వైసీపీ మిత్రుడే నా దృష్టికి తీసుకొస్తే, మనం ఉండగానే దహన సంస్కారాలు చేస్తే మన ఆయుష్షు పెరుగుతుందని కొందరి విశ్వాసం అంటూ నవ్వుతూ సమాధానమిచ్చాను. మరికొందరు మిత్రులు ఫోన్ చేసి మీకు ప్రాణహాని తలపెడతారేమో! జాగ్రతగా ఉండమని సలహా ఇస్తే, నేను కమ్యూనిస్టును, ఆ విషయం దూషించే వారికీ తెలుసని సమాధానం ఇచ్చా. ఆనాటి టీవీ5 డిబేట్ మొత్తం వీడియోను వీక్షించమని వైసీపీకి చెందిన అనేక మంది మిత్రులకు యూట్యూబ్ లింక్ షేర్ చేశాను. ఈ ఉదంతాలను ప్రస్తావించడానికి కారణం ఎవరైనా సంయమనం పాటించాలి. విచక్షణతో, హుందాగా వ్యవహరించాలి. పొరపాటున ఒక మాట తప్పుగా దొర్లితే వెంటనే సరిదిద్దుకోవాలి. భేషజాలకు పోకుండా క్షమాపణ చెప్పి సంస్కారాన్ని ప్రదర్శించాలి, ఆత్మవిమర్శ చేసుకోవాలి. మాతృభాషలో చెప్పడానికి మనస్కరించక పోతే పరాయి భాష ఇంగ్లీషులో "సారి" అని మనస్ఫూర్తిగా చెప్పేస్తే సరిపోతుంది. ఉద్దేశపూర్వకంగా తప్పుడు మాటలు మాట్లాడి, పశ్చాత్తాపం చెందని వారు శిక్షకు అర్హులే కదా! కానీ, ఆ శిక్ష చేసిన తప్పుకు తగ్గట్లుగా మాత్రమే ఉండాలని ప్రజలు కోరుకుంటారు. పాలక వర్గాలను సంతృప్తి పరచడానికి ఎస్సీ – ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టాన్ని దుర్వినియోగ చేస్తే ప్రజలు హర్షించరు.

ఇద్దరు పాత్రికేయులు పాల్గొన్న డిబేట్ చర్చనీయాంశాన్ని కూడా కాస్తా పరిశీలిద్దాం. వ్యభిచారంగా పిలువబడే వేశ్య 'వృత్తి' ప్రపంచంలో ఒక పురాతనమైన వృత్తి. దానికి వేల సంవత్సరాల చరిత్ర ఉన్నది. అన్ని సంస్కృతులలో, వివిధ రూపాల్లో ప్రపంచ వ్యాపితంగా ఉనికిలో ఉన్నది. నైతిక – అనైతిక, చట్టపరమైన స్థితి కాలానుగుణంగా మార్పులు చెందుతూ వస్తున్నది. అదొక సామాజిక రుగ్మతగా బలంగా వేళ్లూనుకుని ఉన్నది. దాని మూలాల్లోకి వెళితే ఇదొక సామాజిక, ఆర్థిక, పురాతన కాలాల్లో మతపరమైన అంశాల కలయికతో ఇదొక ఆచారంగా కూడా ఉండేదట. దారిద్ర్యం, నిరుద్యోగం, కుటుంబ పోషణ, సామాజిక అంశాలు తదితర అనేక సమస్యలు, కోణాలు కనబడతాయి. 20వ శతాబ్దంలో పురుష వ్యభిచారంపై అధ్యయనాలు కూడా జరుగుతున్నాయి. "సెక్స్ వర్క్" అనే పదం కూడా వాడుతున్నారు. సెక్స్ వర్కర్ల హక్కుల ఉద్యమాలు కూడా తెరపైకి వచ్చాయి. వేశ్యకు పూర్తి చట్టబద్ధత కల్పించిన దేశాలున్నాయి, నిషేధించిన దేశాలున్నాయి. మహిళలను, పిల్లలను కిడ్నాప్ చేయడం, డబ్బు, ఉపాధి ఆశ చూపెట్టి మానవ అక్రమ రవాణా చేసి, వ్యభిచార గృహాల నిర్వాహకులకు అమ్మే మాఫియా ముఠాలు లేకపోలేదు. బలవంతంగా వేశ్యా 'వృత్తి' ఊబిలోకి నెట్టివేయబడే నిస్సహాయ మహిళల దుస్థితి వర్ణనాతీతం. ఈ సమస్య సమాజాన్ని కలచివేస్తున్నది. ఇది మన సమాజంలో దోపిడీ, సామాజిక కళంకంతో ముడిపడి ఉన్నది. లైంగికంగా సంక్రమించే హెచ్ఐవీ తదితర అంటువ్యాధుల వ్యాప్తి తీవ్ర ఆందోళన కలిగిస్తున్న సమస్య. సామాజిక స్పృహతో ఈ అంశాలపై చర్చించవచ్చు. మూలల్లోకి వెళ్లి, దానికున్న సుదీర్ఘ చరిత్ర, సమాజంపై పడుతున్న ప్రతికూల ప్రభావం, ఎదురవుతున్న సవాళ్లు, పరిష్కార మార్గాలపై వాస్తవాల ఆధారంగా హేతుబద్ధంగా, సహేతుకమైన చర్చ ప్రసారమాధ్యమాల్లో చేస్తే ఎవరూ తప్పుపట్టరు. కానీ, దుర్బుద్ధితో, అసందర్భ ప్రేలాపనలతో, మాతృమూర్తులను అవమానించే రీతిలో, రాష్ట్ర రాజధానిపై అక్కసు వెళ్లగక్కుతూ నోరుపారేసుకుని, పశ్చాత్తాపం కూడా వ్యక్తం చేయకుండా సమాజంలో అలజడి సృష్టించడం నేరమే కదా!

సామాజిక ఉద్యమకారుడు

ప్రధానితో భేటీకి ఆర్టీపీసీఆర్ టెస్టు తప్పనిసరి

ఏడు వేలు దాటిన కోవిడ్ కేసులు

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ బారిన పడినవారి సంఖ్య 7 వేలు దాటింది. దేశంలో కేసులు పెరుగుతుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసే మంత్రులు, ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంఓ సూచించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన అధికారిక డేటా ప్రకారం... గత 24 గంటల్లో దేశంలో 306 కొత్త కేసులు నమోదవడంతో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121కి చేరింది. దేశంలో కోవిడ్ మృతుల సంఖ్య 74కు పెరిగింది. కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు ఉండగా... గుజరాత్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని, ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం దేశంలో మొత్తం 7,121 కేసులు ఉండగా... కేరళలో అత్యధికంగా 2,223 కేసులు నమోదయ్యాయి. గుజరాత్ 1,223, ఢిల్లీ 757, పశ్చిమబెంగాల్ 747, మహారాష్ట్ర 615, కర్నాటక 459, ఉత్తరప్రదేశ్ 229, తమిళనాడు 204, రాజస్థాన్ 138, హర్యానా 125, ఆంధ్రప్రదేశ్ 72, మధ్యప్రదేశ్ 65, మహారాష్ట్ర 615, చత్తీస్‌గఢ్, 48, బీహార్ 47, ఒడిశా 41, సిక్కిం, పంజాబ్‌లో 33 చొప్పున కేసులు, తెలంగాణ 11, పుదుచ్చేరి, జార్ఖండ్‌లో చెరో 10 కేసులు, జమ్మూకశ్మీర్ 9, అసోం, గోవాలో 6 చొప్పున, చండీగఢ్, ఉత్తరాఖండ్‌లో 3 చొప్పున, హిమాచల్ ప్రదేశ్ 2, మణిపూర్, త్రిపురలో చెరో కేసు నమోదయ్యాయి.

బాబా సిద్ధిఖీ హత్య కేసు నిందితుడి అరెస్టు

ముంబై: మాజీ మంత్రి, ఎన్‌సీపీ సీనియర్ నేత బాబా సిద్ధిఖీ హత్యకు ప్రధాన సూత్రధారి అయిన జీషాన్ అక్తర్ కెనడాలో అరెస్టయ్యాడు. ముంబై పోలీసులు ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్ధిఖీ హత్య కేసులో అరెస్టు చేసిన నిందితులను విచారించగా జీషాన్ అక్తర్ పేరు బయటకు వచ్చింది. ఈ హత్యకు ప్రణాళిక వేసింది జీషానే. హత్య జరిగిన తర్వాత నకిలీ పాస్‌పోర్టు వినియోగించి దేశం విడిచి పారిపోయాడు. ఇంటర్‌పోల్ ఇతడిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. తాజాగా అతడు కెనడాలో అరెస్టయ్యాడు. అతడిని భారత్‌కు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు సమయంలో నిందితుడు పాకిస్థాన్‌లో ఉన్నట్లుగా వీడియో ఒకటి బయటకు వచ్చింది. అతడి ఆచూకీ తెలియకుండా అధికారుల దృష్టి మళ్లించేందుకు వీడియో రూపొందించినట్లు తెలుస్తోంది. జీషాన్ దేశం విడిచి ఎలా పారిపోయాడనే దానిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, పంజాబ్‌లోని జలంధర్‌కు చెందిన జీషాన్ అసలు పేరు మొహమ్మద్ యాసిన్ అక్తర్. 2022లో పంజాబ్ పోలీసులు ఓ కేసులో అతడిని అరెస్టు చేశారు. ఇతడిపై పలు నేరారోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌కు అత్యంత సన్నిహితుల్లో జీషాన్ ఒకడు. విక్రమ్ బ్రార్ గ్యాంగ్‌లోనూ ఇతడు సభ్యుడిగా ఉన్నాడనే అనుమానాలున్నాయి. ఈ కేసులో దాదాపు 20 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

24 గంటల ముందే చార్ట్ సిద్ధం: రైల్వే

న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు రిజర్వేషన్ టికెట్ కన్ఫర్మేషన్ ఇప్పుడు రైలు బయలుదేరడానికి కేవలం నాలుగు గంటల ముందే తెలుస్తోంది. అయితే వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణికులకు తమ టికెట్ కన్ఫర్మేషన్ గురించి రైలు బయలుదేరడానికి 24 గంటల ముందే లిస్టును తయారు చేసే ప్రక్రియపై రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. దీనిపై రైల్వే మంత్రిత్వశాఖ బుధవారం ఓ ప్రకటన చేసింది. పైలెట్ పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు అధికారులు చెప్పారు. ఒకవేళ ప్రయాణికుల నుంచి అనుకూల స్పందన వస్తే, అప్పుడు ఈ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉంటుందని రైల్వేశాఖ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. 24 గంటల ముందే చార్ట్ సిద్ధం చేసే పైలెట్ ప్రాజెక్టును బికనీర్ డివిజన్‌లో చేపడుతున్నారు. రైల్వే బోర్డు ఇన్ఫర్మేషన్ అండ్ పబ్లిసిటీ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిలీప్ కుమార్ దీనిపై మాట్లాడారు. వెయిటింగ్ లిస్టు కేటగిరీలో ఉన్న ప్రయాణికులు తమ ప్రయాణం గురించి ఆందోళన చెందుతున్నారని, వాళ్లను దృష్టిలో పెట్టుకుని 24 గంటల ముందే టికెట్ కన్ఫర్మేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ టికెట్ కన్ఫర్మ్ అయితే, ఆ ప్యాసింజర్ టికెట్‌ను రద్దు చేస్తే అప్పుడు అతడు ఎక్కువ మొత్తం కోల్పోయే ప్రమాదం ఉంది. క్యాన్సిలేషన్ పాలసీ ప్రకారం రైలు బయలుదేరడానికి 12 నుంచి 48 గంటల మధ్య కన్ఫర్మ్ టికెట్‌ను రద్దు చేస్తే, అప్పుడు టికెట్ అమౌంట్‌పై 25 శాతం మాత్రమే వెనక్కి ఇచ్చేస్తారు.

ఆహ్వానించి... చెంప చెళ్లుమనిపించాడు

యూపీ నేతపై కార్యకర్త దాడి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో సుహల్‌దేవ్ స్వాభిమాన్ పార్టీ నేతపై కార్యకర్త వినూత్న రీతిలో విరుచుకుపడ్డాడు. తొలుత ఆ నేత గురించి గొప్పగా మాట్లాడి, ఆ తర్వాత అతని మెడలో దండ వేసి, ఆ తర్వాత అతడి చెంపపై తీవ్రంగా కొట్టాడు. వివరాల్లోకి వెళ్తే... ఆషాపూర్ గ్రామంలో మహారాజ్ సుహల్‌దేవ్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఎస్ఎస్పీ జాతీయ అధ్యక్షుడు మహేంద్ర రాజ్‌భర్‌ను ఆహ్వానించారు. జఫ్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజ్‌భర్ వర్గ ప్రజలు అధిక సంఖ్యలో ఉంటారు. అక్కడ రాజ్‌భర్ విగ్రహాన్ని స్థాపించేందుకు భూమి పూజ చేశారు. దాని కోసం మహేంద్రను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అయితే పార్టీ కార్యకర్త బ్రిజేశ్ రాజ్‌భర్... తొలుత మహేంద్ర మెడలో పూలమాల వేశారు. ఆ వెంటనే మహేంద్రపై దాడి చేశాడు. చెంప చెళ్లుమనిపించాడు. ఈ ఘటన పట్ల మహేంద్ర రాజ్‌భర్ స్పందించారు. యూపీ మంత్రి ఓం ప్రకాశ్ రాజ్‌భర్.. తనపై దాడి చేయించినట్లు ఆరోపించారు. కానీ ఈ ఘటనపై ఇప్పటి వరకు యూపీ మంత్రి స్పందన ఇవ్వలేదు. దాడి ఘటన తర్వాత జలాల్‌పూర్ పోలీసు స్టేషన్‌లో మహేంద్ర ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

- సమయానికి స్కాలర్‌షిప్ ఇవ్వండి
- వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించండి
- ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ

న్యూఢిల్లీ: దళిత, ఎస్టీ, ఈబీసీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో సౌకర్యాలు లేకపోవడం, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పులు సమయానికి అందకపోవడం ప్రధాన సమస్యలని, వీటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. వెనుకబడిన వర్గాలకు చెందిన 90 శాతం మంది విద్యార్థుల విద్యావకాశాలకు విఘాతం కలుగుతున్న దృష్ట్యా ఈ రెండు సమస్యలను వెంటనే పరిష్కరించాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. 'బీహార్, దర్భంగాలోని అంబేద్కర్ హాస్టల్‌కు వెళ్లినప్పుడు ఒక గదిలో ఆరుగురు, ఏడుగురు విద్యార్థులు ఉండటం వల్ల కలుగుతున్న అసౌకర్యం గురించి తెలిసింది. పారిశుద్ధ్యం లేదు. రక్షిత తాగునీరు లేదు, మెస్ సౌకర్యాలు లేవు, గ్రంథాలయంగానీ, ఇంటర్నెట్ వసతిగానీ లేదు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పులు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో కొన్ని వైఫల్యాలు ఉన్నాయి. ఆ విషయాలన్నీ విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. 2021-22లో స్కాలర్‌షిప్ పోర్టల్ పనిచేయని కారణంగా బీహార్ విద్యార్థులు మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్ పొందలేదు. ఆ తర్వాత కూడా పరిస్థితి మారలేదు. స్కాలర్‌షిప్పులు పొందే దళిత విద్యార్థుల సంఖ్య సగానికి తగ్గింది. 2023లో 1.36 లక్షల మంది స్కాలర్‌షిప్ పొందగా 2024లో ఆ సంఖ్య 69వేలకు పడిపోయింది. స్కాలర్‌షిప్ మొత్తం చాలా తక్కువగా ఉందని విద్యార్థులు చెప్పారు. బీహార్ ఒక్కటే కాదు దేశం మొత్తం ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటోంది. కేంద్రప్రభుత్వం తక్షణమే విద్యార్థులకున్న రెండు ప్రధాన సమస్యలను పరిష్కరిస్తే తప్ప ఈ వైఫల్యాలకు సమాధానం లభించదు' అని తన లేఖలో రాహుల్ పేర్కొన్నారు. ఈ వర్గాల విద్యార్థుల వసతి గృహాల ఆడిట్‌ను కోరారు. రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో మంచి మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, ఆహారం, విద్యా ప్రమాణాలకు హామీ ఉండాలని, సముచిత నిధులు సమకూర్చాలని ఆయన ప్రధానిని కోరారు. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్పులను నిర్దేశిత సమయానికి అందజేయాలని, స్కాలర్‌షిప్ మొత్తాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్కాలర్‌షిప్ సమర్థ జారీకిగాను రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించాలన్నారు. 'వెనుకబడిన వర్గాలకు చెందిన యువత ప్రగతితోనే దేశ పురోగతి సాధ్యమని మీరూ అంగీకరిస్తారు. మీ నుంచి సానుకూల స్పందనను ఆశిస్తున్నా' అని ప్రధానిని ఉద్దేశించి రాహుల్ పేర్కొన్నారు. ఇదిలావుంటే, ఢిల్లీ, కాంగ్రెస్ ఇందిరా భవన్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలోనూ ఇవే అంశాలను పార్టీ ఎస్సీ విభాగాధిపతి రాజేంద్ర పాల్ గౌతం, ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రాంత్ భూరియా, ఏఐసీసీ ఎన్ఎస్‌యూఐ ఇంచార్జి కన్హయ కుమార్ ప్రస్తావించారు. ఈ వర్గాల విద్యార్థులను ఎప్పుడు కలిసినాగానీ వారు ముందుగా తమకు స్కాలర్‌షిప్ సమయానికి అందడం లేదనే చెబుతారని కన్హయ కుమార్ అన్నారు. దేశంలో స్కాలర్‌షిప్ డ్రాపౌట్ చాలా ఎక్కువ... ఎందుకంటే స్కాలర్‌షిప్ పొందే ప్రక్రియను ఓ శిక్షగా ప్రభుత్వం మార్చివేసిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల ఆత్మహత్యలు మరో సమస్యగా ఉందని, గంటకు ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యపై ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ రాశారని, ఇక కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూడాలన్నారు. కాగా, దళితులు, ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులతో కన్హయ కుమార్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఇప్పటికైనా అఖిలపక్షాన్ని పిలుస్తారా?

పార్లమెంటులో పూర్తిస్థాయి చర్చకు అంగీకరిస్తారా

ప్రధాని మోదీకి కాంగ్రెస్ వరుస ప్రశ్నలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పరిణామాలు, విదేశీ విధానానికి సంబంధించిన సవాళ్లపై పార్లమెంటు వర్షాకాల సమావేశంలో పూర్తిస్థాయి చర్చకు ప్రధాని మోదీ ఇప్పటికైనా అంగీకరిస్తారా అని కాంగ్రెస్ ప్రశ్నించింది. పాకిస్థాన్-చైనాకు సంబంధించి భవిష్యత్‌లో అనుసరించే వ్యూహాలపై అఖిలపక్షాన్ని విశ్వాసంలోకి తీసుకుంటారా? ప్రధాని అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తారా? అంటూ ప్రశ్నించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ అనంతరం ఉగ్రవాదంపై తమ వైఖరిని తెలియజేసేందుకు ఏడు బృందాలను విదేశాలకు పంపిన మోదీ... తిరిగి వచ్చిన ప్రతినిధులతో భేటీ అయిన క్రమంలో కాంగ్రెస్ ఈ మేరకు స్పందించింది. 'వేర్వేరు దేశాలకు వెళ్లి వచ్చిన ఎంపీల నేతృత్వంలోని ఏడు బృందాలను ప్రధాని స్వయంగా కలిశారు. ఆయన ఇప్పటికైనా అఖిలపక్షాన్ని పిలుస్తారా? సింగపూర్‌లో సీడీఎస్ ప్రకటన నేపథ్య పరిణామాలు, చైనా- పాకిస్థాన్‌కు సంబంధించిన వ్యూహాలపై అఖిపక్షంతో చర్చిస్తారా?' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం ఎక్స్ మాధ్యమంగా ప్రశ్నించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో భాగంగా పహల్గాం ఘటన అనంతర భద్రతా చర్యలు, విదేశాంగ విధానానికి సంబంధించిన సవాళ్లపై పూర్తి స్థాయి చర్చకు ప్రధాని ఇప్పటికైనా అంగీకరిస్తారా అని ఆయన అడిగారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం కోసం ఇండియా ఐక్య సంఘటన విజ్ఞప్తిని మోదీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిరస్కరిస్తుండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పహల్గాం దాడికి కారణమైన ఉగ్రవాదులను పట్టుకునేందుకు రెట్టింపు చర్యలు తీసుకుంటారా అని మోదీని జైరాం రమేశ్ ప్రశ్నించారు. కార్గిల్ రివ్యూ కమిటీ తరహా నిపుణుల బృందాన్ని ఆపరేషన్ సిందూర్‌పై సమీక్ష కోసం ఏర్పాటు చేస్తారా? ఆ కమిటీ ఇచ్చే నివేదికను పార్లమెంటు ముందర ఉంచుతారా? చైనా, పాకిస్థాన్‌పై పార్లమెంటులో రెండు రోజుల చర్చకు ప్రధాని అనుమతిస్తారా? భారత్, పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనల మీద స్పష్టత ఇస్తారా? అంటూ వరుస ప్రశ్నలను జైరాం రమేశ్ సంధించారు.

పాక్‌కు దెబ్బమీద దెబ్బ

జల విద్యుత్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ పెంపు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో జల విద్యుత్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. నిర్మాణ ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టుల్లో అంతకుమించి ఇప్పుడు ఎటువంటి మార్పులు చేయడం లేదని చెప్పారు. ఖట్టర్ మీడియాతో మాట్లాడుతూ 'సింధు జలాల ఒప్పందం విషయానికి వస్తే... ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టుల్లో ఎటువంటి మార్పులు లేవు. ఎందుకంటే వీటి సాంకేతిక అంశాలు ఇప్పటికే నిర్ణయించారు. కొన్ని ప్రాజెక్టులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. వాటిల్లో విద్యుత్ ఉత్పత్తిని ఎక్కువగా చేసేందుకు మరింత నీటినిల్వ సామర్థ్యం పెంచవచ్చు' అని తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం పాక్‌తో ఉన్న సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. వాస్తవానికి ఈ ఒప్పందం కారణంగానే ఇన్నాళ్లూ సింధు, దాని ఉపనదులపై భారత్ జల విద్యుత్ కేంద్రాల నిర్మాణం కష్టంగా మారింది. దీంతోపాటు నీటినిల్వ సామర్థ్యం పెంచడం కూడా ఇబ్బందికరంగా మారింది. ఇప్పుడు ఒప్పందం నిలిపివేయడంతో కొత్త ప్రాజెక్టులతో పాటు నీటి నిల్వ కూడా పెంచే అవకాశం లభించింది. ప్రస్తుతం కేంద్ర విద్యుత్ సంస్థ జమ్మూకశ్మీర్‌లో నాలుగు జల విద్యుత్ ప్రాజెక్టులను ఆమోదించింది. అవి నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. వీటిల్లో సింధుపై న్యూ గందర్బాల్ ప్రాజెక్టు, చీనాబ్‌పై కిర్తాయ్-2, సవల్‌కోట్, జీలంపై యూరీ-1,2 ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయి. సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు.

ఆ యువకుడు అక్రమంగా అమెరికా వెళ్లాడు: భారత్

న్యూఢిల్లీ: అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో ఒక భారతీయ యువకుడిపై అక్కడి భద్రతాధికారులు ప్రవర్తించిన తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ బుధవారం స్పందించింది. ఆ యువకుడు తప్పు చేశాడని, అక్రమంగా అమెరికా వెళ్లినట్లు ఎంఈఏకి సంబంధించిన వర్గాలు వెల్లడించాయి. 'ప్రయాణ సమయంలో ఆ యువకుడి ప్రవర్తన సరిగా లేదు. హర్యానాకు చెందిన అతడు సరైన వీసా లేకుండా అక్రమంగా అమెరికా వెళ్లాడు. అతడి పరిస్థితి మెరుగుపడిన తర్వాత అతన్ని భారత్‌కు పంపించే ఏర్పాట్లు జరుగుతాయి. దీనికి సంబంధించి అక్కడి అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని భారత విదేశాంగశాఖ అధికార వర్గాలు పేర్కొన్నాయి. అక్రమంగా అతడు వెళ్లి ఉండొచ్చు... కానీ, యువకుడిపై ఈ విధంగా భద్రతాధికారులు ప్రవర్తించిన తీరుపై భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికాలో ట్రంప్ పాలన వచ్చిన నాటినుంచి అక్రమ మార్గంలో దేశంలోకి ప్రవేశించిన వారిపై కొరడా ఝుళిపిస్తున్న సంగతి తెలిసిందే. ఎంతోమందిని వారివారి దేశాలకు తరలించారు. వారిలో భారతీయులు కూడా ఉన్నారు.

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు

దిగ్విజయ్ సోదరుడి బహిష్కరణ

భోపాల్: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ కీలక నేత దిగ్విజయ్ సింగ్ తమ్ముడు లక్ష్మణ్ సింగ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించారు. అగ్రనేత రాహుల్ గాంధీపై ఆయన చేసిన వ్యాఖ్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.లక్ష్మణ్‌సింగ్ కాంగ్రెస్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని వెల్లడించింది. లక్ష్మణ్ ఐదుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఇటీవల ఆయన పార్టీ నాయకత్వంపై తరచూ విమర్శలు చేశారు. దీంతో ఆయనకు ఇటీవల షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయన సస్పెన్షన్‌పై అఖిల భారత కాంగ్రెస్ కమిటీలోని క్రమశిక్షణా సంఘం నిర్ణయం తీసుకుంది. అసలేం జరిగిందంటే... ఏప్రిల్ 24న పహల్గాం బాధితులకు నివాళి అర్పించే సమయంలో లక్ష్మణ్ సింగ్ మాట్లాడుతూ 'రాహుల్‌గాంధీ, రాబర్ట్ వాద్రా పరిపక్వత లేని నాయకులు. వారి అపరిపక్వత వైఖరితో తలెత్తే పరిణామాలను దేశం అనుభవిస్తోంది. రాబర్ట్ వాద్రా స్వయంగా రాహుల్‌గాంధీ బావ. ఓ వర్గాన్ని రోడ్లపై ప్రార్థనలు చేయనీయకపోవడంతోనే ఈ దాడి జరిగిందని అంటారు. ఇలాంటి పిల్లతనాన్ని ఎప్పటి వరకు భరిస్తాం. రాహుల్ లోక్‌సభ ప్రతిపక్ష నేత... ఆయన మాట్లాడే ముందు ఆలోచించాలి. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఉగ్రవాదులతో కుమ్మక్కయ్యారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం కార్యదర్శి తారిక్ అన్వర్ నోటీసులు జారీ చేశారు. రాహుల్ గాంధీ సహా పార్టీ సీనియర్ నాయకత్వంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి అన్ని హద్దులు దాటారని అందులో పేర్కొన్నారు.

హనీమూన్ హత్య కేసు...

సోనమ్ నేరాంగీకారం

షిల్లాంగ్: సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్ రఘువంశీ తన నేరాన్ని అంగీకరించింది. తన భర్త రాజా రఘువంశీ హత్యలో తన ప్రమేయం ఉందని ఆమె పోలీసుల విచారణలో చెప్పింది. ఈ మేరకు సిట్ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసులో సోనమ్‌తో పాటు ఇతర నిందితులను బుధవారం షిల్లాంగ్ తీసుకొచ్చారు. అక్కడ సిట్ బృందం వీరిని ప్రశ్నించింది. ఆ సమయంలో సోనమ్ తన నేరాన్ని అంగీకరించినట్లు తెలుస్తోంది. దీంతో ఆమె వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ ఎదుట రికార్డ్ చేశారు. దాన్ని వీడియో టేప్ చేయాలని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తునకు ఆమె వాంగ్మూలం కీలకంగా మారనుంది.

ఉరితీయాలి: సోనమ్ సోదరుడు

మరోవైపు ఈ హత్య కేసుపై సోనమ్ సోదరుడు గోవింద్ మీడియాతో మాట్లాడారు. 'ఇప్పటివరకు ఉన్న ఆధారాలు చూస్తుంటే... ఆమెనే ఈ హత్యకు పాల్పడినట్లు అర్థమవుతోంది. ఈ కేసులో ఉన్న నిందితులందరూ రాజ్ కుశ్వాహాకు తెలిసినవాళ్లే. ఈ వార్త తెలిసిన తర్వాత మేం సోనమ్‌తో సంబంధాలు తెంచుకున్నాం. రాజా రఘువంశీ కుటుంబానికి క్షమాపణలు తెలియజేస్తున్నాం. ఈ కేసులో సోనమ్ గనుక దోషిగా తేలితే ఆమెను ఉరితీయాలి' అని గోవింద్ అన్నారు. రాజా రఘువంశీ కుటుంబం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తోంది. మే 11న అతడికి సోనమ్‌తో వివాహం జరగ్గా... 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయ వెళ్లారు. ఆ తర్వాత కనిపించకుండా పోయారు. అదృశ్యమైన 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అనంతరం సోనమ్ కోసం గాలించగా... ఉన్నట్టుండి ఆమె ఘాజీపూర్‌లో ప్రత్యక్షమైంది. ప్రియుడితో కలిసి ఆమే భర్తను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

పాక్‌ను లాడెన్ ఎందుకు ఎంచుకున్నాడు

జైశంకర్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్ వంటి వారు పాకిస్థాన్‌ను సురక్షితమైన దేశంగా ఎందుకు భావించారని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రశ్నించారు. ఐరోపాలోని బ్రస్సెల్స్‌లో ఆయన యూరాక్టివ్ అనే వెబ్‌సైట్‌కు ఇంటర్వ్యూ ఇస్తూ... పశ్చిమ దేశాల మీడియా తీరును తప్పుపట్టారు. ఆపరేషన్ సిందూర్‌ను భారత్-పాక్ సమస్యగా చూపించే యత్నం చేసిందన్నారు. 'మీకు కొన్ని విషయాలు మళ్లీ గుర్తుకు తెస్తున్నాను. ఒసామా బిన్ లాడెన్ అనే ఓ మనిషి ఉండేవాడు. అతడు ఏళ్ల తరబడి పాకిస్థాన్‌లోని సైనిక నగరంలో ఎలా ఉండగలిగాడు. ప్రపంచం ఓ విషయాన్ని అర్థం చేసుకోవాలని నేను కోరుకుంటున్నాను. అది కేవలం భారత్-పాక్ సమస్యే కాదు. అది ఉగ్రవాద సమస్య. అదే టెర్రరిజం మిమ్మల్ని వెంటాడుతూ వస్తుంది' అని జైశంకర్ చెప్పారు. 'విభేదాలను యుద్ధాలు పరిష్కరిస్తాయని మేము నమ్మడం లేదు. రణరంగం నుంచి పరిష్కారం లభిస్తుందని భావించం. అలాగని ఏం చేయాలో చెప్పడం కూడా మా పనికాదు. కానీ, పరిష్కారంలో భాగం అవుతాం. ప్రతి దేశం తటస్థంగా తమ అనుభవాలు, చరిత్ర, ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలి. భారత్ ఏర్పడిన సమయంలోనే పాక్ ఆక్రమణదారులను పంపడంతో సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దానికి పూర్తిగా మద్దతు ఇచ్చినవి పశ్చిమ దేశాలే. వాటిల్లో ఇప్పుడు చాలా దేశాలు అంతర్జాతీయ సూత్రాల గురించి గొప్పగా చర్చిద్దామంటున్నాయి. నేను ఒక్కటే చెప్పదలుచుకొన్నా. మీ గతాన్ని గుర్తుకు తెచ్చుకోండి' అని ఆయన అన్నారు. 'స్వప్రయోజనాలపై ఐరోపా సొంత సామర్థ్యం, ప్రపంచ వ్యాప్త సంబంధాల ఆధారంగా మరిన్ని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు మాటలకే పరిమితమైన వ్యూహాత్మక భాగస్వామ్యం వంటివి ఇప్పుడు ఐరోపాలో ఆచరణలోకి వచ్చినట్లు విన్నాను. బహుళ పక్ష ప్రపంచంలో మా సంబంధాలను బలోపేతం చేసుకోవడానికే ఇక్కడికి వచ్చాను' అని చెప్పారు. 'మా దేశ ప్రయోజనాలు కాపాడే ప్రతి సంబంధాన్ని మేము ముందుకు తీసుకెళతాం. ఇక అమెరికా అత్యంత ముఖ్యమైన దేశం. అదేదో 'ఎక్స్' అనే వ్యక్తి వలనో లేదా 'వై' అనే ప్రెసిడెంట్ వలనో కాదు' అని చెప్పుకొచ్చారు. 'పంపిణీ వ్యవస్థల్లో ఇబ్బందులు తగ్గించుకోవడానికి భారత్‌ను ఎంచుకొన్న చాలా ఐరోపా కంపెనీల ప్రతినిధులను కలిశాను. చాలా కంపెనీలు తమ డేటా ఎక్కడ ఉంటోందన్నదానిపై అప్రమత్తంగా ఉంటున్నాయి. దానికి కేవలం సామర్థ్యం ఉన్న చోటే కాకుండా... నమ్మకంగా, సురక్షితంగా ఉండే చోటే పెడుతున్నాయి. మీరు సౌకర్యవంతంగా ఉండలేని వ్యక్తుల చేతిలో డేటా ఉంచాలనుకుంటారా' అని అన్నారు.

కర్నాటకలో ఈడీ కలకలం

ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేల ఇళ్లపై దాడులు

ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు

బెంగళూరు: కర్నాటకలోని కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఏకకాలంలో ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు చేపట్టడం కలకలం రేపింది. వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కేవీఎస్‌టీడీ సీఎల్) నిధుల మళ్లింపుకు సంబంధించి కాంగ్రెస్ నేతలపై ఈడీ విచారణ కొనసాగుతోంది. దీనిలో భాగంగా బుధవారం బళ్లారిలోని ఐదు ప్రాంతాలు, బెంగళూరు నగరంలోని మూడు ప్రదేశాలు కలిపి మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. బళ్లారి లోక్‌సభ ఎంపీ ఈ తుకారాం, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులతో సంబంధం ఉన్నట్లుగా గుర్తించి వారికి సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఎంపీ తుకారాంతో పాటు బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేశ్, బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బీ నాగేంద్ర సన్నిహితుడు గోవర్ధన్ రెడ్డి ఇళ్లలో ఈడీ సోదాలు చేపట్టింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిమిత్తం కర్నాటక మహర్షి వాల్మీకి ఎస్టీ డెవలప్మెంట్ కార్పొరేషన్ అకౌంట్ల నుంచి కోట్లాది రూపాయల్ని నకిలీ అకౌంట్లకు బదిలీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. జులై 2024లో కాంగ్రెస్ ఎమ్మెల్యే బసనగౌడ ఇంట్లో సైతం ఈడీ దాడులు జరిపింది. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో నిధుల మళ్లింపు జరిగిందనే ఆరోపణలపై మనీలాండరింగ్ కేసులో ఈ విచారణ చేపట్టింది. అప్పట్లో కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మొత్తం 20 చోట్ల ఈడీ సోదాలు జరిపింది. ఈ దర్యాప్తుల నేపథ్యంలో కర్నాటక హెూంమంత్రి జీ పరమేశ్వర స్పందిస్తూ 'ఈడీకి దాడులు జరిపే హక్కు ఉంది. ఇది ప్రభుత్వానికి అవమానకరంగా భావించాల్సిన అవసరం లేదు. కేంద్ర సంస్థలు స్వతంత్రంగా పనిచేస్తాయి. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా ఈ కేసును విచారిస్తోంది' అని తెలిపారు. 2024 మే 21న ఈ కార్పొరేషన్ సూపరింటెండెంట్ చంద్రశేఖరన్ మృతదేహం బయటపడటంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఆయన సూసైడ్ నోట్‌లో రూ.187 కోట్ల నిధులు అనధికారంగా మళ్లించబడ్డాయని పేర్కొన్నారు. అందులో రూ.88.62 కోట్లు ఐటీ కంపెనీల ఖాతాల్లోకి, హైదరాబాద్ లోని ఓ సహకార బ్యాంక్‌లోకి అక్రమంగా జమ చేశారని తెలిపారు. ఈ ఘటన అనంతరం ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ శాఖ, క్రీడా శాఖ మంత్రిగా ఉన్న బి. నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. తర్వాత ఈడీ అతడిని అరెస్టు చేసింది. ప్రస్తుతం ఈ కుంభకోణంపై ఈడీ విచారణ మరింత వేగంగా సాగుతోంది.

ఆరోపణలు నిరాధారం: కేరళ సీఎం కుమార్తె

తిరువనంతపురం: సీఎంఆర్ఎల్ కేసులో ఆరోపణలను కేరళ ముఖ్యమంత్రి కుమార్తె టి.వీణ తీవ్రంగా ఖండించారు. సీబీఐ పిల్ తనకు 'అపకీర్తి కలిగించే' ప్రయత్నంగా ఆమె పేర్కొన్నారు. ఎక్సలాజిక్, కొచ్చికి చెందిన ప్రైవేట్ ఖనిజ సంస్థ కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి (పిల్) ప్రతిస్పందనగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆమె పైవిధంగా పేర్కొన్నారు. ఆ కంపెనీని తాను స్థాపించి... నిర్వహించానని, తనతండ్రితో సంబంధం లేకుండా స్వతంత్రంగా పనిచేస్తుందని తెలిపారు. కంపెనీ వ్యాపారంలో ఆర్థికంగా లేదా ఇతరత్రా ఆయనకు ఎటువంటి పాత్ర లేదని స్పష్టం చేశారు. వాస్తవానికి 2014లో ఆమె కంపెనీని స్థాపించగా... 2016 మేలో పినరయి విజయన్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. కోవలం ప్యాలెస్‌కు సంబంధించిన ఏ నిర్ణయం, కమ్యూనికేషన్ లేదా లావాదేవీలో తనకు ఎలాంటి పాత్ర లేదని ఆమె పేర్కొన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

బాల కార్మిక నిర్మూలన దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రు చేతుల మీదుగా బాల కార్మిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా గోడ పత్రిక పోస్టర్‌ను రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా విద్యాశాఖ విద్యాశాఖ అధికారి విజయ కుమారి, జిల్లా సంక్షేమ అధికారి అయినటువంటి శారద, బాల రక్షక భవన్ కోఆర్డినేటర్ తిరుమలా దేవి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి అటువంటి ఇంతియాజ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రేణుక, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి, సిబ్బంది ప్రత్యేక దత్తత ఏజెన్సీ మేనేజర్ అరుణ్ జంజల్, సతీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఉంటున్న నిరుపేదలకు

ఇందిరమ్మ ఇళ్లకై నివేదిక సమర్పించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రభుత్వ భూములలో ఉంటున్న నిరుపేదలకు పక్కా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు గాను ప్రభుత్వ భూములలో స్లమ్స్‌ను గుర్తించి నివేదికలు సమర్పించాలని జిల్లా అదనపు కలెక్టరు రాధికాగుప్తా తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టరు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ భూములలో ఉన్న మురికివాడలలో ఉన్న ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వాటిని తిరిగి నిర్మించేందుకుగాను స్థలాలను గుర్తించేందుకు తహసీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లు సమన్వయంతో పనిచేసి నివేదిక సమర్పించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద శిథిలావస్థలో, ఇరుకుగా ఉన్న ఇళ్లను పునరాభివృద్ధి చేసేందుకు గాను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలలో వార్డులలో ఉన్న స్లమ్ ఏరియాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములలో మురికివాడలలో ఉన్న ఇళ్లను గుర్తించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆ కుటుంబాల సమ్మతితో నివేదికలు తయారు చేసి ఈ నెల 13వ తేదిలోగా నివేదికలు అందించాలని తెలిపారు. భవిష్యత్తులో అన్ని మురికివాడల నివాసితులకు అన్ని సౌకర్యాలతో పాటు గౌరవప్రదమైన గృహాలను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ హౌజింగ్ ఈఈ రమణమూర్తి, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

అభిమాన జర్నలిస్టుతో అక్షరాభ్యాసం

విశాలాంధ్ర - హైదరాబాద్ : చదువులో తమ పిల్లలు రాణించాలనే మొక్కుబడితో సాధారణంగా ఆలయాల్లో వేద పండితుల చేతుల మీదుగా తమ పిల్లలకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయిస్తుండడం చూస్తుంటాం. కానీ దశబ్దాలుగా తమ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచి అభిమానాన్ని చూరగొన్న ప్రజా జర్నలిస్టుతో తమ కూతురికి అక్షరాభ్యాసం చేయించి, వారి కోరికను తీర్చుకున్నారు ఆ తల్లిదండ్రులు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ కు చెందిన సోము బాల్ నర్సయ్య కుటుంబం, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీకి గత 40యేండ్లుగా వీర అభిమానులు. పదకొండేండ్ల క్రితం బాల్ నర్సయ్య మృతి చెందినప్పటికీ, అతని కుమారులు సోము యాదగిరి, సోము కుమార్ లు అదే అభిమానాన్ని కొనసాగిస్తున్నారు. నాటి నుండి నేటి వరకు ఆ కుటుంబానికి విరాహత్ అలీ చేదోడుగా నిలిచారు. బుధవారం ఆ కుటుంబం బషీర్‌బాగ్‌లోని టీయూడబ్ల్యూజే కార్యాలయానికి చేరుకొని విరాహత్ అలీ చేతుల మీదుగా చిన్నారి హరిచరణకు అక్షరాభ్యాసం చేయించుకొని ఆశీర్వాదాలు తీసుకున్నారు. విరాహత్ అలీ మాట్లాడుతూ, తన పట్ల ఉన్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

బిఆర్‌కే భవన్‌కు తరలి వెళ్లిన ఎమ్మెల్యే మర్రి



విశాలాంధ్ర - మల్కాజిగిరి : కాళేశ్వరం ప్రాజెక్టు కృంగిపోయిన విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయ విచారణ కమిషన్ వేసింది. ఈ విచారణకు బుధవారం కమిషన్ ముందుకు తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరవుతున్నందున మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజ శేఖర్ రెడ్డితో పాటుగా బీఆర్ఎస్ శ్రేణులు నియోజకవర్గం నుండి బయలుదేరి వెళ్లారు. బి.ఆర్.కే భవన్‌లో ఈ విచారణ జరగడంతో అక్కడికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు మేకల రాము యాదవ్, బైరు అనిల్, సిద్ధిరాములు, నరహరి రావు, నర్సింగ్, బిక్షపతి, నగేష్ గౌడ్, కిట్టు, శ్రీరాముల యాదవ్, హబీబ్, మర్రి శ్రీను, చిట్టిబాబు, ప్రేమ్, సతీష్, భరత్ తదితరులున్నారు.

ఎస్‌పి నగర్ దవాఖానాలో ఏఐ టెక్నాలజీతో టీబీ స్క్రీనింగ్ పరీక్షలు



విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఎస్.పి. నగర్‌లోని బస్తి దవాఖానలో ప్రధాన మంత్రి టీబి ముక్తి భారత్ అభినయ్ కార్యక్రమంలో భాగంగా టీబి స్క్రీనింగ్ ఏ-ఐ టెక్నాలజీతో ఎక్స్రే యంత్రం ద్వారా 80 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12 మంది టీబి అనుమానితులను గుర్తించి వారికి టీబి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 60 సంవత్సరాల పైబడిన షుగర్, బిపి, టీబి పేషెంట్లు కూడా ఉన్నారు. ఎస్.పి. నగర్ బస్తి దవాఖాన డాక్టర్ బ్లెస్సి, సూపర్వైజర్ బి.రామోజీ, రాంచందర్, గిరి, హేమలత, హాస్పిటల్ సిబ్బంది, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రైతులతో కలిసి పొలం దున్నిన మంత్రి

శక్తి లేని రైతులకు మా కార్యాలయంలో విత్తనాలు అందిస్తాం : మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏరువాక పౌర్ణమి సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రైతాంగానికి శుభాకాంక్షలు తెలియచేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం పందిళ్ళ గ్రామంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంత్రి పొన్నం నాగలి పట్టి పొలం దున్నారు. పందిళ్ళలో ఏరువాక సందర్భంగా మాందాటి వెంకట్ రెడ్డి పొలంలో ఎడ్లతో నాగలి దున్ని రైతులతో కలిసి పెసర విత్తనాలు చల్లడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు ఒక్క గుంట కూడా బీడు లేకుండా వరి, మొక్కజొన్న, ఆయిల్ ఫాం ఇతర పంటలు ఏవైనా వేయాలని సూచించారు. రైతులు ఎక్కడ ఖాళీ జాగా బీడు లేకుండా చూడాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర అందిస్తుందని చెప్పారు. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉండే ప్రభుత్వం మాదని భరోసా ఇచ్చారు. ఈసారి మంచి వర్షాలు పాడి పంటలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం దేశంలో ఉత్పత్తులు ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అన్ని రాజకీయ మిత్రులు అధికారులు ఎక్కడ ఖాళీ స్థలం లేకుండా చూసుకోవాలని కోరారు. విత్తనాలు వేసుకునే శక్తి లేని వారికి మా కార్యాలయాన్ని సంప్రదిస్తే మేము విత్తనాలు అందిస్తాం.. మీరు ఖాళీ జాగా లేకుండా పంటలు వేయాలని సూచించారు. పంటలు, యాంత్రీకరణ తదితర అంశాల పై రైతులు అవగాహన చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ లింగమూర్తి, ఆర్డీవో, వ్యవసాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకుతో రూ.కోటి 25 లక్షల ప్రమాద బీమా ఒప్పందం

సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు సూచనల మేరకు కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే కోటి రూపాయలు ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నప్పటికీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి సంస్థ బుధవారం కుదుర్చుకున్న కోటి 25 లక్షల రూపాయల ప్రమాద బీమా పథకం ఒక చారిత్రక ఘట్టమని సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఈ ఒప్పందం కుదిరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినప్పుడు కంపెనీ ఇస్తున్న సహాయం కొంత ఉన్నప్పటికీ వారి కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో బ్యాంకులతో మాట్లాడి ఈ తరహా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే అమలవుతున్న పథకాల వల్ల కార్మికుల కుటుంబాలకు గట్టి ఆర్థిక భరోసా లభించిందని అన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారు కూడా మిగిలిన బ్యాంకుల అన్నిటికన్నా ఎక్కువగా కోటి 25 లక్షల రూపాయల బీమా పథకాన్ని అమలు చేయడానికి ముందుకు రావడం, అలాగే సాధారణ మరణం సంభవించిన వారికి 10 లక్షల రూపాయల టర్మ్ ఇన్సూరెన్స్‌ను కూడా పంజాబ్ నేషనల్ బ్యాంక్ అమలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి పొరుగు సేవల ఉద్యోగుల కోసం 40 లక్షల రూపాయల ప్రమాద బీమా ఒప్పందాన్ని కూడా అమలు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ అశోక్ చంద్ర మాట్లాడుతూ సింగరేణి సంస్థతో తాము కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఇతరులకు కూడా ఆదర్శప్రాయమని అన్నారు. ఈ పథకం నేటి నుండి సింగరేణి ఉద్యోగులకు అమల్లోకి వస్తుందన్నారు. సింగరేణి సంస్థ తరఫున ఇంకా డైరెక్టర్ ఆపరేషన్ ఎల్.వి.సూర్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం. సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎస్.వి. రాజశేఖర్ రావు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ రీజినల్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ చుగ్ పాల్గొన్నారు.

కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు ఇవ్వడంపై హర్షం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో కొత్తగా 65 వేల ఆటో రిక్షా పర్మిట్లు జారీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో బుధవారం జరిగిన విలేఖరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్ల సంఘాల జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం, ఎస్.అశోక్, సిహెచ్. జంగయ్య, ఎండి.ఒమర్ ఖాన్, (ఎఐటియుసి), వి.ప్రవీణ్, లింగం (టియుసిఐ), వి.మారయ్య, మహేష్ (బిఆర్‌టియు,) పి.శ్రీకాంత్, అజయ్‌బాబు (సిఐటియు), ఎం.ఎ.సలీం, నజీర్, రఫీక్ (యుటిఎడి డబ్ల్యుఎ,) పి.రాంరెడ్డి (ఐఎఫ్‌టియు), పి. యాదగిరి (టీఎన్టీయూసీ), మీర్జా రఫాత్ బేగ్ (ఆటో ఓనర్స్ అసోసియేషన్), ఎస్.కె.పి. జమ (జిహెచ్ఎడియు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అనేకమైన ఆందోళనలు చేసిన పిదప రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు జారీకి అనుమతి ఇవ్వడం హర్షణీయమని, మిగితా ప్రధాన డిమాండ్లయిన వంద శతం పెరిగిన ఇంధన చార్జీలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలు పెంచడం, ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు హామీ ఇచ్చిన రూ.12.000 ఆర్థిక సహాయం, ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఓలా, ఊబర్, రాపిడోల నుండి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను రూపొందించడం వంటివి తక్షణమే పరిష్కరించాలని అయన విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని కొత్తగా ఆటో రిక్షా పర్మిట్లు జారీకి అనుమతి ఇవ్వడంపై అభినందిస్తూ, మిగితా డిమాండ్లను కూడా త్వరలో పరిష్కరించాలని బి.వెంకటేశం కోరారు.

పిఏసిఎస్ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం (ఐ.ఎన్.టి.యు.సి) నేతలు విజ్ఞప్తి చేసారు. ఐ.ఎన్.టి.యు.సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు యరగాని నాగన్న గౌడ్ నేతృత్వంలో సంఘం అధ్యక్షులు ఎ.శ్రీనివాసగౌడ్, నాయకులూ మోతె భాస్కర్ రెడ్డి, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గోపాల మల్లారెడ్డి, కదారీ వీరేశం, మోడెం సురేష్, పోచంపల్లి కృష్ణమూర్తి, చింతకాయల సురేష్, కొన్నే వెంకటయ్య, ఏడకులు సోమిరెడ్డిలు హైదరాబాద్, రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలసి వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ఆర్థిక వృద్ధికి తోడ్పాటును అందిస్తున్న పిఏసిఎస్ ఉద్యోగుల సమస్యలు దాదాపు 12 సంవత్సరాల నుండి పరిష్కరించకుండా ఉన్నాయని, పిఏసిఎస్ ఉద్యోగులకు పెండింగ్ లోఉన్న పి.ఆర్.సి తక్షణమే అమలు చేయాలనీ, ప్రతినెలా 5న డిసిసిబి బ్యాంకు ద్వారా జీతభత్యాలు చెల్లించాలని, గ్రాట్యుటీ 2 లక్షల రూపాయలు కాకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్ డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ఇవ్వాలని, ఉమ్మడి జిల్లాలతో సంబంధం లేకుండా స్థానిక జిల్లాలోనే బదిలీలు చేయాలనీ, ప్రత్యేక నిధులను కేటాయించి డిసిసిబి ద్వారా భవిష్యనిధి చెల్లించి, ఆరోగ్య కార్డులు కూడా ఇవ్వాలని, 2019 సంవత్సరం తరువాత సంఘంలో చేరిన ప్రతి ఉద్యోగికి జి.ఓ. నెంబర్ 44ను అమలు చేయాల నీ, 25%బ్యాంకు నియామకాల్లో ఎలాంటి పరీక్షలు లేకుండా సీనియారిటీ ఆధారంగా పిఏసిఎస్ ఉద్యోగులను ఎంపిక చేసి బ్యాంకుల్లో తీసుకోవా లని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు విజ్ఞప్తి చేసారు. మంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రితో చర్చించి పిఏసిఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నాలాల విస్తరణ పనులు పరిశీలించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని తార నగర్ కాలనీలో గల సాయి బాబా దేవాలయం వద్ద రూ.28 కోట్ల 45 లక్షల రూపాయలతో నల్లగండ్ల చెరువు అలుగు నుండి బీహెచ్ఈఎల్ చౌరస్తా గ్యాస్ గో డౌన్ నాల వరకు నాల విస్తరణ పనులలో భాగంగా నిర్మిస్తున్న ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను, ఆర్‌సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం, విస్తరణ పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, ఎస్ఎన్‌డీపీ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పీఏసీ ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎన్‌డీపీ ఫేస్ 2 లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79 కోట్ల 58 లక్షల రూపాయలతో అంచనా వ్యయంతో నాలాల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, దానిలో భాగంగా తార నగర్ కాలనీలో గల సాయి బాబా దేవాలయం వద్ద రూ.28 కోట్ల 45 లక్షల రూపాయలతో నల్లగండ్ల చెరువు అలుగు నుండి బీహెచ్ఈఎల్ చౌరస్తా గ్యాస్ గోడౌన్ వరకు నాలా విస్తరణ పనులు, ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులు, ఆర్‌సీసీ బెడ్, సైడ్ వాల్స్ నిర్మాణం, నాల విస్తరణ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలని, ఒకప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఆందోళనతో ఇబ్బందులకు గురయ్యేవారు అని, కానీ నేడు సమస్య లేకుండా మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ రోజు పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించింది అని ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రాధాన్యతలో విస్తరణ పనులు చేపట్టాలని, నాలల విస్తరణ పనులలో వేగం పెంచాలని, యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించాలని, అధికారులకు గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు ఏఈ నిఖిల, యుగేందర్, పవన్, టౌన్ ప్లానింగ్ అధికారులు డిప్యూటీ సిటీ ప్లానర్ తులసిరామ్, టీపీఎస్ జిషన్, టీపీఎస్ సంతోష్, నాయకులు, కార్యకర్తలు తదితర స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - ఘట్కేసర్ : నడుస్తున్న రైలుకు ఎదురుగా వెళ్ళి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రాక్సల్ రైలు ఘట్కేసర్ రైల్వే గేటు వద్ద చేరుకోగానే 45 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి రైలుకు ఎదురు వెళ్ళడంతో ఇంజన్ ముందు భాగం తలభాగంలో గుచ్చుకోవడంతో కొన్ని మీటర్ల దూరం వరకు వెళ్ళడంను గమనించిన రైలు డ్రైవర్, రైలును రైల్వేస్టేషన్లో నిలిపి పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు ఇంజన్ నుండి మృతదేహాన్ని విడదీశారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని రైల్వే పోలీసులు తెలిపారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వసతులు కల్పించాలి: కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. బోనాలు, మొహరం పండుగల సందర్భంగా బుధవారం ఆయన డబీర్ పుర, లాల్ దర్వాజ ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని తెలిపారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జోనల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు. భక్తులు కూడా పరిశుభ్రతను పాటించాలని, వ్యర్థాలు నిర్దేశించిన ప్రదేశాలలో పారవేయాలని కమిషనర్ భక్తులను కోరారు. కమీషనర్ వెంట జోనల్ కమీషనర్ వెంకన్న డి సి ఏ ఎం అండ్ హెచ్ ఓ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి బుధవారం జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా అయను యూనివర్సిటీ భవనంలో పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం సేవా సమితి బాలుర వసతిగృహం, కన్వెన్షన్ సెంటర్‌ను సందర్శించాలని కోరారు. ఆహ్వానాన్ని మన్నించి రెడ్డి సేవాసమితి బాలుర వసతి గృహాన్ని, కన్వెన్షన్ సెంటర్‌ను అయన సందర్శించారు. స్థానిక శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు రెడ్డి సేవా సమితి భవనాన్ని పాలమూరు జిల్లాకు కేటాయించిన ఐఐటీ కళాశాల తరగతులు తాత్కాలికంగా నిర్వహించుకొనుటకు అంగీకరించామని అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి వివరించారు. కళాశాల తరగతుల నిర్వహణకు సేవా సమితి భవనం చాలా అనుకూలంగా ఉందని ప్రొ వి.బాలకిష్టారెడ్డి తెలియజేశారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి ఎస్. సురేందర్ రెడ్డి సభ్యులు టి.పరమేశ్వర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

టిపిసిసి అధ్యక్షుని కలిసిన జగదీశ్వర్ గౌడ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: టిపిసిసి ప్రధాన కార్యదర్శి(జనరల్ సెక్రటరీ) గా ఎన్నికైన సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టిపిసిసి జనరల్ సెక్రటరీ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబెర్ వి.జగదీశ్వర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేసారు. నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటూ, రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, నాయకులను కలుపుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం పునరంకితమవుతానని, కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకన్ని తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తానని, కాంగ్రెస్ పార్టీ పురోగతి కోసం అలుపు లేకుండా పనిచేసేలా నాలో ఉత్సాహం నింపినందుకు కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వానికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

వివాదంలో సింగర్ మంగ్లీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ నిర్వహించిన ప్రముఖ సింగర్ మంగ్లీ వివాదంలో చిక్కుకున్నారు. మంగళవారం సింగర్ మంగ్లీ పుట్టినరోజు కావడంతో నగరం సమీపంలోని చేవెళ్లలోని త్రిపుర రిసార్ట్‌లో బర్త్‌డే పార్టీని ఏర్పాటు చేశారు. అయితే ఈ వేడుకలకు మంగ్లీ సన్నిహితులను ఆహ్వానించగా ప్రముఖ గేయ రచయిత కాసర్ల శ్యామ్ సహా పలువురు ప్రముఖులు కూడా పాల్గొన్నారు. అసలు ఈ పార్టీకి ఎలాంటి అనుమతి లేకుండా నిర్వహించడం గమనార్హం. రిసార్ట్‌లో డీజేలు ఏర్పాటు చేసి నృత్యాలు చేయడంతో ఇరుగు పొరుగు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుకోని అతిథులుగా వచ్చిన పోలీసులను చూసి అక్కడ ఉన్న వారు ఖంగుతిన్నారు. ఈ దాడుల్లో పెద్దమొత్తంలో గంజాయి, వివిధ రకాల విదేశీ మద్యం సీసాలు లభ్యం అయ్యాయి. దీంతో పార్టీలో వున్న పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొంతమందికి పాజిటివ్ రిపోర్ట్ రావడంతో మొత్తం వ్యవహారం వివాదాస్పదంగా మారింది. అయితే ఈ ఈవెంట్‌కు ఎలాంటి అనుమతి లేదని పోలీసు వర్గాలు తెలపడంతో ఇందుకు సంబంధించి మంగ్లీ, రిసార్టు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. డ్రగ్స్ వినియోగించిన వారిలో కొందరు ప్రముఖుల పిల్లలు కూడా ఉన్నట్లు సమాచారం. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు.

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) గురజాల వారి కోర్టులో

H.M.O.P. No. 71 / 2024

బిట్వీన్ :

మూదావత్ గంగానాయక్ ...పిటీషనర్

Vs

మూదావత్ & కెతావత్ స్వాతి ...రెస్పాండెంట్

టు,

మూదావత్ & కెతావత్ స్వాతి,W/o. గంగా నాయక్, D/o.మంత్రి నాయక్,C/o.అమృత కాంప్లెక్స్, కొత్తపేట, రైతుబజార్, స్ప్రెసిహబ్ దగ్గర, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు పిటీషను వాది దాఖలు చేసియున్నారు. సదరు పిటీషనుకు సంబంధించి శ్రీముఖులు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొని యుండలేదు. కావున పైన తెలిపిన పిటీషనులో మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనుటకు శ్రీ కోర్టు వారు ది.30/06/2025 వ తేదీన వాయిదావేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥10.30గం.లకు మీరు గాని మరియు వకీల్ ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల సదరు పిటీషను మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా : 30.06.2025

కోట శ్రీనివాసరావు,

వాది తరపున న్యాయవాది, గురజాల (9866469668)

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏప్రిల్ 27న ఎల్కతుర్తి బిఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి వస్తున్న వాహన ఢీకొని మరణించిన ఇద్దరు కుటుంబాలకు 2 లక్షల చొప్పున మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్థిక సహాయం అందచేశారు. ఎల్కతుర్తి బిఆర్ఎస్ రజతోత్సవ సభ ముగించుకుని వెళ్తున్న వాహనం ఢీకొని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడేం సారయ్య, బండోజు గణేష్‌లు మృతి చెందారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం బస్వాపూర్ గ్రామంలో తాడేం సారయ్య, బండోజు గణేష్ ల నివాసాలకు వెళ్ళి ఒక్కొక్కరి కుటుంబానికి 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేశారు. వారి పిల్లల చదువులకు అండగా ఉంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఇంటికి పెద్ద దిక్కు లేకపోవడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాము అండగా ఉంటామని పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని పేర్కొన్నారు.

నాణ్యత ప్రమాణాలపై హామీతో ఆశీర్వాద్ ఆటా

విశాలాంధ్ర - అదిలాబాద్: భారతదేశపు ప్రముఖ గోధుమ పిండి బ్రాండ్‌గా పేరుగాంచిన ఆశీర్వాద్ ఆటా దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో 'క్వాలిటీ సర్టిఫికెట్' ప్రారంభంతో 'నాణ్యత హామీని పునర్నిర్వచిస్తోందని ఐటీసీ ఫుడ్స్ స్టేపుల్స్, అడ్జసెన్సీస్ అధికారి అనుజ్ కుమార్ రుస్తగి చెప్పారు. 'నాణ్యత హామీ పేరుతో నూతన టీవీసీను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశీర్వాద్ తమ దీర్ఘకాల సంబంధంతో ప్రసిద్ధి చెందిన నటీమణి స్నేహాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా పునః పరిచయం చేసిందన్నారు. ఉత్తమమైన ఉత్పత్తిని ప్రజలు ఎంపిక చేయడాన్ని నిర్ధారించడానికి సేకరణ నుండి ప్యాకేజింగ్ వరకు వివిధ నాణ్యతా ప్రమాణాలను నెరవేర్చే సరైన ఉత్పత్తిని ఎంచుకోవడం తప్పనిసరి అన్నారు. ప్రతి ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్యాక్ ఇప్పుడు క్వాలిటీ సర్టిఫికెట్‌తో అందజేస్తున్నామన్నారు. గోధుమపిండి స్వచ్ఛత 100 శాతం గోధుమపిండి 0 శాతం మైదా కలిగి ఉండి, పోషకాహార విలువలు, ఫైబర్ ప్రోటీన్‌తో ఆశీర్వాద్ వారి 'క్వాలిటీ సర్టిఫికెట్' తెలియచేస్తుందని, ఆశీర్వాద్ సుపీరియర్ ఎంపీ ఆటా ప్రతి ప్యాక్ ఉత్తమమైన పద్ధతులు రూపొందించబడుతుందని చెప్పారు.

దరఖాస్తులకు పరిమితం కాకుండా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : దరఖాస్తులకు పరిమితం కాకుండా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు హిమాయత్ నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తులు తప్ప అమలుకు నోచుకోవడం లేదని వారు విమర్శించారు. ఈ పథకానికి రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు 16 లక్షలా 25వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున రాజీవ్ యువ వికాస్ పథకం లబ్దిదారులకు నిధులను మంజూరు చేస్తామని ప్రచారం చేసి వాయిదా వేసిందన్నారు. నిర్లక్ష్యం చేయకుండా రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, శివ కుమార్, వంశి పాల్గొన్నారు.

ఫ్రీ మాన్సూన్ ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఫ్రీ మాన్సూన్ ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాన్ని మౌలాలి డివిజన్ సంతోషి మాత కాలనీలో బుధవారం నిర్వహించారు. మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీత యాదవ్ మాట్లాడుతూ ముందస్తు ఫ్రీ మాన్సూన్ స్పెషల్ శానిటేషన్ కార్యక్రమం అనేది మంచి ఆలోచన అని లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా రాబోయే వర్షా కాలం వరద నీరు ద్వారా చెత్త చెదారం, మట్టి ఇసుక ప్లాస్టిక్ మురుగు నీటి కాలువల్లోకి పోకుండా కొంత మేరకు అరికట్టవచ్చన్నారు. డివిజన్‌లో బండ చెరువుకు అనుసంధానంగా ఉన్న పెద్ద నాలా, దీనదయాళ్ నగర్, సంతోషిమత కాలనీ నుండి శంకరయ్య కాలనీ ద్వారా బండ చెరువులో కలుస్తుందని అట్టి పెద్ద నాలా వెంట ప్రత్యేక పారుశుధ్యం నిర్వహించి సుమారు 1.5 కి. మీటర్ల దూరం మేరకు శుభ్రపరిచారు. ఉప వైద్య అధికారిణి డా.కే.మంజుల మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక శానిటైజ్ డ్రైవ్ ఎంతగానో ఉపయోగపడుతోదన్నారు. శానిటేషన్ సూపర్ వైజర్ చింతా శ్రీనివాస్, ఎస్.ఎఫ్.ఏ లు అజయ్ సింహ, యాదగిరి జవన్స్, రాజ్యలక్ష్మి, భారతి, అంజమ్మ, మనీష, కిష్టమ్మా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల ఏర్పాటు పారదర్శకంగా జరగాలి

విశాలాంధ్ర- బషీర్ బాగ్: మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్పొరేషన్ డివిజన్ల ఏర్పాటులో పారదర్శకత లోపించిందనీ, అధికార పార్టీకి అనుగుణంగా విభజన ప్రక్రియ చేపడుతున్నారని బిసి మహాసభ జాతీయ అధ్యక్షులు మెట్టుకాడి శ్రీనివాస్ ఆరోపించారు. జాతీయ, ప్రాంతీయ రహదారులను ప్రామాణికంగా తీసుకోకుండా ఒకే సామజిక వర్గానికోసం అక్రమాలు నిభంధనలను పాటించకుండా గోప్యంగా డివిజన్‌ల ఏర్పాటు చేయడం అప్రజాస్వామ్యం అని అన్నారు. బిసి రిజర్వేషన్ వచ్చిన కూడా ఒకే సామజిక వర్గం వారి ప్రభావం ఉండబోతుందంటే ఇది బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అధికారులు పునరాలోచించి డివిజన్‌లు ఏర్పాటు సక్రమంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపి డివిజన్‌ల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు వెన్న శెట్టి కుమ్మరి రాంచంద్రయ్య, పద్మరాం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాంగి లక్ష్మీశాంత్, బిసి మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు హరిప్రకాశష్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, నీలి విష్ణు, శ్రీ నివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల పునఃప్రారంభం పండగలా జరగాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పాఠశాలల పున:ప్రారంభం రోజు జూన్ 12న పాఠశాలల్లో పండగ వాతావరణం ఉండేలా ఏర్పాటు చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుండి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ మీటింగ్ నిర్వహించి గురువారం జూన్ 12 నుండి పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్న సందర్భంగా కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పున: ప్రారంభం రోజున విద్యార్థులందరికీ టెక్స్టబుక్స్, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ యూనిఫార్మ్ కచ్చితంగా వంద శాతం అందజేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రారంభోత్సవం సందర్భంగా పంపిణీ స్టాళ్లను అలంకరణలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలను పండగ వాతావరణంలో ప్రారంభించి తల్లిదండ్రులని పిల్లల్ని అందర్నీ ఆహ్వానించి ఒక వేడుకలా చేయాలని తెలిపారు. బడిబాటను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి వస్తున్న ఎన్రోల్మెంట్‌ని కచ్చితంగా తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ నందు హెచ్ఎం లాగిన్ ద్వారా పొందుపరచాలని ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ అధికారిని ఆర్ రోహిణి, డిప్యూటీఈవోలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సెలక్షన్ పోస్ట్స్ పరీక్ష ఫేస్ 13 నోటిఫికేషన్ విడుదల

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ "సెలక్షన్ పోస్ట్స్ పరీక్ష 13వ ఫేస్, 2025" వివిధ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ను జూన్ 2న విడుదల చేసిందని అర్హత గల అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/ విభాగాలు/సంస్థలలో ఉన్న వివిధ పోస్టుల ప్రత్యక్ష నియామకం కోసం కమిషన్ ఓపెన్ కాంపిటీటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా, క్రింద తెలిపిన వెబ్సైటు ద్వారా సమర్పించాలని, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ జూన్ 23, అలాగే పరీక్షా రుసుము చెల్లించడానికి చివరి తేదీ 24 అని తెలిపారు. పోస్టుల వివరాలు, వయోపరిమితి, క్వాలిఫికేషన్, పరీక్షా ఫీజు, దరఖాస్తు పద్ధతి, తదితర వివరములకు https://ssc.gov.in వెబ్సైటును సంప్రదించాలని సూచించారు. దక్షిణ విభాగంలో పరీక్ష జులై 24 నుండి ఆగస్టు 4 మధ్యలో ఉండవచ్చని, తెలంగాణ లో ఈ పరీక్షకు 3 సెంటర్లు కేటాయించబడ్డాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిరుపేదల సొంతింటి కల నెరవేరేది కాంగ్రెస్‌తోనే :ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తూరు : నిరుపేదలకు నీడనిచ్చేదుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ అందుతాయని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఊరి పేదలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ భరోసా ఇచ్చారు. బుధవారం నందిగామ మండలం, చర్ల అంతిరెడ్డిగూడ, వీర్లపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యేతో పాటు వచ్చిన నాయకులకు భారీ గజమాల, మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే నిరుపేదలకు సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండ విడతలవారీగా నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. నందిగామ మండల ఎంపీడీవో సుమతి, ఎంపీఓ తేజ సింగ్, మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, హౌసింగ్ పిడి సిడి నాయక్, వీర్లపల్లి మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, రాములమ్మ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, యూత్ కాంగ్రెస్ వెంకటచారి.మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమార్ గౌడ్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, కావలి కృష్ణ, అన్వర్, సి మల్లేష్, సీతారాం, ప్రభు, ప్రభాకర్, మంకాల శ్రీశైలం, గుండాల వేణుగోపాల్, ఆవుల శివ, సట్టి శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జి నవీన్ గౌడ్, బుగ్గ నర్సింలు, బుగ్గ శ్రవణ్, సాములయ్య, ఈదులపల్లి సర్పంచ్ రాజు, సాలయ్య, గడ్డం జంగయ్య, చీకూర్తిదర్శన్, శేఖర్ రెడ్డి తదితరలన్నారు.

బఫర్ జోన్ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కాప్రా : నాచారం పారిశ్రామిక ప్రాంతంలో ప్రజల వినియోగానికి కేటాయించిన బఫర్ జోన్ను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నాచారం అన్నపూర్ణ కాలనీ వాసులు ఉప్పల్ తహసీల్దారు వాణిరెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక నాయకులు మహ్మద్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో కాలనీ వాసులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. నాచారం విలేజ్, రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ, సర్వే నంబర్ 106లోని పారిశ్రామిక జోన్, నివాస ప్రాంతం మధ్య ఉన్న బఫర్ జోన్‌ను కొందరు వ్యక్తులు ఆక్రమించి అందులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం, ప్రజారోగ్యం, పర్యావరణ నాణ్యతను కాపాడటానికి పారిశ్రామిక - నివాస ప్రాంతాల మధ్య బఫర్ జోన్లు ఉండాలి. ఈ బఫర్ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలు ఉన్నాయని, అయినా వీటిని అతిక్రమించిన కొందరు వ్యక్తులు కబ్జాలకు పాల్పడుతూ నిబంధనలు ఉల్లంఘించాని పేర్కొన్నారు. కబ్జాలకు గురైన బఫర్ జోన్ స్థలాన్ని కాపాడాలని గతేడాది సెప్టెంబరులో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. నాచారం పారిశ్రామిక ప్రాంతంలో పలువురు వ్యక్తులు బఫర్ జోన్ ఆక్రమణ అనధికారికమే కాకుండా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, కోర్టు ఆదేశాలు పేర్కొన్న చట్టబద్ధమైన బఫర్ జోన్ నిబంధనలను ఉల్లంఘించడమే అన్నారు. దీనిపై అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన ప్రచారాన్ని ప్రారంభించిన ఉపాసనా

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: హెల్త్ కేర్ టెక్నాలజీలో అగ్రగామిగా ఉన్న ఫ్యూజీఫిల్మ్ ఇండియా తాజాగా 'త్వరగా గుర్తించండి, త్వరగా పోరాడండి' అనే సీఎస్ఆర్ ప్రచారం ప్రారంభించింది. అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ విభాగం వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసనా కామినేని కొణిదెల దీన్ని ప్రారంభించారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించి, దాన్ని త్వరగా గుర్తించాల్సిన అవసరంపై ఈ ప్రచారం ప్రధానంగా దృష్టి సారిస్తుంది. ముఖ్యంగా మహిళల ఆరోగ్యంపై కొన్ని అపోహలు ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రచారం ముమ్మరంగా చేస్తారు. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ విభాగం వైస్ ఛైర్‌పర్సన్ ఉపాసనా కామినేని కొణిదెల మాట్లాడుతూ, 'వైద్యరంగంలో అగ్రగాములుగా ఉన్న వారిపై కేవలం అనారోగ్యాలకు చికిత్స చేయడమే కాక.. ముందుగా గుర్తించాల్సిన, అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. తగిన సమాచారం లేకపోవడం, త్వరగా చికిత్స పొందడానికి వనరులు లేకపోవడంతో చాలామంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారినపడి మరణిస్తున్నారు. ఈ వాస్తవాన్ని లోతుగా అర్థం చేసుకునేందుకు ఫ్యూజీఫిల్మ్ ఇండియా చేపట్టిన ఈ సీఎస్ఆర్ ప్రచారం ఉపయోగపడుతుంది. ఫ్యూజీఫిల్మ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కోజి వాడా మాట్లాడుతూ, "ఈ ప్రపంచానికి మరిన్ని నవ్వులు ఇవ్వాలన్న మా గ్రూప్ లక్ష్యానికి అనుగుణంగా ఫ్యూజీఫిల్మ్ ఇండియా ఎప్పుడూ వినూత్న పరిష్కారాలను అన్వేషిస్తుంటుంది. విభిన్నమైన ఆలోచనలు, సామర్థ్యాలు, అసాధారణ వ్యక్తుల సాయాన్ని కలపడం ద్వారా ఈ ప్రపంచానికి సంతోషం, నవ్వులు అందించే పరిష్కారాలను సృష్టించడమే మా లక్ష్యం. 'త్వరగా గుర్తించండి, త్వరగా పోరాడండి' అంటూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ఈ ప్రచారంతో మహిళలకు తగిన అవగాహన కల్పించి, ఈ వ్యాధిని త్వరగా గుర్తించి, వీలైనన్ని ప్రాణాలను కాపాడాలన్నదే మా లక్ష్యం" అని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ అమర్ సింగ్ విచ్చేసి, ముగ్గు వేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 హామీలలో ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ఒకటి. స్వర్గీయ ఇందిరా గాంధీ గరీబ్ హటావో గరీబ్ బచావో అనే నినాదంతో ప్రతి గ్రామంలో ఇల్లు లేని పేదవారు ఉండకూడదు అనే ఉద్దేశంతో ఇందిరా గాంధీ భారతదేశంలో ప్రతి గ్రామంలో ఎన్నోఇండ్లు ఇచ్చారని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుపేదకు ఇండ్లు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వని మరింత బలపరచాలని అన్నారు. మొదటి విడతలో పేరు రాని వారు అధైర్యపడవద్దని, రెండవ విడతలో ఇండ్లు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగ తూర్తి రవి, మాజీ కార్పొరేటర్లు, మాజీ కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ఇందిరమ్మ ఇండ్ల సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కథనానికి స్పందన

విశాలాంధ్ర - మొయినాబాద్: మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు రోగుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వచ్చే రోగులకు కింది స్థాయి సిబ్బందితోనే చికిత్స మందులకి సరిపెడుతున్నారంటూ... శీర్షిక బుధవారం విశాలాంధ్రలో ప్రచురితమైంది. ఈ విషయం పాఠకులకు విదితమే. అయితే జిల్లా అధికారుల స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓ నర్సును ఏర్పాటు చేసి వచ్చి పోయే రోగులకు చికిత్స, మందులను అందించేలా చర్యలు తీసుకున్నారు.

పెంపుడు జంతువులతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : పెంపుడు జంతువులతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మార్స్, కామ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఈ సందర్భంగా మార్స్ పెట్‌కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలిల్ మూర్తి మాట్లాడుతూ వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన గ్లోబల్ కంపెనీ మార్స్ అన్నారు. పెంపుడు జంతువుల సంరక్షణ, ఫుడ్స్, స్నాక్స్ రంగాల్లో ప్రముఖంగా ఉందన్నారు. యూగవ్ నిర్వహించిన ఈ అధ్యయనం ఇరవై దేశాలలో ముప్పై వేల పెంపుడు జంతువుల యజమానులపై ఈ సర్వే సాగిందన్నారు. ఇందులో భారతదేశంలోని యజమానులపై ప్రత్యేకంగా విశ్లేషణ జరిగిందన్నారు. పెంపుడు జంతువుల వల్ల మానసిక ఆరోగ్యానికి ఎన్నో లాభాలు ఉన్నాయని గతంలో ఎన్నో అధ్యయనాలు చెబుతున్నా.. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన సర్వే మాత్రం భారతదేశంతో సహా ఇతర దేశాల్లో పెంపుడు జంతువుల యజమానుల ఆందోళన, పని, ఒత్తిడి, నిద్రలో ఆటంకాలు, సోషల్ మీడియా వల్ల అలసట, భావోద్వేగం తదితర మెరుగుపరిచే విధానాలను వివరంగా విశ్లేషించిందన్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ లాభాలు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి మార్కెట్లలో స్థిరంగా కనిపించాయని, భారతదేశం ప్రత్యేకంగా ఉందన్నారు. 92% మంది భారతీయ పెంపుడు జంతువుల యజమానులు స్క్రీన్ టైమ్ తగ్గిందని చెబుతుండగా, ప్రపంచ సగటు ఇది 74% మాత్రమేనన్నారు. 93% మంది పని సమయంలో నిత్యం బ్రేక్ తీసుకుంటామని (ప్రపంచ సగటు 77%) చెప్పారు. 82% మంది తమ పెంపుడు జంతువులతో మాట్లాడటంతో ఎంతో రిలాక్స్ అయ్యామని (ప్రపంచ సగటు 77% శాతం) పేర్కొన్నారు. 79% మంది భారతీయులు నిద్ర బాగా పడుతుందన్నారు. ఇది అమెరికాలో 55% బ్రిటన్‌లో 43% మాత్రమేనన్నారు. 88% మంది భారతీయులు పెంపుడు జంతువుల వల్ల ఎక్కువగా ఆలోచించడాన్ని తగ్గించామని పేర్కొన్నారు. 76% మంది పెంపుడు జంతువుల వల్ల ప్రస్తుత క్షణాలను ఎంతో ఆస్వాదిస్తున్నట్లు తెలిపారు. సర్వేలో బయటపడిన విషయాలు భావోద్వేగంగా ఉండడంతో పాటు అత్యంత ముఖ్యమైనవిగా మారాయన్నారు.

ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా కుట్టుమిషన్ల పంపిణీ

విశాలాంధ్ర - కాప్రా : కాంగ్రెస్ ప్రభుత్వం హయంలోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు ప్రవేశపెట్టిందని అందులో భాగంగా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మల్లాపూర్ డివిజన్ మైనారిటీ లబ్ధిదారులకు ఉచిత కుట్టు మెషిన్ల పంపిణి చేశారు. గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మల్లాపూర్ డివిజన్ మైనారిటీ లబ్ధిదారులకు ఉచిత కుట్టు మెషిన్లను అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మైనారిటీ సోదరీమణులు తమకు అండగా నిల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప్పల్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డిలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ హయాంలోని మైనార్టీలకు అనేక పథకాలతో పాటు రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దేనని మైనార్టీ మహిళలు అన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర - కొత్తూరు : రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. బుధవారం నందిగామ మండలంలో తహసీల్దార్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి మండలంలోని రంగాపూర్, బండోనిగూడ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో పాల్గొన్న పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ధరణితో ఇబ్బందులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు పరిచిందని అన్నారు. అందులో భాగంగానే రైతులు అధికారుల చుట్టు తిరుగకుండ గ్రామాల్లోనే సదస్సులు నిర్వహించి అధికారులు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. రైతులు పలు రకాల భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు దరఖాస్తులు చేసుకున్నారు. రంగాపూర్ గ్రామంలో సుమారు 18, బండోని గూడలో 27 దరఖాస్తులను రైతులు తమకు అందజేశారని, ఈ ఫిర్యాదులను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ రాజేశ్వర్ వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కి మద్దతుగా ర్యాలీ

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన జస్టిస్ పీసీ గోష్ కమీషన్ విచారణకు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవనున్న నేపథ్యంలో గులాబీ దళపతి మద్దతుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో బిఆర్కే భవన్‌కు తరలివెళ్లగా, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బిఆర్కే భవన్ వరకు భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలను చేర్పించాలని అంగన్వాడి సూపర్వైజర్ శ్రీలక్ష్మి కోరారు. అంగన్‌వాడి కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో 3ఏళ్లు దాటిన పిల్లలందరికి అక్షరాలు, అంకెలు, ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిం చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆంజనేయులు, శ్రీలత ఏఎన్ఎం జాన్సీ రాణి, గ్రామ కార్యదర్శి సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్లు, చిన్నపిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-దుండిగల్: విద్యుత్ వైర్ల సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని బిజెపి దుండిగల్ మున్సిపల్ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ తలారి వాళ్ల బావి దగ్గర గత 20 రోజుల క్రితం వరి కోత కొయ్యకముందు వ్యవసాయ పంట పొలాల్లో విద్యుత్ లైన్ చేతికి అందే స్థాయిలో కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారి ఏఈ కి తెలిపినా ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతుల తరఫున మున్సిపల్ అధ్యక్షులు పిసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం పొలాల్లో ఏర్పరిచిన విద్యుత్ లైన్లు, నేలకొరిగిన స్తంభాలపై విద్యుత్ అధికారులు పర్యవేక్షణ చేసి సమస్యకు స్వస్తి పలకాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను వెంటబెట్టుకొని పది రోజుల నుండి కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగిన ఏఈ అందుబాటులో ఉండటం లేదని, ఇంత నిర్లక్ష్యంగా విద్యుత్ అధికారుల పనిచేయడం సిగ్గుచేటు అన్నారు. రైతుల పొలం పొలంలో ట్రాన్స్ ఫార్మర్,కంచె, లూస్ పోల్స్, లూస్ వైరింగ్ సమస్యను పట్టించుకునే దిక్కు లేదని మండిపడ్డారు. ఎప్పుడేం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారని తెలిపారు. ట్రాన్స్ ఫార్మర్‌కు చుట్టూ కంచె లేక మల్లేష్ యాదవ్ పాడి బర్రెలు మరణించాయని, దానికి కూడా పరిహారం రాలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని, లేనియెడల త్వరలో రైతులతో కలిసి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని బిజెపి తరఫున హెచ్చరించారు.

మార్క్సిజం, లెనినిజం అజేయం

- మోదీ హయాంలో ప్రజాస్వామ్యం ఖూనీ
- ఎర్రజెండాలు ఏకమై బీజేపీని సాగనంపుదాం
- సీపీఐ శ్రీకాకుళం జిల్లా మహాసభలో నారాయణ

విశాలాంధ్ర-పాతపట్నం(శ్రీకాకుళం): బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ఉద్భవించిన మార్క్సిజం, లెనినిజాన్ని ఆపడం ఎవరితరం కాదని, అవి అజేయమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ స్పష్టంచేశారు. సీపీఐ 25వ శ్రీకాకుళం జిల్లా మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత స్థానిక సెయింట్ ఆన్స్ కాన్వెంట్ నుంచి సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన బహిరంగ జరిగింది. నారాయణ మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి... ఓట్ల కోసం ప్రధాని మోదీ నానాతంటాలు పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ... రాజ్యాంగాన్ని అపహస్యం చేసేలా బీజేపీ విధానాలు ఉన్నాయని, మతోన్మాద బీజేపీని సాగనంపకపోతే దేశ భవిష్యత్తుకు ప్రమాదం పొంచి ఉందని నారాయణ హెచ్చరించారు. కమ్యూనిస్టులు, నక్సలైట్ల సిద్ధాంతాలు ఒకటే అయినప్పటికీ ఎంచుకున్న విధానాలే భిన్నమైనవన్నారు. 2026 మార్చి నాటికి నక్సలిజం లేని దేశాన్ని చేస్తామంటున్న ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నరమేధం సృష్టించి... మేధావులు, సిద్ధాంతకర్తలను పొట్టన పెట్టుకుంటున్నారన్నారు. టెర్రరిస్టులతో కాల్పుల విరమణ ప్రకటించిన మోదీ సర్కారు... దేశ ప్రజల కోసం నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పోరాడుతున్న నక్సలైట్లతో కాల్పుల విరమణకు ఎందుకు ముందుకు రావడం లేదని ఆయన ప్రశ్నించారు. నక్సలిజం లేని దేశాన్ని తయారు చేయడం పక్కనపెట్టి... నిరుద్యోగం లేని దేశాన్ని తయారు చేయాలని డిమాండ్ చేశారు. దేశ సంపదను కార్పొరేట్‌లకు ధారాదత్తం చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు. దేశంలో దారిద్ర్యాన్ని రూపుమాపినట్లు కాకమ్మ కథలు చెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో ఆకలి చావులకు కొదవ లేదన్నారు. రెండు పూటలా ఆహారం అందని కుటుంబాలు అనేకం ఉన్నాయన్నారు. బీజేపీ విధానాలను ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులు పెడుతున్నారని, న్యాయవ్యవస్థపై దాడులు చేసేంత దుర్మార్గపు స్థితిలో బీజేపీ ప్రభుత్వం ఉందన్నారు. రాజ్యాంగాన్ని మనమే కాపాడుకోవాలని, బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపితేనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. నక్సలైట్లుకు కూడా తమ పంథాను విడనాడి... కమ్యూనిస్టులతో కలిసి వస్తే ఎర్రజెండాలు ఏకమై బీజేపీ ప్రభుత్వాన్ని పాలదోలవచ్చని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు మోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారాయన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మోదీని ప్రశ్నించడం మర్చిపోయారని విమర్శించారు. వైసీపీ హయాంలో ప్రజా పంపిణీ వ్యవస్థలో వచ్చిన ఎండీయూ ఆపరేటర్లను కూటమి ప్రభుత్వం తొలగించడం భావ్యం కాదని, కాంట్రాక్టు ఉన్నంతవరకు వారిని కొనసాగించాలన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీపీఐ ముందుంటుందని, కమ్యూనిస్టుల బలం మరింత పెరగాలని, యువత కమ్యూనిజం వైపు అడుగులు వేయాలని కోరారు. ఆగస్టులో ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో చండీగఢ్‌లో జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్, సనపల నర్సింహులు, ఎస్.నారాయణస్వామి, ఎం.యుగంధర్, కె.శ్రీనివాసరావు, ఆరేళ్లమ్మ, చిక్కాల గోవిందరావు, సమితి సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని నారాయణ కోరారు. బహిరంగ సభ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు పూర్తి చేసి రాయలసీమకు నీరు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంటున్నారని, ఇది పూర్తి కావాలంటే తెలంగాణతో ఉన్న సమస్యలు పరిష్కారం కావాలని, దీని నిర్మాణానికి భారీగా నిధులు అవసరమన్నారు. ముందుగా పాత ప్రాజెక్టులు పూర్తి చేసి... తరువాత కొత్త ప్రాజెక్టులపై ఆలోచన చేయాలన్నారు. వంశధార నదిపై నిర్మించతలపెట్టిన నేరడి ప్రాజెక్టును పూర్తిచేయాలని, ఏపీకి ఒడిశాతో ఉన్న జల సమస్యల పరిష్కారానికి ఇదే సరైన సమయమన్నారు. రెండు రాష్ట్రాల్లో ఎన్‌డీఏ ప్రభుత్వాలే ఉన్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు.

విశాఖలో సివిల్ ఏవియేషన్ వర్సిటీ

ఆకర్షణీయంగా విజయవాడ విమానాశ్రయ టెర్మినల్ డిజైన్లు
సీఎం చంద్రబాబు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖలో సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటును పరిశీలించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విజయవాడ, విశాఖ సహా రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయాల నుంచి దేశంలోని వివిధ నగరాలకు, అంతర్జాతీయ నగరాలకు కనెక్టివిటీ విషయంలోనూ శ్రద్ధ పెట్టాలన్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ భవనాల నిర్మాణ పురోగతిపై బుధవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. దీనికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఆ శాఖ ఉన్నతాధికారులు, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ వర్చువల్‌గా హాజరయ్యారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ టెర్మినల్ భవన నిర్మాణం డిజైన్లు అత్యంత ఆకర్షణీయంగా, విభిన్నంగా ఉండాలని సీఎం అధికారులకు సూచించారు. ఆయా అంశాలపై ఎయిర్‌పోర్టు అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, జాతీయ రహదారిని అనుసంధానించేలా ర్యాంప్ నిర్మాణం తదితర అంశాలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. టెర్మినల్ భవనం ఎలివేషన్, డిపార్చర్, అరైవల్ బ్లాక్‌లు, ప్రయాణికుల లాంజ్‌లు ఇలా వేర్వేరు ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా డిజైన్లు ఉండాలని స్పష్టంచేశారు. మన సంప్రదాయ నృత్యకళ కూచిపూడి, కొండపల్లి బొమ్మలు, అమరావతి చిహ్నాలు, లేపాక్షి కళాకృతులతో డిజైన్లు రూపొందించాల్సిందిగా సీఎం చెప్పారు. రాష్ట్రంలో కడప, రాజమహేంద్రవరం టెర్మినల్ భవన నిర్మాణాలకు సంబంధించిన పురోగతిని రామ్మోహన్‌నాయుడు సీఎంకు వివరించారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం జిల్లా పలాస విమానాశ్రయాల సాంకేతిక అంశాల నివేదికపై పనిచేస్తున్నామన్నారు. అమరావతిలో విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి భూమిని పరిశీలిస్తున్నామని, దీనికి సంబంధించి రైట్స్ బృందం త్వరలో నివేదిక ఇస్తుందన్నారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పూర్తి చేస్తే రెండేళ్లలో ప్రాజెక్టు చేపడతామన్నారు. విజయవాడ, విశాఖ విమానాశ్రయాల నుంచి 40 శాతం మేర ఆపరేషన్లు పెరిగాయని వివరించారు. విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, కర్నూలు విమానాశ్రయాల నుంచి దేశీయంగా వివిధ నగరాలకు కనెక్టివిటి పెంచేందుకు ఆపరేటర్లు ముందుకు వస్తున్నారన్నారు. ట్రూజెట్ సంస్థ విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు అక్టోబరు నుంచి సర్వీసులు నడిపేందుకు ముందుకు వచ్చిందని, మరోవైపు విజయవాడ- సింగపూర్, తిరుపతి-మస్కట్ మధ్య త్వరలోనే విమాన సర్వీసులు మొదలు కానున్నట్టు కేంద్రమంత్రి వివరించారు. సెప్టెంబరు తర్వాత సీ ప్లేన్ ఆపరేషన్లు ప్రారంభమవుతాయన్నారు. భోగాపురం విమానాశ్రయం వద్ద పెట్టుబడులకు కతార్ ఏవియేషన్ ఫండ్ ఆసక్తి కనపరుస్తోందని తెలిపారు.

బడికి వేళాయే: నేటి నుంచి తరగతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలకు బయలుదేరనున్నారు. వేసవి సెలవులు ముగియడంతో గురువారం నుంచి తరగతులు మొదలవుతాయి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల పని వేళలు ఉండనున్నాయి. ఏప్రిల్ 24 నుంచి ఈనెల 11 వరకు 50 రోజుల సెలవుల తర్వాత పాఠశాలల పునఃప్రారంభంతో విద్యార్థులు ఆసక్తిగా ఉన్నారు. తమ పిల్లల కోసం కొత్త పుస్తకాలు, బ్యాగ్‌లు, పెన్నులు కొనుగోలులో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలు, ఫీజుల చెల్లింపుల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. బడులు తెరచిన మొదటి రోజే విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. తల్లికి వందనం పథకం కింద తల్లిదండ్రుల ఖాతాల్లో డబ్బు ఈనెల 12న జమ చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో లబ్ధిదారులంతా ఎదురు చూస్తున్నారు. తల్లికి వందనం సొమ్ముతో పిల్లల విద్యావసరాలను తీర్చుకోవచ్చని ఆశిస్తున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఏపీఎస్‌ఈఆర్టీ అకాడమిక్ క్యాలెండర్ 316 దినాలను ప్రకటించగా, ఇందులో పని దినాలు 233, సెలవులు 83గా నిర్ధారించారు.

యోగా డేపై ఇంటింటి సర్వే

విశాలాంధ్ర-సచివాలయం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారా అంటూ రాష్ట్రంలో సర్వే జరుగుతోంది. యోగాపై ఆసక్తి ఉన్నవారు ఎంత మంది? విశాఖపట్నం వెళ్లేందుకు సిద్ధమైన వారు ఎంత మంది? తదితర అంశాలను తెలుసుకునేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధ్వర్యంలో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి... ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. విశాఖ కార్యక్రమంలో పాల్గొంటారా లేదంటే స్థానిక సచివాలయంలో కార్యక్రమానికి వెళతారా అంటూ ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. పాల్గొంటానన్న వారి ఫోన్‌కు ప్రత్యేకంగా ఓటీపీ వస్తోంది. దానిని చెబితే ఆ వ్యక్తి వివరాలు యాప్‌లో నమోదవుతాయి. ఈనెల 21న జరిగే విశాఖ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. రెండు కోట్ల మందికిపైగా యోగాసనాలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం రాత్రి వరకు 2,04,64,831 మంది నమోదయ్యారు. యోగాను ప్రోత్సహించేందుకు ఆసక్తి గలవారికి ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇప్పిస్తోంది.

మోదీ మెప్పు కోసమే 'యోగాంధ్ర'

రూ.కోట్లలో ప్రజాధనం వృథా

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసమే విశాఖలో ఈనెల 21న యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించేందుకు సంకల్పించిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరికీ పనికిరాని కార్యక్రమానికి రూ.కోట్లు వృథా చేయాల్సి వస్తోందని అధికారులే మదన పడుతున్నారు. ఇప్పటికే గత నెల రోజులుగా రాష్ట్ర, జిల్లా అధికార యంత్రాంగమంతా మరో పని చేయకుండా, కేవలం యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నిమగ్నమయ్యారు. అందులో భాగంగానే ప్రభుత్వం నిత్యం యోగాసనాల రిహార్సల్స్ పేరిట అన్ని శాఖలను, అన్ని సంస్థలను భాగస్వామ్యం చేసి ప్రజాసేవకు వినియోగించాల్సిన విలువైన సమయం వృథా చేస్తోందని ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులు జిల్లాల్లో అనేకసార్లు పర్యటించి ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. అన్ని శాఖల అధికారులు ఇంకో పని లేకుండా యోగాంధ్ర పేరిట నిత్యం బిజీ బిజీగా ప్రజా సమస్యల పరిష్కారాల్లో శ్రద్ధ చూపడం లేదని అనేకమంది పెదవిరుస్తున్నారు. మంత్రులు, లోకేశ్ వంటి నేతలు సైతం యోగాంధ్ర ఏర్పాట్లపై సమీక్షలు చేయడం పై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ప్రధాని మోదీతో బంధం మరింత బలపడేందుకే , ఆయన మెప్పు కోసమే ఇలాంటి కార్యక్రమాలు సీఎం చంద్రబాబు చేపడుతున్నారని... ప్రజలకు చేసిందేమీ లేదని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. విశాఖలో అభివృద్ధి కార్యక్రమాల కన్నా ఈవెంట్లే అధికంగా సాగుతాయని మేధావులు సైతం అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల పెట్టుబడిదారులకు, కాంట్రాక్టర్లకు, వ్యాపారులకు మేలు జరుగుతుందే గానీ పేద, సామాన్య ప్రజలకు ఆంక్షలు, ఇబ్బందులే మిగులుతాయని అంటున్నారు. యోగాంధ్ర కోసం ప్రధాని రాకను పురస్కరించుకుని బీచ్ రోడ్డ లో చిరు వ్యాపారులకు దాదాపు వారం రోజులు పాటు దుకాణాలు బంద్ చేసుకోవాల్సిందే. రెక్కాడితే గాని కడుపు నిండని కష్టజీవుల పాలిట యోగాంధ్ర శాపంగా మారింది. పోలీసులు ఆంక్షలు, అధికారుల వేధింపుల కారణంగా చిరు వ్యాపారాలు రోడ్లపై సాగించలేని పరిస్థితి విశాఖలో నెలకొంది. అటు అధికారులు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక గత నెల రోజులుగా తీరికలేదని అనేకమంది అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరకు గ్రామాల్లో ఉపాధి హామీ కార్మికులు కూడా మండుటెండల్లో యోగాసనాలు వేయాలని ప్రభుత్వం చెప్పడంపై యోగాంధ్ర ప్రచారం ఏస్థాయికి వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. అన్ని ప్రభుత్వ శాఖల్లో రోజు యోగాసనాలే దర్శనమిస్తున్నాయి తప్ప మరో పని జరగడం లేదు. ప్రధాని మోదీ రాక సందర్భంగా జన సమీకరణ భారీగా చేపట్టి... ఆయన మెప్పు పొందడమే లక్ష్యంగా ప్రభుత్వ ఆలోచన ఉందని... ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడని ఈ కార్యక్రమానికి కోట్ల రూపాయల ధనం వృథా చేస్తున్నారని అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది.

రైతు పక్షపాతి చంద్రబాబు: నిమ్మల

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: తమది రైతు పక్షపాతి ప్రభుత్వం అని, రైతులంతా సుభిక్షంగా ఉండాలంటూ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. కల్లూరు మండలం తడకన పల్లె గ్రామంలో బుధవారం ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పొలం దున్ని, ఉల్లి విత్తనాలు చల్లారు. మీడియాతో మాట్లాడుతూ పవిత్రదినమైన ఏరువాక పౌర్ణమి రోజున వ్యవసాయ పనులు ప్రారంభించి, పంటలు సుభిక్షంగా పండించుకోవాలని ఆకాంక్షించారు. 2014- 2019 కాలంలో టీడీపీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ కల్పించి, వ్యవసాయ పనిముట్లపై 50శాతం సబ్సిడీ ఇచ్చి వ్యవసాయాన్ని ప్రోత్సహించినట్టు చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డ్స్ ఇప్పించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యక్షంగా ఏరువాకలో పాల్గొని, పొలం బాట పట్టారని, అప్పుడు వ్యవసాయం అంటే పండుగలాగా జరిగేదని వివరంచారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాయలసీమ రైతాంగానికి అన్ని విధాల సహాయం అందించి... రైతే రాజు , రైతే దేశానికి వెన్నెముకలా ఉండే విధంగా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం పంట కాలువలలో తట్ట మట్టిని కూడా తీయించలేదని విమర్శించారు. గత టీడీపీ హయాంలో ప్రాజెక్టులు నిర్మించినప్పటికీ, వాటి నిర్వహణ పనులకు వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. రాష్ట్రం అన్ని విధాల సుభిక్షంగా ఉండాలన్న ఆశయంతో పనిచేస్తున్నామని మంత్రి నిమ్మల చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు' పుస్తకావిష్కరణలో పాపినేని

విశాలాంధ్ర-తెనాలి: సమకాలీన సమాజంలో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల సమావేశపు మందిరంలో బుధవారం ఉదయం 'సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు' పుస్తకావిష్కరణ సభ వివేక విద్యా సంస్థల డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ... రచయిత నటరాజన్ శారద సాహిత్యం నేటి సమాజానికి అవసరమని అన్నారు. శారద కలం పేరుతో చేసిన రచనలలో నటరాజన్ స్త్రీలు పడుతున్న బాధలను అద్భుతంగా చిత్రీకరించారన్నారు. లెజెండ్స్ అంటే క్రికెట్ ఆటగాళ్లు, ప్రపంచ సుందరీ మణులు అని యువత భావిస్తుంటారని, నిజమైన లెజెండ్ నటరాజన్ శారద వంటి సాహితీవేత్తలన్నారు. దయ, ప్రేమ, కరుణ వంటి గుణాలతో ఆత్మసౌందర్యాన్ని కలిగిన మదర్‌థెరిస్సా వంటి వారు నిజమైన లెజెండ్స్ అన్నారు. అటువంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలి. 'సాహిత్య బాటసారి శారద స్మృతి శకలాలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమిళనాడులోని పుదుక్కోటలో జన్మించిన శారద తెనాలి వచ్చి, హోటల్ కార్మికుడిగా పనిచేస్తూ తెలుగు నేర్చుకొని సాహితీ దిగ్గజంగా ఎదిగారని అన్నారు. ఈ పుస్తకాన్ని 1985లో అలూరి భుజంగరావు రచించారు. ప్రస్తుతం తెనాలి ఇంప్రెషన్స్ వారు పునః ముద్రణ చేశారని పెనుగొండ తెలిపారు. జనసాహితీ మాసపత్రిక సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ మన సంస్కృతీ, సంప్రదాయాలను యువత అవగాహన చేసుకోవాలంటే మన సమకాలీకులైన రచయితలు, కళాకారులు, గొప్పవారి గురించి తెలుసుకోని, ఉన్నతస్థాయికి చేరుకునే మార్గ అన్వేషించాలన్నారు. తొలుత అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు స్వాగతం పలికారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ఉమా రాజశేఖర్, నటరాజన్ శారద కుమార్తె శారద, కుమారులు సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి, ఆలూరి భుజంగరావు కుమార్తె ఉషారాణి ప్రసంగించారు. ముత్తేవి రవీంద్రనాథ్, మొవ్వా సత్యనారాయణ, ప్రొఫెసర్ లలితానంద ప్రసాద్, కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల కోసం ఆందోళనలు

వైసీపీ అధినేత వైఎస్ జగన్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని, ఏ రైతు చూసినా తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. వరి, మిర్చి, పొగాకు సహా ఏ పంటలు చూసినా గిట్టుబాటు ధర లేదన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా పొదిలిలో పర్యటించారు. పొగాకు వేలం కేంద్రం వద్ద రైతుల ను పరామర్శించి వారితో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం రైతులను పట్టించుకునే పరిస్థితి లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ జిల్లాలో ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కొండపి, పర్చూరులో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని, ఏ రైతు చూసినా తక్కువ ధరలకు తమ పంటలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని జగన్ అన్నారు. వరి, మిర్చి, పొగాకు పంటలు చూసినా గిట్టుబాటు ధర లేదన్నారు. రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోతే కచ్చితంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని, రైతుల పక్షాన వైసీపీ పోరాడుతుందని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అంతకుముందు పొదిలి వేలం కేంద్రంలోని పొగాకు బేళ్ల కొనుగోళ్లను జగన్ పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కింద యంత్రాలు, ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా క్రింద ఏటా రూ. 20వేలు చెల్లించామని తెలిపారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాదయినా నేటికీ రైతులకు ఒక్క రూపాయి ఇవ్వకపోగా వారు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రకాశం జిల్లాకు తాను వస్తున్నానని తెలిసి పొగాకుకు కొంతరేట్లు పెంచారని తెలిపారు. తొలుత హెలికాప్టర్‌లో దరిశి రోడ్ లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగిన జగన్... అనంతరం రోడ్డు మార్గంలో రథం రోడ్డు మీదుగా పెద్ద బస్టాండ్ చేరుకుని పొగాకు వేలం కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, దరిశి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, కారుమూడి నాగేశ్వరరావు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇంఛార్జి చుండూరి రవి, వైసీపీ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, కనిగిరి ఇంఛార్జి దద్దాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జగన్ గో బ్యాక్'

మహిళల నిరసనలు... ఉద్రిక్తం

ప్రకాశం జిల్లా పొదిలిలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌కు నిరసన సెగ తగిలింది. సాక్షి టీవీ ఛానల్‌లో అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారానికి సంబంధించి... జగన్ క్షమాపణ చెప్పాలంటూ మహిళలు నల్లబెలూన్లు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జగన్ గో బ్యాక్ అంటూ తెలుగు మహిళలు నినాదాలు చేస్తూ...నల్లబెలూన్స్ గాల్లో వదులుతూ పొదిలిలోని బస్టాండ్ కూడలి, కొనకనమిట్ల కూడలిలో నిరసనకు దిగారు. జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వైసీపీ-టీడీపీ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు దిగారు. దీంతో కొంతమందికి చిన్నపాటి గాయాలయ్యాయి. వీరిలో ఒక పోలీసు కానిస్టేబుల్ కూడా ఉన్నారు. రాళ్ల దాడిలో గాయపడ్డ కానిస్టేబుల్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఒక దశలో జగన్ కాన్వాయ్‌పై కూడా చెప్పులు విసిరారు. మొత్తం మీద తీవ్ర ఉద్రిక్తత నడుమ జగన్ తన పర్యటన ముగించారు.

6న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా నర్సింగ్‌కు మంచి ఉపాధి అవకాశాలు, ఆదరణ ఉన్నాయని నర్సింగ్ కోర్సు చేసేవారికి ఇదొక సదవకాశమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ తెలిపారు. వర్సిటీ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఎస్సీ నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లకు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష (ఏపీఎన్‌సీఈటీ-2025) నిర్వహించాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తెలియజేసిందని, అందుకు అనుగుణంగా గత నెల 27న నోటిఫికేషన్ విడుదల చేశామని వివరించారు. జులై ఆరో తేదీన ఏపీఎన్‌సెట్ నిర్వహిస్తున్నామన్నారు. దరఖాస్తులను ఈనెల 20వ తేదీ వరకు స్వీకరిస్తున్నామన్నారు. గతంలో ఈఏపీఎమ్ సెట్ ఫలితాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరిగేదన్నారు. రాష్ట్రంలో 13,710 నర్సింగ్ సీట్లు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఉన్నాయని, ఇప్పటికే ఐదు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని, ముున్ముందు ఇవి 15 వేలకు పెరుగుతాయని వివరించారు. జులై 1న బీసీ రాయ్ దినోత్సవం సందర్భంగా పాటించే జాతీయ డాక్టర్ల దినోత్సవంనాడు పది మంది ఉత్తమ సేవలు అందించిన డాక్టర్లకు అవార్డులు అందిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నర్సుల కొరత చాలా ఉందని, ఇక్కడ నర్సింగ్ కోర్సు చేసి చాలామంది విదేశాల్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా అక్కడ పనిచేయడానికి ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ దేశాలకు, జర్మనీ దేశాలకు వెళ్తున్నారని తెలిపారు. 100 మార్కులకు నిర్వహించే ప్రవేశ పరీక్ష... ఇంగ్లీషు, నర్సింగ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఉంటుందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం వెయ్యి మందికి ముగ్గురు నర్సులు ఉండాలని, దేశంలో ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.